
ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక




హైద్రాబాదు మిలిటరీ గవర్నరు
మేజరు జనరల్ జయంతనాథ్ చౌదరి

6-10-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు



హైద్రాబాదు విజయాభినందన దినోత్సవమునాడు ఢిల్లీలో ఉపన్యసించుచున్న గవర్నరు జనరలు రాజాజీ, విద్యామంత్రి ఆజాద్ గారలు.



ఔరంగాబాదు ముస్లిం పెద్దలు భారతసైనికులతో ఆహ్వానపురస్సరముగా సంభాషించుచున్నారు.




భారతసేనల ప్రవేశముతో శాంతిపరిస్థితు లేర్పడినవి. ఔరంగాబాదులో సైనికులు పండ్లు బేరము చేయుచున్న దృశ్యము.


హైదరాబాద్ సంస్థానంలో శాంతి స్థాపన



భారతసేనలకు హైదరాబాదు ముస్లిమ్ ప్రజలవల ఆహ్వానము.



న్యూఢిల్లీ నెహ్రూపార్కులలో "వందనసమర్పణదినోత్సవ" సందర్భంలో స్వామీ రామానందతీర్థ ఉపన్యసిస్తున్నదృశ్యము.



బందీ అయిన కాశీం రజ్వీ



అస్వస్థులుగా యున్న శ్రీ కె. ఎమ్. మున్షీ గారిని బొంబాయి విమానాశ్రయంలో విమానంనుండి స్ట్రెచరుమీద దింపిన దృశ్యము

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా


నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్ (మహాభారతము)

సంపుటము 41

సంచిక 5


Founder : K. NAGESWARA RAO

సర్వధారి సంవత్సర ఆశ్వయుజ శుద్ధ చవితి బుధవారము



"హెచ్. యం. ఐ. యస్. ఢిల్లీ"

బొంబాయి రేవులో ప్రథమ భారత యుద్ధనౌకకు స్వాగతము



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ అక్టోబరునెల 6-వ తేదీ బుధవారము

హైదరాబాద్

భద్రతామండలికి తప్ప హైదరాబాద్ సమస్య, సమస్యగా తీరిపోయినది. భద్రతామండలి ఇంకనూ దానిని పట్టుకొని వేలాడినప్పటికీ భారతదేశములోని సంఘటనలగతిని మార్పజాలదు. ఈ అంశమును చర్చనీయాంశముల నుండి తొలగించవలసినదని చైనా ప్రతిపాదించుననీ, కనడా బలపరచుననీ అందుకు మిగిలిన దేశ ప్రతినిధులు కూడ అంగీకరింపవచ్చునని సూచింపబడినది. చివరికి ఏ నిర్ణయము లేకనే భద్రతామండలియందు హైదరాబాదు నాటకము ముగియగలదు.

ఇక హైదరాబాద్ ముందుగతిని గూర్చి మాత్రమే ఆలోచించవలసియున్నది. ఈ విషయమై అనేకమంది అనేక సూచనలు చేసిరి. నైజామును పదభ్రష్టునిచేసి, సంస్థానమును భాషాప్రాంతముగ విభజించి ప్రక్కన నున్న యూనియను భాషాప్రాంతములతో చేర్చివేయవలె ననునది ఈ సూచనలందున్నది. సంస్థాన భవిష్యత్తును సంస్థాన ప్రజలు, భారతప్రభుత్వమూ నిర్ణయించవలెనుగాని ఇతరులెవరూ జోక్యము కలుగజేసికొన అవసరము లేదని స్వామీ రామానంద తీర్థ విస్పష్టముగ తెలియజెప్పెను. ఈ విధముగ చెప్పటలో కేవలము సర్ మీర్జా మొదలయినవారి జోక్యమును మాత్రమే ఆయన మనస్సునందుంచుకొనె ననుటకు వీలులేదు. బహుశః సంస్థానవిభజనను కూడ దృష్టిలో నుంచుకొనికూడ ఈమాట అనెనేమో అని ఊహించవచ్చును. అంతేకాక, విభజన అనునది భాషారాష్ట్రము ఏర్పడువరకు ఆలోచనీయము కాదని, అపుడుకూడ సంస్థాన ప్రజాభిప్రాయమును తెలిసికొని వ్యవహరించవలసి యుండుననికూడ ఆయన తెలియజెప్పెను. అన్ని సంస్థానముల వలెగాక హైదరాబాదును మాత్రము విభజించవలెనను సూచన వచ్చుటకు, నైజాము యూనియన్‌లో చేరక, స్వతంత్రుడుగా, నుండ ప్రయత్నించుటే మూలము. అదృష్టవశాత్తు తేలికగ తేలిపోయినది గాని, లేనియెడల పోలీసుచర్య యుద్ధము క్రింద పరిణమించి యుండెడిది. పరిస్థితి ఇంతవరకూ వచ్చుటకు నైజామునకు బాధ్యత లేదని చెప్పుటకు వీలులేదు. అదివరదాకా లేనిబలము బ్రిటిషు సార్వభౌమత్వము తొలగిపోయిన వెంటనే - అనగా ఆగస్టు 15-న రజాకర్లకు అమాంతముగ వచ్చినదనుటకు వీలులేదు. అలా రజాకర్ల అధికారము దినదినమునకు పెరిగిపోవుచున్న అపుడే బ్రిటిషువారికి ఆ సంగతి తెలియజెప్పియుండవచ్చును గదా? కాబట్టి నైజాము కేవలము నిర్దోషి అనుటకు వీలులేదు. అదీకాక, అతను అధికారము లేని అధిపతికూడ కాడు. సర్వాధికారము అతనే నిర్వహించుచుండెను. లాయకాలీ మంత్రివర్గము తనను బందీగ యుంచిన దనుట నమ్మదగినమాట కాదు. ఆ అపనమ్మకమే అతని పదభ్రష్టుని చేయవలెనను సూచన వచ్చుటకు ప్రధాన కారణము. భారతప్రభుత్వ పోలీసుచర్య రేపు ప్రారంభమవుననగా కార్యాచరణ సంఘము నైజామును పదభ్రష్టుని చేయవలెనని సూచించినది. తరువాత ఆ వైఖరిని మార్చుకొనినది. బహుశః ఈ మార్పుకు భారతప్రభుత్వ సలహాయే కారణమై యుండవచ్చును. వారీవిధమైన సలహా నిచ్చుటకు తగిన కారణము లుండవచ్చును. అయితే కొందరు ఇపుడున్న నైజాము స్థానమున అతని కుమారుని అధిష్టింపజేయవలె ననుచున్నారు. ఈ సూచనలో గల అర్థము బోధపడుటలేదు. పోతే నైజామువంశ ఆధిపత్యము ఇతనితో పోవలెను, లేకపోతే ఇతనితోనే సాగవలెను. అంతేకాని, ఇతనిని తొలగించి అతని కుమారుని కూర్చుండబెట్టవలె ననుటలో గల ఉపజ్ఞ వ్యక్తపడుటలేదు.

నిజమునకు హైదరాబాద్ ప్రజలు నైజాము భవిష్యత్తును తప్ప ప్రస్తుతము నిర్ణయింపవలసిన పెద్ద సమస్య లేదు. దానిమీదనే అన్నీ ఆధారపడియున్నవి. నైజామును తొలగించి, సంస్థానమును వేరుగ యుంచుట క్రమముగ కనుపడదు. భాషాప్రయుక్తరాష్ట్రము లేర్పడక మునుపు సంస్థానమును విభజించి ప్రయోజనము లేదు. మూడు భాషాప్రాంతములను ఒక ఉపప్రాంతీయ ఫెడరేషనుగా ఏర్పాటు చేయుట కూడ సమంజసము కాదు.

భారత యూనియన్‌లో చేరుట, బాధ్యతాయుత ప్రభుత్వస్థాపన, ఈ రెండు వాటంతటఅవి జరిగిపోగలవు. భారతప్రభుత్వమే అన్నీ నిర్వహించుచుండుటవల్ల ఇదివరకే, యూనియన్‌లో అంతర్భాగమైనది. ఇక ఆ విషయమున ప్లైబిసైటనునది అనవసరము; పై పెచ్చు హాస్యాస్పదముకూడ. ఇక కాకపోయిన రాజ్యాంగమును నిర్మింప పరిషత్తు ఏర్పడుటకు ఎన్నికలు జరుగవలసియున్నది. ఆ ఎన్నికలకు ముందు తాత్కాలిక ప్రభుత్వము నిర్మింపబడవలెను. సంస్థాన పరిపాలనా యంత్రమును సవ్యమైన స్థితిలో పెట్టి శాంతిభద్రతలను స్థాపించుటకు భారత ప్రభుత్వము చేయుచున్న కృషి ముగియగనే అది ఏర్పడగలదు.

రాష్ట్రమంతటా మద్య నిషేధము

చెన్నరాష్ట్ర మంతటనూ మద్య నిషేధచట్టమును అమలులోనికి తెచ్చి, మద్రాసు ప్రభుత్వము, గాంధీజీ జయంత్యుత్సవమును ఆదర్శప్రాయముగ జరిపినది.

గాంధీజీ ఆదర్శములను కార్యాచరణ రూపములో ప్రదర్శించుటకు మద్రాసు ప్రభుత్వమే మొదటినుండి ముందంజ వేయుచు వచ్చుట ముదావహము. ఈవిషయమునకూడ ప్రథమ గౌరవస్థానము మద్రాసు ప్రభుత్వమునకే దక్కినది.

మద్యనిషేధము ప్రభుత్వము అమలు జరుపుటకు స్థూల అభ్యంతరము రాబడినష్టము. ప్రజలలో యుగయుగములుగా పాతుకొనిపోయిన మద్యపాన వ్యసనాభిలాష—సూక్ష్మమును, అతివ్యాప్తమునగు అభ్యంతరము. ఈ నిషేధమువలన 17½ కోట్ల రూపాయల రాబడిని రాష్ట్రప్రభుత్వము గోల్పోవుచున్నది. మద్యనిషేధ ప్రతికూలుర కిది పెద్ద ఆధారమగు వాదముగా ఇన్నాళ్లు నిలచియున్నది. ప్రజలలో వ్యసనాసక్తికి, పౌరాణికత్వమును, మానవ సహజత్వమును నిరూపించి, పండితులు అభ్యంతరవాదములు తెల్పిరి.

ప్రజలలో వ్యసనముల ఆధారముగా ప్రభుత్వమును నిలుపుకొనజూచుట—ప్రజలలో తమ కల్మషమునకనువుగాని నైతికవృత్తిని, ధర్మశక్తిని బోకొట్టుట, నిరంకుశప్రభువుల రాజనీతి. ప్రపంచమున ఇన్నాళ్లనూ, ఏ కొద్దిగనో, ఎచ్చటనో తప్ప, ఈ నీతికే ఆధారము దొరకినది. తన్మూలముగా మద్యపాన వ్యసనమునకు పారంపర్యత్వమును, కృతకసహజత్వమును సంభవించినవి. వర్తకశ్రేష్ఠులగు బ్రిటిషు ప్రభువులు, ఈ వ్యసనమును ప్రభుత్వఆదాయమునకు ముఖ్యాధారముగా జేసి, ప్రభుత్వ ఖజానాకు పరిపూర్ణ స్వరూపమును చూపుచువచ్చిరి. ప్రజలు చితికిపోదురన్న భయము వారికి లేదు. పై పెచ్చు వారికే అది లాభదాయకము. ఔరంగజేబు విధించిన జిజియా పన్నును, బ్రిటిష్ ప్రభుత్వము భారతీయులందరిమీద విధించి, నలభై కోట్లపై ఆదాయమును నిలుపుకొనుచు వచ్చియుండిన, స్వతంత్ర భారతప్రభుత్వము ఆ పన్ను ఆదాయమును, నేడు స్వతంత్రులమగుటచే వదలుకొనవలసి వచ్చినప్పుడు, ఇంతకన్న మహాభారమే, ప్రభుత్వఆదాయమునకు మహానష్టమే, ఈ ప్రతివాదులందరికి కనబడి యుండెడిది.


ప్రధాని చెప్పినట్లు, నేటి 17½ కోట్ల రూపాయల నష్టమునూ, బీదప్రజల ఆదాయములో, ఈ వ్యసనమువలన కలుగు నష్టమును తొలగించుటచే కొద్ది కాలములో 70 కోట్ల రూపాయల ఆదాయముతో సమానముగ ప్రభుత్వమునకు పరిణమించగలదు.

ధనవంతులు, భూస్వాములవలన, ప్రభుత్వమునకు వచ్చు రాబడికన్న బీదప్రజల వ్యసనముచే వచ్చు రాబడి ఎక్కుడయియుండుట ప్రజాస్వామ్యము పేర నడచు ఏ ప్రభుత్వమునకైననూ గౌరవహీనమగు విషయము తప్ప వేరొండు కాదు. మద్రాసు ప్రభుత్వమీ అమర్యాదను తొలగించుకొని, భారతరాష్ట్ర ప్రభుత్వములకెల్ల మార్గదర్శి అయినది. ఇక రాష్ట్రప్రజల సహకారమే ప్రభుత్వముయొక్క ఈ సత్కార్యాచరణమునకు పుష్టినిచ్చి, "ఆదర్శలోభముతో యాథార్థ్యమును గుర్తించలేక నష్టపడిన అజ్ఞాను"లని ప్రభుత్వమును ప్రతివాదులు విమర్శింప నవకాశము లేకుండ చేయగలదు.

"ఈమారీ ప్రయత్నములో అపజయమందితిమేని ప్రపంచములో మద్యనిషేధ విజయమున కింక ఆస్కారమే లేదని నిరూపించినవార మగుదుము" అన్న హెచ్చరిక గమనింపదగ్గది. నేటి ప్రపంచమున, నైతికాదర్శముల బలమును, గాంధీతత్వమును, సప్రమాణముగ నిరూపించి, ప్రపంచమును సరిదిద్దవలసిన బాధ్యత భారతప్రజపైననే ఉన్నది. ఆయన ఆదర్శములలో ముఖ్యమైన మద్యనిషేధము ప్రజకు ప్రభుత్వమునకు గూడ జయప్రదమని ప్రపంచమంతకును నిరూపించవలసిన బాధ్యత మున్ముందు చెన్నరాష్ట్రప్రజపైననే పడినది. మన రాష్ట్రప్రజలీ విధ్యుక్తధర్మమును సగర్వముగా నిర్వర్తించెదరు గాక!

నేటి ప్రపంచం :

సమితిలో బర్లిన్ రగడ



బెవిన్

ద్వితీయ ప్రపంచ సంగ్రామం సమాప్తమై సరిగా మూడుసంవత్సరాలైనా తిరిగీ తిరగకముందే ప్రపంచాన్ని మళ్లీయుద్ధభీతి ఆవరించింది. ప్రపంచశాంతిని, ప్రజాశ్రేయస్సును కోరేవారికి ఇది వాస్తవంగా అత్యంత బాధాకరమైన విషయమే.

యుద్ధంవల్ల ఏసమస్యా ఎప్పుడూ శాశ్వతంగా పరిష్కారం కాదు; కాలేదు. యుద్ధం నిజమైన పరిష్కారమార్గమే అయితే, గతరెండు మహాసంగ్రామాల ఫలితంగా ప్రపంచం ఈ సరికి శాంతిసుభిక్షాలతో తులతూగుతుండవలసిందే. కాని నేటి ప్రపంచపరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా తయారైనది. ప్రపంచాన్ని ఈనాడు బాధిస్తున్నన్ని రాజకీయ సమస్యలుగాని, ఆర్థిక సమస్యలుగాని ఇదివరకెన్నడూ బాధించలేదు. ఈ సమస్యలలో అధిక భాగం ద్వితీయ ప్రపంచసంగ్రామ ఫలితంగా ఉత్పన్నమైనవే.

ప్రపంచాధిపత్య స్థాపనకోసం పాకులాడి ప్రపంచాన్ని ఐదు సంవత్సరాలపాటు భయంకర మారణ హోమంలో ముంచి వేసిన నాజీ ఫేసిస్టుశక్తుల సంహారకాండను, ద్వితీయ సంగ్రామంద్వారా పూర్తిచేశామని ఎవరైనా భావిస్తే అది శుద్ధ అవివేకమే అనిపించుకుంటుంది. నాజీ ఫేసిస్టు శక్తులను నడిపిన వ్యక్తులు హిట్లర్ ముసోలినీలు మాత్రమే పోయినారు. ఐతే వారిని పోలిన వ్యక్తులు ఈనాడూ లేక పోలేదు. అదేమాదిరి దుష్టశక్తులు రూపభేదంతో మరొకరి నాయకత్వాన ప్రపంచాన్ని నేటికీ బాధిస్తూనేవున్నవి. దక్షిణాఫ్రికాలో భారతీయులపై సాగుతున్న జాతివిద్వేష వికృత చర్యలు నాజీఫేసిస్టు చర్యలకు ఏవిధంగా భిన్నమైనవి ?

ప్రపంచాధిపత్యవాంఛనైతేం ఈనాడు లేదని ఎవరు చెప్పగలరు ? ప్రజాస్వామ్యవాదులమని పైకి బింకాలుపలికే ప్రముఖ సామ్రాజ్య దేశాలు, ప్రజల స్వాతంత్ర్య కాంక్షను ఎంతవరకు పాటిస్తున్నవి? ఇండోనీసియా, ఇండోచైనా, మలయా, ప్రజల స్వాతంత్ర్య ఉద్యమాలు, వాటిపై ఆధిపత్యం వహిస్తున్న సామ్రాజ్యదేశాలకు ఏపాటి చిత్తశుద్ధి వున్నదీ, తేటతెల్లం చేయడంలేదా ?

లోకశాంతి సంస్థాపనార్థం ఏర్పడిన ఐక్యరాజ్య సమితి అగ్రరాజ్య విభేదాలకు నిత్యక్రీడారంగంగా మారిపోలేదా ?

బర్లిన్ ప్రతిష్టంభన, అగ్రరాజ్య ఆక్రమణ క్రిందవున్న జర్మనీ సమస్య, ఏ క్షణంలోనైనా భగ్గుమనేటంతటి అతి క్లిష్ట పరిణామానికి ఈనాడు వచ్చినదంటె అగ్రరాజ్యవిభేదాలే కారణం. లోకకళ్యాణానికి అపారంగా ఉపయోగపడే అణుశక్తి కంట్రోల్ సమస్యపై ఇప్పటివరకూ ఏకాభిప్రాయం కుదరలేదంటే అగ్రరాజ్య విభేదాలే కారణం. ప్రపంచం ఈనాడు రెండు విరుద్ధకూటాలుగా పరివర్తనం చెందిందంటే ఈ విభేదాలే కారణం. యుద్ధానంతరం ఏర్పడిన ఏ సమస్యా సామరస్యంతో పరిష్కారం కాలేదంటేనూ ఈ విభేదాలే కారణం. ఈ భేదభావాలతో, విభిన్న సమస్యలతో, ప్రపంచానికి నేడు లవలేశమైనా శాంతిలేకపోతున్నది.

బెర్లిన్ సమస్యపై రష్యాతో సంప్రతించి లాభంలేదనీ, సంప్రతించినా పరిష్కారం అసంభవమనీభావించి బ్రిటను, అమెరికా, ఫ్రాన్సులు రష్యాపై భద్రతామండలిలో ఈ వారం ఫిర్యాదు దాఖలు చేసినవి. బెర్లిన్‌లో రష్యా ధోరణి ప్రపంచ శాంతిభద్రతలకు ముప్పు తెచ్చిపెట్టేటట్లుగా వున్నది కాబట్టి అవసరంగా ఈ సమస్యను పరిశీలించవలసిందని బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్ ప్రభుత్వాలు మూడూ, ఈ ఫిర్యాదులో ఆరోపణ చేసినవి. శాంతియుతమైన పద్ధతిలో సాధించలేక, తనకేమాత్రం హక్కులేని కొన్ని స్వప్రయోజనాలను, స్వార్థలక్ష్యాలను సాధించడానికి, రష్యా, దౌర్జన్య పూర్వకమైన పద్ధతులను బర్లిన్‌లో అనుసరిస్తున్నదని కూడా, మూడు పశ్చిమరాజ్య ప్రభుత్వాలు ఈ ఫిర్యాదులో సమితి ప్రధాన కార్యదర్శి ట్రిగ్వీలీకి తెలియజేసినవి. బర్లిన్ నగరానికీ, బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్ ఆక్రమణ కింద వున్న పశ్చిమ జర్మన్ భూభాగాలకూ, మధ్య రాకపోకల సౌకర్యాలన్నిటినీ రష్యా అక్రమంగా బంద్ చేసివేసిందనీ ఇందువల్ల జర్మనీ రాజధానిలో అతిప్రమాదభరితమైన పరిస్థితి ఏర్పడిందనీకూడా స్పష్టపరచడం జరిగింది. ఈ ఫిర్యాదుమీద భద్రతామండలి సమగ్రమైన చర్చ జరిపి ఒక నిర్ణయానికి రాబోతున్నది. పర్యవసానం ఏమవుతుందో భద్రతామండలి ఇచ్చే తీర్పుకు రష్యా ఏ ధోరణిలో ప్రవర్తిస్తుందో చెప్పలేము.

బర్లిన్ సమస్యమీద పశ్చిమరాజ్యాలు ఎంత తీవ్రధోరణిని అనుసరిస్తున్నదీ, ఐక్యరాజ్య సమితి సర్వసభసమావేశంలో బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఎర్నెస్ట్ బెవిన్ చేసిన ప్రసంగంవల్ల విశదమవుతూనే వున్నది.

"అణ్వస్త్ర ప్రయోగంతో ప్రపంచానికి భయంకరమైన యుద్ధవిపత్తు సంప్రాప్తమైతే అందుకు పూర్తిగా రష్యాయే బాధ్యతవహించవలసివుంటుందని ఖచితంగా చెబుతున్నాను. పరమాణుశక్తి, పతమాణుశక్తి పరిశోధనలు, మానవశాంతి సౌఖ్యాలకోసం వినియోగపడకుండాచేయడానికి, ఏ దేశమైతే అడ్డుపడి, సహాయనిరాకరణం సాగిస్తున్నదో, ఆ దేశమే, ఏటంబాంబులతో ఘోరసంగ్రామ దారుణ సంక్షోభాలు సంభవిస్తే, బాధ్యతవహించవలసివుంటుంది...పశ్చిమరాజ్యాలు పరస్పర మైత్రీ



విషిన్‌స్కీ

భావంకోసం చేసుకుంటున్న ఏర్పాట్లను రష్యన్ ప్రతినిధి 'బెదరింపు యుద్ధమని' వర్ణిస్తున్నాడు. ఇది శుద్ధఅభూతకల్పన మైగా, అగ్రరాజ్యాలన్నీ తమతమ ఆయుధబలాలను మూడోవంతుకు తగ్గించి వేసుకోవాలనికూడా రష్యా ప్రతినిధి ప్రతిపాదిస్తున్నాడు. గత యుద్ధానికి పూర్వం రష్యాకు పదిలక్షలమంది సైనికులుమాత్రమే వుండేవారు. ఇప్పుడు 30 లేక 40 లక్షలమంది వున్నారు. ఈ పరిస్థితులలో రష్యా అస్త్రసన్యాస ప్రతిపాదనలనుచేస్తే వాటిని నమ్మేదెవరు ? మనం ఆశించిన ఏకప్రపంచ వ్యవస్థా నిర్మాణం సాధ్యపడకపోతే ప్రాంతీయ రాజ్యకూట నిర్మాణవిధానాన్నైనా ఇక అనుసరించక తప్పదు. ఎవరితో సహకరించి పనిచేయడానికి వీలవుతుందో ఎవరితో అట్టిది సాధ్యపడదో ఇప్పుడే తేల్చుకొని, రాగల ప్రమాదాలను ఎదుర్కొనడం మంచిది. మనలను (పశ్చిమరాజ్యాలను) ఎవరైతే నమ్ముతారో, వారితోనే మనం స్నేహం చేద్దాము," అని బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఎర్నెస్టు బెవిన్ ఖచితంగా చెప్పాడు.

అగ్రరాజ్య సంబంధాలపైన బెవిన్ ఇంత స్పష్టంగా ప్రసంగించేసరికి, రష్యా దాని ఉపగ్రహరాజ్యాలు తప్ప మిగతా రాజ్యాల ప్రతినిధు లందరూ సంతోషం పట్టలేక మిన్నుముట్టేటట్లు సమితి సభాస్థలిలో హర్షధ్వనులు చేశారట. అమెరికా ప్రతినిధి వారెన్, బెవిన్ వద్దకు ప్రత్యేకించి వెళ్ళి కరచాలనం చేశాడు.

ఐక్యరాజ్యసమితి రాజకీయ సంఘంలో పరమాణుశక్తి కంట్రోల్ సమస్యమీద ప్రసంగిస్తూ సోవియెట్ విదేశశాఖ సహాయమంత్రి ఆంద్రీ విషిన్‌స్కీ, "అణ్వస్త్ర నిర్మాణం ఒక్క తమకు మాత్రమే తెలుసుననీ ఇతరులెవరికీ తెలియదనీ" అమెరికా వెర్రిభ్రమలో వున్నదని అన్నాడు. ఏటంబాంబుల సంపూర్తిగా నిషేధించడం అవసరమనీ, ఇప్పుడు తయారుచేసి వుంచిన వాటన్నిటినీ నాశనంచేసి మానవకోటిని ఆవహించిన భీతావహాన్ని తొలగించాలనీ కూడా ఆంద్రీ విషిన్‌స్కీ అన్నాడు. ఏటంబాంబు భయంకరమైన మారణాస్త్రమనీ, అంతర్జాతీయ పర్యవేక్షణక్రింద వున్న బాంబులను నామరూపాలు లేకుండా చేయాలనీ విషిన్‌స్కీ ప్రతిపాదన.

ఏటంబాంబు నిర్మాణ రహస్యం అసలు రహస్యమేకాదని రష్యన్ ప్రముఖులు ఏనాడో అనివేశారు.

అగ్రరాజ్యాల మధ్య అనుమానాలు, విభేదాలు నశించి పరస్పర విశ్వాసం ఏర్పడేవరకూ ఆంద్రీ విషిన్‌స్కీ సూచన ప్రకారం పరమాణు శక్తిపై సవ్యమైన కంట్రోలు ఏర్పడడంగాని, ఏటంబాంబుల ఉపద్రవం తొలగడంగాని అసంభవం. వివిధ అగ్రరాజ్యాలను యుద్ధోన్మాదం, స్వీయప్రాబల్య స్థాపన వాంఛ, వదలనంతవరకు, ఏటంబాంబుతో అవసరం తీరదు.

భారత ప్రధాని నెహ్రూ చెప్పినట్లు ప్రస్తుతం ఏదేశానికీ యుద్ధం చేయాలనే కోరికగాని, యుద్ధంచేసే సామర్థ్యంగాని లేకపోవచ్చు. కాని బ్రిటన్, అమెరికా, రష్యాలు ఈనాడు ప్రత్యక్షంగా యుద్ధసన్నాహాలు సాగిస్తూ వేటి జాగ్రతలో అవి వుంటున్నవి. సైనికోద్యోసన కార్యక్రమాన్ని తాము విరమించినట్లు బ్రిటిష్ విదేశమంత్రి బెవిన్ సమితి సర్వసభ్య సమావేశంలో చెప్పిన మాటలే ఇందుకు ప్రబలనిదర్శనం. సత్వర భవిష్యత్తులో గాకపోయినా మరొకనాటికైనా శాంతియుతంగా పరిష్కారం గాకపోతే బర్లిన్ సమస్యపైనే పశ్చిమరాజ్యాలకు, రష్యాకు, మధ్య యుద్ధం అనివార్యమై తీరుతుంది. పశ్చిమరాజ్యాల ఫిర్యాదుపై భద్రతామండలి ఇచ్చే తీర్పుమీదనే ఈసమస్య చాలావరకు ఆధారపడివుంటుంది. సమితినుండి రష్యా వైదొలగదని విషిన్‌స్కీ ప్రకటిస్తున్నప్పటికీ, రష్యా అట్టే కాలం ఇదేమంకు పట్టుతో కూర్చోడానికి వీలుండదు. మిగతా అగ్రరాజ్యలతో ఏదో ఒక రాజీధోరణికి వచ్చి సహకరించనైనా సహకరించాలి, లేదా సమితి నుండి వైదొలగనైనా వైదొలగాలి. సమితినుండి రష్యా వైదొలగడమే జరిగితే, ఈ సమితికీ నానా జాతిసమితికి పట్టిన గతే పట్టేమాటవాస్తవం.

అందుచేత బర్లిన్ సమస్యపై భద్రతామండలి ఏమి తీర్పు చెబుతుందోనని ప్రపంచం నిరీక్షిస్తున్నది.

పశువుల దివాణం

ఊహాకల్పితమైన

పెద్దకథ

మూలం : జార్జి ఆర్వెల్

అనువాదం : శ్రీ జనమంచి రామకృష్ణ

మరణదండనల ఫలితంగా కలిగిన భీతి కొంత వరకూ తగ్గిన తర్వాత, కొన్ని జంతువులకి సప్తవిధులలోని ఆరవసూత్రం జ్ఞాపకానికి వచ్చింది:

"ఏ జంతువూ మరే ఇతరజంతువునీ చంపకూడదు."

పందులముందుగాని, కుక్కలఎదటగాని ఆ ఆరవసూత్రం ఉచ్చరించడానికి భయపడినా, పశుస్వామికమతానికి విరుద్ధంగా మరణదండనలు విధించబడ్డాయనిమాత్రం జంతువులకి అర్థమైంది.

జాకీ, బెంకన్నని పిల్చి, ఆరవసూత్రం చదవమంది. కాని తానేమంటిని జోక్యం కల్పించుకోనంటూ బెంకన్న, పిచ్చాణ్ణి పిల్చి గోడమీద వ్రాసిన ఆరవసూత్రం జాకీకి చదివిపెట్టమంది.

"అకారణంగా ఏ జంతువూ, మరే ఇతర జంతువునీ చంపకూడదు!"

"అకారణంగా" అన్నమాట, జంతువులకి మునపటినుంచీ జ్ఞాపకం లేక, దరిమిలాను వ్రాయబడిందా అనే సందేహం తోచలేదు. ఆ సూత్రం చదివేక గునపం వేసిన మరణదండనలు న్యాయమైనవేననీ, అవి మనస్సుకి నచ్చచెప్పకున్నాయి.

జంతువులు క్రితం సంవత్సరంకంటె ఆ సంవత్సరం ఎక్కువగా పనిచేసినా, రత్తయ్య హయాంలో ఎంత తిండి లభించేదో, అంతే ప్రస్తుతంలోకూడా లభించింది. కాని రౌడీ మాత్రం, పంటలగురించి పెద్దపెద్ద లెక్కలు చెప్పి, జంతువులను కుషామత్తు చేసేది. జంతువులు రౌడీమాటలు విని, అన్యాయం జరుగుతున్న సంగతిమాట మర్చిపోయి చాలా గర్వపడేవి.

మునపట్లా, గునపం తిరుగు, జంతువులకి కనిపించడం మానుకుంది. ఏ పని పడేపోను దినాలలో ఓనాటు బైటకి వచ్చినా, కుక్కలు వెంట నడవగా, ఒక కోడి ముందుగా వైతాళికుడులా కూస్తూ నడిచేది. గునపం మాట్లాడే ముందు కోడి గట్టిగా, జంతువులను నిశ్శబ్దంగా ఉండమని కూసేది. గునపం, ప్రత్యేకంగా, దివాణం భవనంలో నివసిస్తూన్నట్లుకూడా వినికిడి. రెండు కుక్కలు కాపలా కాస్తూంటే గునపం ఒక్కర్తె కూర్చుని భోంచేసేది. తన పుట్టినరోజునాడు కూడా, విధ్యుక్తంగా తుపాకి కాల్చవలసిందని ఉత్తర్వు జారీచేసింది.

మునుపు గునపాన్ని మామూలుగా పేరెట్టి పిలవడం కద్దు. కాని ఇప్పుడు 'మన నాయకుడు, నేస్తం గునపం' అని పిలవాలని ఆజ్ఞ ఐంది. తిర్యగ్జంతు పితామహుడు, మానవుల పాలిటి క్రూరస్వరూపుడు, అజాదళరక్షకుడు, బాతుల మిత్రుడు మొదలైన, బిరుదులతో గునపాన్ని పందులు పిల్చేందుకు ఇష్టపడేవి. తన ఉపన్యాసాల్లో రౌడీ ఆనందభాష్పాలు రాలుస్తూ నాయకుణ్ణి పొగిడేది.

"మననాయకుడు యెంత తెలివైనవాడని! ఎటువంటి విశాలహృదయం! ఎక్కడ ఉన్నా, ఏ పనిలో నిమగ్నమైనా, తన జాతిపట్ల ఎటువంటి గాఢమైన ప్రేమ అనీ! ఇతర దివాణాలలో దాస్యపు మనుగడ సాగిస్తున్న జంతువులగురించి, వాటి విముక్తిగురించీ ఎంత ఇదిగా తాపత్రయపడతాడనీ!" ఏ అదృష్టం పట్టినా, ఏ విజయం కల్గినా, గునపం నాయకత్వఫలితమే అని జంతువులు నమ్ముతూ వచ్చాయి.

"మన నాయకుడు నేస్తం గునపంనాయకత్వం క్రింద ఆరుదినాలలో నేను ఐదుగుడ్లు పెట్టాను" అని ఒక పెట్ట మరోదానితో అనేది.

చెరువులో నీళ్లు తాగుతూ—

"నేస్తం గునపం నాయకత్వానికి మనం ఎంతేనా కృతజ్ఞులం! ఈ నీరెంత తీయగా వుంది" అని ఆవులు ఆప్యాయంగా నీళ్లు త్రాగేవి.

కవి-కూనీ 'నేస్తంగునపం' అనే పాట వ్రాసింది. నాయకుడు గునపంపట్ల జంతువులకే విధమైన భక్తి వినయవిధేయత లున్నాయో, ఆ పాట తెల్పుతుంది.

అనాథులందరికి
ఆప్తమిత్రుండు
ఆనందనిలయుమ్ము
అతని హృదయమ్ము!
చండభాస్కరు నెవరు
తేరి చూడగలండు
అతడే మానాయకుడు
అతడే మానేస్తం!
అతడే మా గునపం!
ధీరలలితుం డతడు
ధీరశాంతుం డతడే
ధీరుం డతండే!
ఈ జంతుజాతి కేన జీవమ్మోయి!
కడుపునిండా తిండి
కంటినిండా నిద్ర
కరుణించి కాపాడు
వాడె మా నేస్తం!
వాడె మా గునపం!

కవి-కూనీ వ్రాసిన పాట బాగా వుందని శ్లాఘించి, సప్తవిధుల ప్రక్కనే, ఆ పాటకూడా వ్రాయించవలసిందని గునపం ఉత్తర్వు జారీచేసింది. పాటకి పైగా రౌడీ చిత్రించిన గునపం పటం తగిలించడం కూడా జరిగింది.

తిమ్మయ్యద్వారా జరుగుతూన్న కలప బేరంలో గునపం ఏ అభిప్రాయానికీ రాలేదు. పైగా అబ్బాయినాయుడుగారు, పశువుల దివాణంమీదకి విరుచుకుపడేందుకు ప్రయత్నాలు చేస్తూన్నట్లూ కన్నయ్యకూడా సహాయపడుతూన్నట్లూ పుకారు చెలరేగింది. మూడు కోడిపెట్టలు ముందుకొచ్చి కన్నయ్య ప్రోద్బలంతో, గునపాన్ని హత్యగావించే పితూరీలో, సాయపడ్డామని చెప్పడంతోటే జంతువులన్నీ హడలెత్తిపోయాయి. తక్షణం, కోడిపెట్టలు మృత్యువాత పడ్డాయి. గునపం ప్రాణరక్షణకై తగిన జాగ్రత తీసుకోవడమైంది. నాలుగు కుక్కలు, రాత్రిపూట గునపం పక్కచుట్టూ కాపలా కాసేవి. చిన్నపంది పెంకిపిల్ల, గునపం తినే ఆహారం ముందుగా రుచిచూసి, ఎటువంటి విషప్రయోగచిహ్నాలూ లేవని గ్రహించేందుకూ, గునపంఆహారానికి హామీగా ఉండేందుకూ నియమించబడింది.

పోతురాజుతో గునపం కలపబేరం ఖాయపరచింది. తదితరవస్తువులనుకూడా పశువుల దివాణం నుంచి తనుగా కొనడానికి అతను, గునపంతో మాట ఖరారు చేసుకున్నాడు. వేసవికాలం గడిచిపోతూన్న కొద్దీ, శత్రుభయం హెచ్చయింది. తుపాకులతో సహా ఒక ఇరవైమంది మనుష్యులను వెంటేసుకుని అబ్బాయినాయుడుగారు దివాణంమీద-పడబోతున్నాడనీ, కవులు కదపాలు దొంగిలించేముందు పోలీసులకి లంచాలిచ్చి తనకి మద్దత్తుగా వుంచుకున్నాడనీ పుకారు చెలరేగింది.

పైగా పశువులదివాణంమీద కోపంకొద్దీ అబ్బాయినాయుడుగారు, తమ దివాణంలోని జంతువులను క్రూరంగా హింసిస్తున్నాడట. ముసలిగుర్రాన్ని కొరడాతో కొట్టి చంపాడట. తిండి పెట్టకండా ఆవులను మలమల మాడ్చివేశాడట. కోళ్ల కాళ్లకి కత్తులుకట్టి పోట్లాట పెట్టి, అవి, ఒకదాని పీక మరొకటి కోసుకుంటూంటే చూసి ఆనందించేవాడట. అబ్బాయినాయుడుగారి క్రూరచర్యలు వింటూన్నప్పుడల్లా జంతువులన్నీ కోపంతో ఉడుకెత్తిపోయి, అబ్బాయినాయుడుగారి దివాణంమీదకి విరుచుకుపడి, ఆయన్ని తగిమేసి అక్కడి జంతువులకి విముక్తి కల్గిద్దామని అనుకునేవి. కాని రౌడీ, అవివేకమైన తొందరపని, ఎటువంటిది చేయకద్దనీ, అన్నిటికీ నేస్తం గునపాన్నే నమ్మమనీ, అతనే క్రమంగా అన్ని జంతువులకీ విమోచన కల్గిస్తాడనీ జంతువులకి సలహా ఇచ్చింది.

ఏమైనా అబ్బాయినాయుడుగారు జంతువులకి పరమశత్రువైపోయాడు. ఒక ఆదివారం ఉదయం గునపం, జంతు సమావేశానికి హాజరై తాను కలప యెన్నడూ అబ్బాయినాయుడుగారికి అమ్మదలచలేదనీ. అటువంటి దుర్మార్గునితో ఎటువంటి సంబంధం పెట్టుకోలేదనీ చెప్పింది.

విప్లవంగురించి బైట ప్రచారం సాగిస్తూన్న పావురాలని, అబ్బాయినాయుడుగారి దివాణం పొలిమేరలపైనా వెళ్లవద్దనీ, 'మానవజాతికి మరణం' అనే సూత్రానికి బదులుగా, 'అబ్బాయినాయుడికి చావు తప్పదు' అనే కేకలు వేయమనీ, గునపం ఉత్తర్వు జారీచేసింది. ఆ రోజుల్లోనే కన్నయ్య దురంతం మరొకటి బైటపడింది. వరిచేలల్లో కలుపు యెక్కువ పెరిగిపోయింది. దానికి కారణం విత్తులు చల్లే జంతువుతో కన్నయ్యలాలూచీపడి కలుపు విత్తులు కలపడంచేతనే వరిచేలన్నీ బీడులై పోయాయనీ తెలిసింది. విత్తులు జల్లే జంతువు యథార్థం చెప్పి, నేపాళంకాయలు తిని ఆత్మహత్య చేసుకుంది. 'పశువీరుడు-మొదటితరగతి - అనే బిరుదు, గోశాలయుద్ధానంతరం కన్నయ్యకి ఇవ్వడం జరగలేదనీ, కన్నయ్య ఆ బిరుదు తనే తగిలించుకుందనీ, జంతువులనుకోడం మొదలెట్టాయి.

జనవరి మాసానికల్లా, కష్టంమీద గాలిమర నిర్మాణం పూర్తైంది. ఎటొచ్చీ యంత్రం తెచ్చి స్థాపించాలి. కష్టపడి కట్టిన గాలిమర చూసుకుని జంతువులు గర్వంతో మురిసిపోయేవి. మునపటికంటె, రెండింతల దళసరిగా గాలిమరగోడలు అవి కట్టాయి. ఏదైనా మందు పెట్టి పగలకొట్టవలసిందే కాని, ప్రాణిశక్తికా మర నిర్భేద్యము. గాలిమర తిరుగుతూంటే, విద్యుచ్ఛక్తి ఉత్పన్నమవడం—ముందు ముందు ఎక్కువ విశ్రాంతి కల్గడం మొదలైన భాలిభాగ్యం గురించి కలలు కంటూ జంతువులు ఛాతీలు విరుచుకు, గాలిమరచుట్టూరా నానా కుప్పిగంతులు వేశాయి.

కుక్కుటవైతాళికుడు 'కొక్కొరోకో' అంటూ కూస్తూ ముందు నడుస్తూంటే కుక్కలను వెంటేసుకుని గునపం గాలిమరదగ్గర కొచ్చి జంతువులను చూసి మందహాసంతో అభివందనాలర్పించి.

"నేస్తాలూ! ఈ గాలిమరకి 'గునపం మర' అని నామకరణం చేశాను" అని చెప్పింది.

రెండు దినాల తర్వాత, పాతరకొట్టులో జంతువుల ప్రత్యేకసమావేశం జరిగింది.

"నేస్తాలూ! అబ్బాయినాయుడుగారికి కలప అమ్మివేశాను. రేపు రెండెడ్లబళ్లు తెప్పించి, నాయుడుగారి బంట్రోతు కలపతోలించుకుపోతాడు".

జంతువులనోట మాట రాలేదు. అంతవరకూ అబ్బాయినాయుడుగారి పట్ల శత్రుత్వం వహించిన నాయకుడు, ఆయనతో ఇప్పుడు నేస్తం కలుపుకోడం ఆశ్చర్యం కల్గించింది. నిజానికి, పోతురాజుతో కలప అమ్మకంగురించి, బేరసారాలు చేస్తున్నా, అబ్బాయినాయుడుగార్ని పైకి తిడుతూన్నా లోలోపల రహస్యంగా, గునపం ఆయనతో స్నేహం చేస్తున్న సంగతి ఏ జంతువుకీ తెలియదు.

పోతురాజుతో ఉంటూన్న బాంధవ్యం పూర్తిగా గునపం తెంచేసుకుంది. పైగా అతనిని గురించి అవమానపరచేలా, పావురాలద్వారా, నానా కూతలూ కూయించింది. 'పోతురాజుకి మరణం తప్పదు' అంటూ పావురాలు పోతురాజు దివాణంమీద కెగిరి అరిచాయి.


"నేస్తాలూ! అబ్బాయినాయుడుగారు మనమీదకి దండెత్తి వస్తున్నాడన్నది ఉత్తపుకారు. అటువంటిమాటలు నమ్మకండి. వారి దివాణంలోని జంతువులను అతిక్రూరంగా హింసిస్తున్నాడన్నదీ పుకారే. ఈ దుష్ప్రచారానికి కారకు లెవ్వరో తెలుసా? కన్నయ్య, దాని సహచరులూను. పైగా కన్నయ్య అబ్బాయినాయుడుగారి దివాణంలో ఉండటం లేదట—చాలాకాలం పట్టి; అది పోతురాజుదగ్గర వుంటూందట."

గునపం సక్కజిత్తులమారితనం చూసి జంతువులు ఆనందంతో పొంగిపోయాయి. పోతురాజుతో స్నేహంగా ఉంటూన్నట్లు నటించి, అబ్బాయినాయుడుగారికి కలప హెచ్చుధరకి గునపం అమ్మిన సంగతికూడా జంతువులు గ్రహించి 'భేష్' అని అవి నాయకుణ్ణి మెచ్చుకున్నాయి.

"ఎవ్వర్నీ. చివరకు అబ్బాయినాయుణ్ణి కూడా మన నేస్తం నమ్మదు. అందులోనే వుంది మన నాయకుని ఘనత! నేస్తాలూ! అబ్బాయినాయుడు, కలప బాపతు సొమ్ము, నక్కరూపంలో ఇవ్వబోయాడు. కాని నేస్తం నాణాలరూపంలోనే చెల్లించవలసిందని పట్టుపట్టి ఖచ్చితంగా చెవులు వడేసి వసూలుచేసింది. ఆ డబ్బుతో గాలిమరకి కావలసిన యంత్రం కొనవచ్చును" అని రౌడీ గునపంమేధాశక్తి గురించీ వర్తకవ్యాపారచతురతగురించీ జంతువులకి చెప్పింది.

పాతరకొట్టు దొడ్లో మరో ప్రత్యేక సమా

(22 వ పేజీ చూడుడు)



దేవీ - నవరాత్రాలు

శ్రీ వావిలాల సోమయాజులు

భారతీయుల సాంఘిక జీవనంలో పండుగలు విశేషమైన ప్రాధాన్యము అనాదికాలం నుంచీ వహిస్తూ ఉన్నవి. ఆ పండుగల్లోనిగోష్ఠుల మూలంగానూ, ఇతరములైన కార్యకలాపాల వల్లనూ సంఘంలోని వ్యక్తులలో సమిష్టిజీవనం అభివృద్ధిపొందుతూ వచ్చింది. అవి జాతీయ జీవనాన్ని పెంపొందిస్తూ ఒకనాడు అనంతవైశిష్ట్యాన్ని చేకూర్చుతున్నవి. అందువల్ల అవి జనసామాన్యధర్మంలోనూ, మత విషయక జీవనంలోనూ భాగాలై నేటివరకూ నిలచి ఉన్నవి.

హిందువుల ధర్మాలూ, వైజ్ఞానిక ప్రవృత్తీ, నమ్మకాలూ, నిశ్చయాలూ వెల్లడిచేసే పండుగలు అనేకం ఉన్నవి. అట్టివాటిలో సంఘంలోని సమస్తవర్ణాలవారూ ప్రాచుర్యం వహించే పండుగలు కొన్ని మాత్రమే. నవరాత్రాలు అందులో ఒకటి. మకరసంక్రాంతి తరువాతి దీనిని అత్యుత్తమమైన పండుగగా భారతీయ ప్రజలు భావిస్తూ ఉన్నారు.

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలుకొని దశమి వరకూ వచ్చునవే నవరాత్రాలు. నవరాత్రోత్సవాలు శరత్కాలంలో జరగటంవల్ల శరన్నవరాత్రాలనీ, లక్ష్మీ, సరస్వతీ, పార్వతీ, రాజరాజేశ్వరి మొదలైన దేవీరూపాలకు ఈ నవరాత్రాల్లో పూజ జరగటంవల్ల దేవీనవరాత్రాలనీ వీటికి పేర్లున్నవి. సామాన్యప్రజ 'దశరా' అని వ్యవహరిస్తున్నారు.

రావణాసురుడు దేవీపూజ వసంతకాలంలో చేసేవాడట. శ్రీరామచంద్రుడు శరత్కాలంలో దేవీపూజ చేసి రావణవధ చేసినట్లు మహర్షి వాల్మీకి పలికినాడు.

ఈ తొమ్మిది దినాలల్లో ఆదిశక్తి మూర్త్యంతరంగా ఉన్న దుర్గాదేవీపూజ జరుగుతుంది. ఐశ్వర్యప్రద అయిన లక్ష్మిని, జ్ఞానప్రదఅయిన సరస్వతినీ విధియుతంగా ప్రజలు శక్తికొలదీ పూజాదికాలతో కొలుస్తారు. ఆశ్వయుజ శుద్ధ సప్తమినాడుగానీ, అష్టమినాడుగానీ, లేదా దశమినాడుగానీ సర్వసామాన్యంగా సరస్వతీపూజ జరుగుతుంది. వేదికమీద గ్రంథాదులను సేకరించి భారతీదేవిని ఆహ్వానించి, షోడశోపచారాలతో పూజించటం అనాదికాలంనుంచీ వస్తూ ఉన్న ఆచారం. నవమినాడు లక్ష్మిని ధన, ధాన్య, వస్త్ర, వృత్తి వస్తురూపాలతో అర్చిస్తారు.

ప్రాచీనకాలంలో రారాజుల ఇళ్లలో కల్పోక్త ప్రకారంగానే తొమ్మిది దినాలూ దేవీపూజ జరిగేది. అనుదినమూ ప్రభువులు అమాత్య సామంతాదులతో కొలువు తీర్చి విద్వద్గోష్ఠులతోనూ, సంగీత నాట్యాదికాలతోనూ, కాలం గడుపుతూ విద్వద్వరేణ్యులనూ, శాస్త్రజ్ఞులనూ, కళాకారులనూ శక్తిసామర్థ్యాలను అనుసరించి గౌరవించేవారు.

వ్యవసాయమూ, కంచరమూ, కమ్మరమూ మొదలైన వృత్తులు గల సామాన్యజనం నవమినాడు వారివారి వృత్త్యుపకరణాలను లక్ష్మీస్వరూపాలుగా భావించి, అలంకరించి, శక్తి కొలదీ జాతరలు చేసుకొనేవారు.

పదవ దినము విజయదశమి. ఈ దినాన రారాజులు సింహాసన ఛత్ర చామరాది రాజలాంఛనాలనూ, గజాశ్వాది సేనాంగాలనూ, భక్తియుతులై పూజించేవారు. క్షత్రియుల ఇళ్లలో సర్వసామాన్యంగా ఈ తొమ్మిది దినాలకోసం పూజా వేదికను ఒకదానిని నిర్మించేవారు. పూర్వం విశేషప్రాచుర్యం వహించిన తండుల కుసుమ జలవికారాది కళాకుశలులు ఆ వేదికను అలంకరించేవారు. దానిమీదనే యుద్ధోపకరణాలను, ఛత్రచామరాదులను నిలిపేవారు. ఆ వేదికమీద నిర్మించిన అగ్నికుండంలో ఆర్ష ధర్మానుసారంగా సమస్త ఆయుధ దేవతలనూ ఆవాహన చేసి సమంత్రకంగా వారి ప్రీతికోసం పాయసహోమం చేసేవారు.

పూర్వం రాజకుటుంబాలు విజయదశమినాడు చేసే కర్మలలో లోహాభిసార కర్మ మొక చిత్రమైన కర్మ. లోహు డనే రాక్షసుడు లోకభయంకరుడై దేవతలమీద దండెత్తగా వారు అతణ్ణి ముక్కలు ముక్కలుగ త్రుంచివేశారట. ఆ ముక్కలే నేటి ఆయుధాల కుపకరించే లోహాలు. లోహరాక్షసుని అవశిష్టభాగాలైన లోహాలు ఈ అభిసార కర్మవల్ల మొక్కపోవని వారి నమ్మకము. ఆయుధపూజ పరిపూర్తి అయిన తరువాత, ససైన్యంగా అశ్వాలను, గజాలను అధిరోహించి నగరానికి ఈశాన్యదిక్కుగా ఉన్న శమీవృక్షం దగ్గిరకు వెళ్లి శమీపూజ చేస్తారు. వీటి అవశిష్టరూపాలే నేడు మన పిల్లలు పట్టే విల్లవంబులూ, కోతులూ—'జమ్మికొట్టటము' శమీపూజకు మారురూపంగా నిలచిన ప్రక్రియ.

శమీవృక్షం దగ్గిర మొదట 'అపరాజిత'పూజ జరుగుతుంది. ఆమె దుర్గాదేవిమూర్తిభేదము. అష్టదళపద్మంమీద దక్షిణ నామభాగాలల్లో జయావిజయలను ఆవాహనచేసి పూజిస్తారు. దుర్గారూపమునూ 'శమీ శమయతే పాపం శమీ శత్రువినాశనీ'అని ప్రతిష్ఠ వహించిన జమ్మిచెట్టు మొదట మన్నుత్రవ్వి నీరుపోసి అక్షతలు గలిపి తిరిగివచ్చేటప్పుడు శిరస్సుమీద ధరించి రావటము లక్షణము. పరసీమలో శత్రువుల బొమ్మలనుంచి ధనుష్టంకారం చేసి వాటి హృదసీమల్లో అమ్ములు నాటి జమ్మి దాకి నెత్తిమీద ఉంచుకొని తిరిగి వచ్చి విద్వద్గోష్ఠిలోలురయ్యేవారు పూర్వపు రారాజులు. పాండవుల అజ్ఞాతవాసారంభదశలో ఆయుధాలను కట్టుకట్టి మత్స్యపుర ప్రేతభూమిలో ఉన్న జమ్మిమీద ఉంచి వెళ్లిపోయిన తరువాత ఉత్తరగోగ్రహణ సందర్భంలో అర్జునుడు గాండీవాన్ని స్వీకరించి విజయాన్ని పొందాడు. (రుద్రుడికి శ్మశానభూమి విహారస్థానము. ఆయన ఈశాన్యదిశ కధిపతి. అందువల్లనే శ్మశానాలు గ్రామాలకు ఈశాన్యదిశకు చేరువుగా ఉంటవి.) విజయదశమినాడు అర్జునుడు శత్రువిజయం చేయటంవల్ల విజయదశమి మహోత్సవాన్ని క్షత్రియులు మహోల్లాసంతో జరిగించేవారు.

నవరాత్రిఉత్సవాలు చిరకాలంనుంచీ జరుగుతున్నవి. ఒక్కొక్క దేశంలో ఒకవిధంగా నడుస్తున్నవి—అందులోని ఆచారవ్యవహారాలు. ఆర్షమైన సంప్రదాయానికీ,వీటికీ అనంతమైన విన్యాసం గోచరిస్తున్నది. దేవీస్వరూపాలు భిన్నభిన్నాలైనట్లే పూజావిధానాలుకూడా భిన్నభిన్నంగా ఉన్నవి.

దేవీపూజకు సప్తవిధాలైన కల్పాలున్నవి:
1. నవ్యమాది కల్పము. 2. ప్రతిపదాది కల్పము. 3. షష్ట్యాది కల్పము. 4. సప్తమ్యాది కల్పము. 5. అష్టమ్యాది కల్పము. 6. అష్టమీ కల్పము. 7. నవమీ కల్పము. సామాన్యులైనవారు సప్తమ్యాది కల్పాన్నీ, సంపన్నులైనవారు ప్రతిపదాది కల్పాన్నీ అనుసరించి దేవీపూజ చేస్తారు.

ప్రతిపదాది కల్పాన్ని అనుసరించి ఆశ్వయుజ శుద్ధ ప్రతిపత్తునాడు ప్రతిమా కలశస్థాపనాదులు జరిగించి దేవికి కేశసంస్కారాది ద్రవ్యాలను చేకూర్చుతారు. విదియనాడు కేశబంధనం జరుగుతుంది. తదియనాడు దేవికి దర్పణాన్ని అర్పించటమూ, సిందూరము లత్తుక మొదలైన అలంకరణ ద్రవ్యాలను సమర్పించటమూ జరుగుతుంది. చవితినాడు మధుపర్కసమర్పణమూ, నేత్రాలంకరణమూ చేయవలె. షష్టినాడు సాయంసమయంలో బిల్వతరుబోధనము జరుగుతుంది. దేవతలకు దక్షిణాయనం రాత్రి కనుక నిద్రించు దేవిని మేల్కొల్పటమే బోధనము. సప్తమినాడు స్వగృహంలో పూజ, క్రితందినం షోడశోపచారపూజ జరుగుతుంది కనుక షష్ఠిని ఉపవాసము, అష్టశక్తిపూజ, నవమినాడు ఉగ్రచండాది దేవీపూజ, బలిదానాదులూ, కుమారీపూజా చేయటం లక్షణము. దశమినాడు పూజ అయిపోయిన తరువాత మధ్యాహ్నం మంగళవాద్యాలతో, ఉత్సవాదులతో దేవీప్రతిమను నదీజలంలో నిలిపివస్తారు. దీనినే మహాపూజ అంటారు. పూర్వాచార పరాయణులైన ముత్తైదువలు 'గౌరమ్మ నీళ్లాట' అని అంటుంటారు.

ఈ కల్పాలను అనుసరించి చేసే పూజ సత్వ, రజః, తమోగుణాలను అనుసరించి సాత్త్వికి, రాజసి, తామసి-అనే విభేదాలతో ఉంటుంది. సత్వరజస్తమోగుణాత్మకమైన ఈ పూజవల్ల తత్తదర్హమైన శక్తి కలుగుతుంది. సత్వగుణప్రధానాలైన అవస్థలు మూడు. రజఃప్రధానకాలు మూడు. తమఃప్రధానకాలు మూడు. సాత్విక సాత్వికము, సాత్విక రాజసము, సాత్విక తామకములు సాత్వికావస్థలు. ఇదేరీతిగా రజస్తమస్సులలోనూ ఆయా సంబంధావస్థలు ఉన్నవి. వీటిలో శ్రేష్ఠమైన సాత్విక సాత్వికావస ఉదయించినప్పుడే వాస్తవమైన దేవీ శ్రద్ధ ఉదయిస్తుందట! పూజా విధానాలలో సాత్వికము మునికోటికి. రజోయుతాలు రాజకోటికి. తామసములు నిశాచరులకు. దిగ్దేశకాలాదికాలను తెలుసుకొని మంత్రద్రవ్య విప్రసంయుతంగా చేసేది సాత్వికము. ఇది అత్యుత్తమము. శాంతి దాంతి స్వభావులకు మాత్రమే ఇట్టి పూజా విధానము లభ్యము. రాజసములలో ద్రవ్యబాహుళ్య ముంటుంది. సురామాంసాదులతోనూ జంతుబలులతోనూ కూడినది తామసి. రాజసిలోనూ ఆమిష ముంటుంది. సాత్త్వికంలో నిరామిష నైవేద్య యజ్ఞపారాయణాదులు ఉంటవి.

దేవీ పూజ విషయమున ఉత్తర హిందూస్థానమునకూ దక్షిణ హిందూస్థానమునకూ విశేషమైన అంతరమున్నది. వారిది సప్తమ్యాదికల్పము. దాక్షిణాత్యులది ప్రతిపదాది కల్పము. ఈ రెంటికీ విశేషమైన అంతర మున్నది. వారిది తామసపూజ; అందువల్ల వారికి తుది మూడుదినాలే ప్రధానము.

ఉత్తర హిందూదేశంలో పురాణాదులలో వర్ణితమైనట్లు దుర్గారూపమును మృత్తికాదులతో నిర్మించి ప్రతిష్ఠించి పూజచేస్తారు. ఈ విగ్రహానికి, కుడవైపు సరస్వతీ గణేశుల ప్రతిమలూ, ఎడమవైపు లక్ష్మీ, కార్తికేయ ప్రతిమలూ ఉంటవి. ఉత్తరదేశంలో మహాకాళీ పూజ సప్తమ్యాది కల్పాన్ని అనుసరించి జరుగుతుంది. ఇందులో తామసీవిధానము కనిపిస్తుంది. [illegible] బలి, మద్యపానము, అశ్లీలభాషణము [illegible]ము. ఇది కల్ప మన్నను క్షుద్రశక్తుల జాతరలకంటె భీకరమూ, బీభత్సమూ అని తెలుస్తున్నది. దక్షిణదేశంలో కలశాన్ని స్థాపించి దుర్గాదేవిని ఆవాహనచేసి తొమ్మిది దినాలూ సాత్త్విక విధానాన్ని అనుసరిస్తారు. సరస్వతీ, లక్ష్మీ పూజలుకూడా జరుపుతారు.

దక్షిణదేశంలో బొమ్మల కొలువు మహావైభవంతో జరుగుతుంది. మెట్లకట్టులతో ప్రతిమా మంటపాన్ని అలంకరించి వింత వింతగా బొమ్మల కొలువులు తీరుస్తారు. బాలికలూ, యువతులూ, అలంకరణంచేసుకొని వీథులు కళకళలాడేటట్లు పేరంటపు కొలువులతో ఈ దినాలల్లో కాలం వెళ్లబుచ్చుతారు.

యోగ్యమైన అధికారం కలిగి యజ్ఞశాలా నిర్మాణంచేసి, విధులు తెలుసుకొని దేవీవ్రతం చేయవలసి ఉంటుందని కల్పగ్రంథాలు పలుకుతున్నవి. హరిహరాదులైన లోకపాలకులందరూ దేవీపూజా తత్పరులే నట. ఈ నవరాత్ర విధానాలకు సంబంధించిన దేవీపూజావిశేషాలు సంప్రదాయగమ్యాలు. ఒకరి సంప్రదాయాన్ని మరొకరు గ్రహించటంకూడా పాపహేతువట!

ఇక్కడ దేవీస్వరూపాన్ని కొంతగా సంగ్రహించవలసి ఉన్నది. ప్రపంచము సమస్తమూ ప్రకృతిమయము. ప్రకృతి స్త్రీమూర్తి. ఆదిశక్తి. ఈమె వల్లనే ప్రపంచానికి సృష్టిస్థితిలయాలు ఏర్పడుతున్నవి. సృష్టిస్థితిలయాలకు కారణభూతులైన దేవతల్లో నానానామాలను ధరించి శక్తి ప్రకాశిస్తున్నది. బ్రాహ్మీ, వైష్ణవి, గౌరి, వారాహి, నారసింహి ఇత్యాది నామాలతో భాసించే తల్లి పరాశక్తి. అందువల్లనే 'సర్వచైతన్య రూపాంతాం,ఆద్యాం విద్యాంచ ధీమహి, బుద్ధిం యానః ప్రబోదయాత్' అనే దేవీ గాయత్రి. ఈ అర్థాన్నే దేవీభాగవతము 'జగములు సృజింప రాజసీ శక్తి యగుచు, జగములు భరింప సాత్వికీ శక్తి యగుచు, జగము లణపంగ దామసీ శక్తియగుచు, నిన్ను నన్నును హరుని దా నిర్వెరంబ' అని పల్కింది.

అంబిక, హైమవతి, కాత్యాయని, సతి, దుర్గ, భద్రకాళి, కాళరాత్రి, చండి మొదలైన నామాలతో ఉన్న రూపాలన్నీ ఆది శక్తి స్వరూప భేదాలే. అంబికా నామము శ్రుతులలోనూ, ఉమా, హైమవతీ, దుర్గాదులు ఉపనిషత్తులలోనూ కనిపిస్తున్నవి. ప్రకృతి స్త్రీరూపిణి కావటంవల్ల శాక్తేయులు పెక్కు శక్తు

(18 వ పేజీ చూడుడు)

ఆంధ్రదేశంలో ఆహారవసతులు

శ్రీ వేలూరి సహజానందం

భాషలు.	మాట్లాడే ప్రజలు. (మిలియన్లు)
హిందూస్తానీ	78
బెంగాలీ	53
తెలుగు	26
బీహారీ	26
మరాఠీ	20
తమిళ	20
కన్నడ	11
ఓఢ్ర	11
గుజరాతీ	10
మలయాళీ	9

పాకిస్తాన్ స్థాపనకు పూర్వపు లెక్కలివి. ఇప్పటి లెక్కలు చూస్తే, హిందూస్తానీ మాట్లాడే వారి తర్వాత తెలుగు మాట్లాడేవారి సంఖ్యే హెచ్చుకావచ్చు. దేశనిర్మాణంలో, పరిణామంలో ఇప్పుడేలా ఉన్నా, ఇక ముందైనా హిందూస్తానీవారితోపాటు తెలుగు వారి ప్రాముఖ్యత వృద్ధిచెందక తప్పదు.

ఇప్పటి రాష్ట్రనిర్మాణాలబట్టికూడా పరిశీలిద్దాం:

రాష్ట్రం	జనాభా (మిలియన్లు)
బెంగాలు	60.31
సంయుక్తరాష్ట్రాలు	55.02
ఆంధ్రదేశం	18.78
తమిళనాడు	25.10
బొంబాయి	20.85
బీహారు	28.82
మధ్యరాష్ట్రాలు	16.82
అస్సాం	10.20
ఒరిస్సా	8.72

పాకిస్తాన్ స్థాపనకు పూర్వపు లెక్కలివి. ఇప్పుడు మద్రాసురాష్ట్రంలో ఉన్న తెలుగు జిల్లాలను మాత్రమే లెక్కలోకి తీసుకున్నాం. మద్రాసు నగరం, చెంగల్పట్టు, నీలగిరి జిల్లాలు తమిళనాడులోనే చేర్చాం. హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణా ప్రాంతాన్ని తెలుగుదేశానికి చేర్చి చూస్తే, జనాభా ఇంకో 10 మిలియన్లు ఎక్కువవుతుంది. అప్పుడు ఆంధ్రదేశ జనాభాని మించేదల్లా ఒక్క సంయుక్త రాష్ట్రమటుకే. బొంబాయి రాష్ట్రాన్ని గుజరాత్, మహారాష్ట్రాలుగా విడదీస్తే, దేశంలో సంయుక్తరాష్ట్రం తర్వాత ఆంధ్రదేశమే ముఖ్యమైన దవుతుంది.

భాష, జనాభా దృష్ట్యా ఆంధ్రదేశం— ఒక్క సంయుక్తరాష్ట్రం మినహా—మిగతా రాష్ట్రాలకు మిన్నగా ఉందని, ఉంటుం దని తేలింది.

కాబట్టి దేశచరిత్రలో—ఇప్పుడూ, భవిష్యత్తులోనూ—తెలుగువారిది అగ్రస్థానం. ఔన్నత్యం, వికాసం మన శక్తి సామర్థ్యాలబట్టి సిద్ధిస్తయ్. అవకాశంమటుకు అనుకూలం.

అయితే ఒక్కభాష, జనాభాబట్టే సమస్యను పరిష్కరించకూడదు. విడిగా ఏర్పడే ప్రాంతం ఆర్థికంగా సౌష్ఠవంగా ఉండాలి అని కొందరి హెచ్చరిక. హెచ్చరికమటుకు చేస్తూ, వివరాలను పరిశీలించకుండా ఆంధ్ర రాష్ట్ర నిర్మాణాన్ని ఖండించటం సబబు కాదు. ఆర్థికంగా ఆంధ్రదేశం తన కాళ్లమీద తాను నిలబడగలదా, లేదా అని పరిశీలించాలి. ఆర్థికంగా ఇతరరాష్ట్రాలకంటె దుర్బలంగా ఉందని తేలితే, అప్పుడు ఆ సమస్యనుగురించి విచారించవచ్చు.

ముందు అత్యవసరమైన ఆహారవిషయం చూద్దాం. ఆంధ్రదేశానికి తగిన ఆహారవసతు లున్నయా? లేవా? పరిశ్రమలు, వ్యాపారం విషయాలకంటె ఆహారసమస్య ఎక్కువ ప్రధానం. ఆహారవిషయంకంటె పారిశ్రామిక విషయాన్ని ఎక్కువ ముఖ్యంగా ఎంచి, ఉన్న వసతులను పారిశ్రామిక, వ్యాపారవ్యాప్తికోసం వినియోగించి, చివరకు తిండికోసం ఇతరదేశాలపైన ఆధారపడుతున్న యూరపు చిన్నదేశాల అవస్థలను మనం మరువకూడదు. గత యుద్ధంలో యూరపుదేశాలు తిండికోసం అవస్థపడితే, రష్యా తనకాళ్లమీదే తాను నిలబడగలిగింది. ఈ సమస్యబట్టి రాజకీయ, ఆర్థికపరిస్థితు లేర్పడుతయ్. కాబట్టి ముందు ఆంధ్రదేశంలో ఆహారవసతు లెలా ఉన్నవీ పరిశీలించుదాం.

మద్రాసురాష్ట్రంలో అన్నిరకాల ఆహారధాన్యాలు పండేభూమి, 2,33,42,927 ఎకరాలు (1940-41 లో).

వివరాలు

	ఎకరాలు
ఆంధ్రజిల్లాలు	1,14,65,133
తమిళనాడు	1,03,61,943
మలబారు	9,07,145
సౌత్-కనరా	6,08,706
	2,33,42,927

రాష్ట్రపు మొత్తం ఎకరాల్లో దాదాపు సగం తెలుగుజిల్లాల్లోనే ఉన్నయ్. తమిళనాడు జిల్లాల్లోకంటె 11,03,190 ఎకరాలెక్కువ తెలుగుజిల్లాల్లో ఉన్నయ్. ఇది 1940-41 నాటి పరిస్థితి. 1943-44 సంవత్సరపు పరిస్థితి చూద్దాం.

	ఎకరాలు
తెలుగుజిల్లాలు	1,21,91,180
తమిళజిల్లాలు	1,04,23,713
మలబారు	9,15,416
సౌత్-కెనరా	5,98,709
	2,41,29,018

మొత్తం రాష్ట్రపు ఎకరాల్లో ఇంచుమించు సగంపైన తెలుగుజిల్లాల్లోనే ఉన్నయ్. 1940-41 లో తమిళ జిల్లాల్లోకంటె, తెలుగుజిల్లాల్లో 11,03,190 ఎకరా లెక్కువ ఉంటే, 1943-44లో 17,67,467 ఎకరా లెక్కువ ఉన్నయ్. అంటె 40-41 లో ఉన్న పెచ్చులో ఇంకోసగం వంతు 43-44 కు పెరిగింది.

సంవత్సరం	తెలుగుజిల్లాలు ఎకరాలు	తమిళజిల్లాలు ఎకరాలు
1943-44	1,21,91,180	1,04,23,713
1940-41	1,14,65,133	1,03,61,943
	7,26,047	61,770

తమిళ జిల్లాల్లో మొత్తం ఆహారధాన్యాల పంటలకింద ఉన్న భూమి పెరిగినదానికి తెలుగు జిల్లాల్లో ఇంచుమించు 12 రెట్లు పెరిగింది.

తెలుగుజిల్లాల్లో అన్నిరకాల అహారధాన్యం పండేభూమి మనిషికి సగటున 0.6 ఎకరం ఉంటే, తమిళజిల్లాల్లో 0.4 ఎకరం, మలబారులో 0.23 ఎకరం, సౌత్‌కనరాలో 0.4 ఎకరం ఉన్నయ్.

ప్రాంతం	10 మంది మనుష్యులకు ఎకరాలు.	ఒక్కొక్క కుటుంబానికి ఎకరాలు.
తెలుగు జిల్లాలు	6	3
తమిళ ,,	4	2
మలబారు ,,	2.3	1.15
సౌత్‌కనరా ,,	4	2

రాష్ట్రం మొత్తంమీద మనిషికి సగటున 0.47 ఎకరం, 10 మందికి 4.7 ఎకరాలు, కుటుంబానికి 2.35 ఎకరాలు ఉన్నయ్.

ఇక ఒక్క వరిపంటసంగతికూడా చూద్దాం:

	ఎకరాలు
తెలుగుజిల్లాలు	43,78,648
తమిళజిల్లాలు	48,82,411
మలబారు	8,81,084
సౌత్‌కనరా	6,02,250
(1940-41 లో)	1,07,44,393

ప్రాంతం	మనిషికి సగటున ఎకరం	10 మందికి ఎకరాలు
తెలుగుజిల్లాలు	0.23	2.3
తమిళజిల్లాలు	0.19	1.9
మలబారు	0.22	2.2
సౌత్‌కనరా	0.39	3.9
మొత్తం రాష్ట్రం	0.21	2.1

వరిపంట కింద వున్న భూమి తమిళజిల్లాల్లో కంటె తెలుగుజిల్లాల్లో తక్కువగా ఉన్నా, జనాభా ప్రకారం చూస్తే తమిళజిల్లాల్లో ఒక్కొక్క కుటుంబానికి సగటున ఉన్న భూమికంటె తెలుగుజిల్లాలో ఎక్కువగా ఉంది.

ప్రాంతం	ఒక్కొక్క కుటుంబానికి (సగటున) ఎకరాలు
తెలుగుజిల్లాలు	1.15
తమిళజిల్లాలు	0.95
మలబారు	1.1
సౌత్ కెనరా	1.95
మొత్తం రాష్ట్రం	1.05

తెలుగుజిల్లాల్లోకంటె తమిళజిల్లాల్లో బియ్యం మీద ఆధారపడే జనాభా హెచ్చు.

జిల్లాలు	బియ్యంమీద ఆధారపడే వారు 100 కి	మిగతా ధాన్యాల మీద ఆధారపడే వారు 100 కి
విశాఖ	91	9
తూర్పుగోదావరి	100	...
పశ్చిమగోదావరి	90	10
కృష్ణా	75	25
గుంటూరు	57	43
కర్నూలు	35	65
బళ్లారి	65	35
అనంతపురం	54	46
కడప	25	75
నెల్లూరు	50	50
చెంగల్పట్టు	80	20
ద. ఆర్కాటు	70	30
సేలం	65	35
కోయంబత్తూరు	58	42
తిరుచునాపల్లి	62	38
తంజావూరు	96	4
రామ్నాడు	65	35
మధుర	66	34
తిన్నెవలి	94	6
నీలగిరి	97	3

తెలుగు జిల్లాల్లో కుటుంబానికి సగటున 1.15 ఎకరాలు వరిధాన్యం పంటకింద ఉంటే, తమిళ జిల్లాల్లో 0.95 ఎకరం మటుకేఉంది. పై పెచ్చు తమిళ జిల్లాలలో జనాభా ఎక్కువగా బియ్యం మీదే ఆధారపడతారు.

వరి కాకుండా, మిగతా ఆహార ధాన్యాల వసతి కూడా విచారిద్దాం.

ప్రాంతం	ఎకరాలు	సగటున మనిషికి ఎకరం
తెలుగుజిల్లాలు	70,86,485	0.37
తమిళజిల్లాలు	54,79,532	0.218
మలబారు	26,061	0.0066
సౌత్ కనరా	6,456	0.0042
మొత్తంరాష్ట్రం	1,25,98,534	0.255

వరిపంట, మిగతా ఆహారధాన్యపు పంటల కింద ఉన్నభూమి జనాభా ప్రకారం కుటుంబానికి సగటున తమిళప్రాంతంలోకంటె తెలుగు జిల్లాలలోనే హెచ్చుగా ఉంది.

తెలుగు జిల్లాలు

సం.	వరిపంట ఎకరాలు	మిగతాధాన్యా ఎకరాలు
'43-44	43,58,959	78,32,221
'40-41	43,78,648	70,86,485
	—1,96,89	+7,45,736

మొత్తం ఆహారధాన్యాల కింద వున్న భూమి 7,26,047 ఎకరాలు పెరిగింది.

తమిళ జిల్లాలు

సం.	వరిపంట ఎకరాలు	మిగతా ఆహార ధాన్యాలు ఎకరాలు
'43-44.	50,84,822	53,38,891
'40-41.	48,82,411	54,79,532
	+2,02,411	—1,40,641

మొత్తం ఆహారధాన్యాల కింద వున్నభూమి 61,770 ఎకరాలు మాత్రమే పెరిగింది.

అంటే తమిళ జిల్లాల్లో కంటె తెలుగు జిల్లాలలో వృద్ధి 12 రెట్లు సుమారు.

ఆహారధాన్యాలు, మిగతా అన్నిరకాల ఆహారపు పంటలు మొత్తం పరిస్థితి కూడా చూద్దాం.

ప్రాంతం	ఎకరాలు	సగటున మనిషికి ఎకరం
తెలుగుజిల్లాలు	1,37,70,882	0.73
తమిళజిల్లాలు	1,20,62,537	0.48
మలబారు	12,91,387	0.3
సౌత్‌కనరా	7,01,616	0.46
మొత్తంరాష్ట్రం	2,78,26,422	0.52

(1940-41లో)

అన్నిరకాల ఆహారపు పంటలకింద వున్న భూమికూడా తమిళ జిల్లాలలోకంటె తెలుగు జిల్లాలలో హెచ్చు. తెలుగుజిల్లాలలో కుటుంబానికి సగటున 3.6 ఎకరాలు ఉంటే, తమిళ జిల్లాలలో 2.4 ఎకరాలు మాత్రమే ఉన్నయ్. అంటే పెచ్చు 1.2 ఎకరాలు—కుటుంబానికి

మొత్తం ఆహారపు పంటలకింద వున్న భూములు

సం.	తెలుగు జిల్లాలు ఎకరాలు	తమిళ జిల్లా ఎకరాలు
'43-44	1,46,19,146	1,22,93,818
'40-41	1,37,70,882	1,20,62,537
	8,48,264	2,31,281

తమిళ జిల్లాలలో వృద్ధికంటె తెలుగు జిల్లాలలో సుమారు 3½ రెట్లకు ఎక్కువగా వృద్ధి ఉంది.

	40-41లో	43-44 లో
తెలుగుజిల్లాలు	1,37,70,882	1,46,19,146
తమిళజిల్లాలు	1,20,62,537	1,22,93,818
	17,08,345	23,25,328

40-41 లో ఉన్న తెలుగు జిల్లాలలో హెచ్చు '43-44 లో ఇంకా 6,16,983 ఎకరాలకు వృద్ధిచెందింది.

(17 వ పేజీ చూడుడు)

భారత రాజకీయాలు

ఫ్రెంచిఇండియా ఎన్నికలు - చెన్నరాష్ట్రమంతటా మద్యనిషేధం అమలు - హైద్రాబాదు నిజాంపడ్డభ్రమలు

"కోటానుకోట్లు భారతీయులు, బ్రిటిష్ దాస్యంనుంచి విముక్తులయాక కూడా, భారత భూభాగం లోని ఈ చిన్న ప్రదేశాలు విజాతీయాధికారాల్లో, దాస్యంలో మగ్గి ఉండటానికి ఎంతమాత్రం ఆస్కారం లేదు."

—మహాత్మాగాంధీ ఢిల్లీ ఉపన్యాసంలో.

న్యాయంగా చూసుకొంటే, భారతదేశంలోని ఫ్రెంచిరాజ్యపు ఊళ్లు ఐదూ ఏడాదిక్రితమే భారత రాజ్యాంగంలో చేరిపోయి ఉండవలసింది. భారతదేశ ప్రజాభాగాన్నై, చెదురుగా అక్కడక్కడ పడిఉన్న ఈ నాల్గు ఐదు పల్లెటూళ్లూ ఫ్రెంచి భూభాగమంటూ భారతదేశ స్వాతంత్ర్యానంతరం కూడా విదేశ పరిపాలనలోఉండి, భారతదేశంలో కలవటమా, కలవకపోవటమా అంటూ ఒక వికృత సమస్యను విపరీత వినాదాన్ని లేవదీయటం, అపురూపంగా కనపడక మానదు.

ఈ ఐదూళ్ల మొత్తం వైశాల్యం 200 చదరపుమైళ్ల లోపుగా ఉంటుంది. జనాభా మూడు లక్షలు. ఈ ఊళ్లకు కావలసిన సరఫరాలన్నీ, గాలి, వెలుగు, నీరు, తిండి, శేఖీలు, అన్నీ భారత భూభాగంలో నుంచే రావాలి. ఇవి ఇచ్చుకోటం చాలక కష్టమ్ము పేరట, ఫ్రెంచి ప్రభుత్వానికి, అక్కడి భారత ప్రజకుకాదు, 6 లక్షల 72 వేల రూపాయిలు సమర్పించుకొంటున్నాము. వాళ్లు రైళ్లు, తపాలాలు, మొదలైనవన్నీ నడిపించిపెట్టే కూలిపని మనదే.

ఈ భారతప్రజలు, భారతప్రభుత్వ ప్రజలో జేరుతామని చెప్పుకోటానికి ఎన్నో అధికారాలు స్వలాభాపేక్షతో అడ్డువస్తున్నాయి. సమాఖ్యలో చేరటానికి అభ్యంతరముగా, పక్షాలు బయలుదేరాయి. ఫ్రెంచి ఇండియా సోషలిస్టు పార్టీ, ఇప్పటికి ఏడాదినుంచీ ఈ ప్రదేశాలలో అధికారంలోఉంది. అది చేసిన మేళ్లు ఏమిటి అనేవి ఆలోచన కందవు. గత జూలైలో ఈపార్టీ జన్మించింది. యుద్ధకాలంలో, కాంబట్ పార్టీ, డెమోక్రాటిక్ నేషనల్ పార్టీ, అన్న రెండు రకాలపార్టీల సభ్యులు కొందరు చేరి ఈ పార్టీని పుట్టించారు. కమ్యూనిస్టుల దిమ్ముందు పైచేయిగా ఉండేది. యుద్ధకాలంలో కాంగ్రెసువారిని జాతీయవాదులను, అణగద్రొక్కేందుకు, ఈ పార్టీకి కమ్యూనిస్టులు బాగా పనికి వచ్చారు. యుద్ధం అయిపోవటంతో, కమ్యూనిస్టుల అవసరం పార్టీకి తీరిపోయినట్లయింది. అంతతో కమ్యూనిస్టులను తోసిరాజని, పార్టీకి "సోషలిస్టుపార్టీ" అని పేరుపెట్టారు. కమ్యూనిస్టుల పట్టునుంచి తొలగించటానికీ, కార్మికులను భ్రమపెట్టటానికీతప్ప, నాయకులకు సామ్యవాదం లోన రుక్కమూ, ఆ ఆదర్శమూ, ఉండి కాదు ఈ మార్పు. సోషలిస్టు పార్టీ గవర్నరు పార్టీగా మారిపోయింది. నాడు జాతీయవాదులపైన, కాంగ్రెసుపైన ప్రయోగించిన విధానాలన్నీ, ఈ సోషలిస్టులు తమపై, తమకన్నా జయప్రదంగా ప్రయోగించటంచూసి కమ్యూనిస్టులు, తెల్లపోయారు. కమ్యూనిస్టు వ్యతిరేకప్రచారంలో, ఈప్రభుత్వ సోషలిస్టుపార్టీ నాయకుడు గూబర్టు, అందర్నీ మించిపోయాడు. "ఆంగ్లో ఇండియన్" అన్న మాట మాదిరిగా ఇతను "ఫ్రాంకో ఇండియన్". ప్రభుత్వంలో, పరిపాలన, కార్మిక శాఖలకు మంత్రి తన మంత్రిత్వంలో కూడా తన తీవ్ర విధానంలో కలిసిరానివాళ్లని అడుగుకు తొక్కుతూనే వస్తున్నాడు. రెండేళ్లక్రిందట పుదుచ్చేరిలో కమ్యూనిస్టుపార్టీ బలీయమైన పార్టీగా ఉండేది. గూబర్టు, నిత్యం విళ్లపై ప్రచారం సాగించటంతో, పార్టీబలం సన్నగిలిపోయింది. అదీకాక, భారతయూనియన్‌లో చేరటం విషయంలో పార్టీ ద్వంద్వ విధానాలు అవలంబించటంతో పలుకుబడి మరీ తగ్గిపోయింది. ఇక కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి "సుబ్బయ్య"కు కార్మికులలో చాల పలుకుబడి ఉంది. నేషనల్ డెమోక్రాటిక్ ఫ్రంట్‌గా ఉన్న రోజులలో ఫ్రాంసుతో కలిసిపోయి చివరకు ఎప్పటికో భారత యూనియన్‌లో కలవవచ్చునని ప్రచారం చేసేవాడు. కమ్యూనిస్టులను తోసేసి, సోషలిస్టులు అధికారంలోకి రావటంతో, వెంటనే భారత యూనియన్‌లో చేరాలని ప్రతిపాదన లేవదీశాడు. ఇవాళ ఫ్రెంచియూనియన్‌లోనే ఉండి, ఫ్రెంచి రిపబ్లిక్ పౌరసత్వపు హక్కుల కోసం పోరాడాలని పార్టీ ప్రచారం చేస్తోంది. తమ ట్రేడ్ యూనియన్ నాయకులను అరెస్టుచేసి తమ స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వం అరికట్టుతోందని నినాదాలు చేస్తూన్న భారత యూనియన్‌లోకన్నా ఫ్రెంచియూనియన్‌లో ఉంటేనే తమ అభ్యుదయానికి మార్గ ముందని పార్టీ నమ్మకము. భారతయూనియన్ విమర్శకు "ద్రవిడకజగం" వారు వీరికి తోడు.

ఇక పార్టీతత్వం మార్చుకుండా ఉంటూ వచ్చిన దొక్క ఫ్రెంచి ఇండియా నేషనల్ కాంగ్రెసు పార్టీమాత్రమే. ఈ పార్టీ భారత జాతీయ కాంగ్రెస్ అడుగుజాడల్లోనే నడుస్తూ వచ్చింది. దేశంలో గౌరవం కలదిగానే ఉంది. ప్రభుత్వం చేతులలో అనేక కష్టాలు అనుభవించింది.

భారత యూనియన్‌లో ఫ్రెంచి ఇండియా కలిసిపోవాలని నిలచేది ఈ పార్టీ ఒకటె మాత్రమే. ప్రజల అభిప్రాయం భారత సమాఖ్యలో కలిసిపోవాలనే ఉందనీ, కానీ అభిప్రాయం సరిగ్గా వెలవచ్చుకోగల శాంతపరిస్థితులు ప్రజకు లేవనీ, అధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి మొదలైన ఈ కాంగ్రెసు నాయకులు చెప్పుతున్నారు. ఎలక్షన్లు అంటే, రౌడీ పద్ధతులలో జరగటమే, ప్రభుత్వం పూర్తిగా జోక్యం కల్పించుకోటమే, గత సంవత్సరాలలో పరిపాటి ఐపోయింది.

కమ్యూనిస్టులు భారతదేశంతో ఐక్యమవటానికి వీలులేదంటారు. సోషలిస్టులు అవకతప్పదుగాని ఐదేళ్ల తర్వాత చూసుకొందామంటారు. ఇప్పుడు భారత యూనియన్‌లో చేరితే, ఫ్రెంచి ఉద్యోగాలన్నీ పోతాయనీ, ఒక్కసారిగా పరిస్థితులంతా తారుమారవుతాయనీ ప్రచారం సాగిస్తున్నారు.

ఫ్రెంచి ఇండియన్ నేషనల్ కాంగ్రెసు, స్టూడెంట్ కాంగ్రెసులు, భారత యూనియన్‌తో కలిసిపోటానికే ప్రయత్నం చేస్తున్నాయి. కాని ఎన్నికలు, నిష్పక్షపాతంగా జరిగే వీలుంటే తప్ప ప్రజాహృదయం ఎన్నికలలో సరిగ్గా బయలుపడదని హెచ్చరిక చేశాయి.

ఈ పరిస్థితిలో ఫ్రెంచి ఇండియా ప్రభుత్వము ఎలక్షన్లను వాయిదా వేశామని ప్రకటించింది. ప్రజల సరియైన అభిప్రాయం వెలువడగల ఆస్కారమున్నప్పుడే ఈ ఎన్నికలు నడుపుతామని ప్రకటించింది. జూన్ 8 న ఫ్రెంచి ఇండియన్ ఒడంబడికలో, ప్రజాభిప్రాయం తీసికొనేటప్పుడు, అబద్ధప్రచారంగాని, వత్తిడిగాని ప్రజాస్వామ్యసూత్రవిరుద్ధంగా తేకూడదని షరతు ఉంది.

చెన్నరాష్ట్రమంతటా మద్యనిషేధము

ఈ అక్టోబరు రెండో తేదీతో చెన్నరాష్ట్రమంతటా మద్యపాన నిషేధం, అమలులోకి వచ్చింది. రాష్ట్రమంతటా నాయకులు మద్యనిషేధ ప్రారంభోత్సవాలు జరిపి, మద్యపిశాచ రూపాలను తయారుచేసి తగలపెట్టి, నిషేధ శాసనం అమలులోకి తెచ్చారు. గవర్నరు జనరల్ రాజగోపాలాచారి, సర్దార్ పటేల్ మొదలైన పెద్దలు, మద్రాసు ప్రభుత్వానికి గాంధీజీ ఆదర్శాన్ని ఆయన జయంత్యుత్సవ నాడు అమలులో పెట్టినందుకు అభినందిస్తూ సందేశాలను పంపారు. రాష్ట్ర ప్రధాని, మంత్రులు మొదలైనవారంతా, మద్యనిషేధం రాష్ట్రంలో జయప్రదంగా శాశ్వతంగా అమలు జరపగలిగేందుకు సంపూర్ణ సహకారం చూపవలసిందని ప్రజల కుపదేశాలు చేశారు.

చెన్నరాష్ట్రంలో, మద్యనిషేధము మొదట 1937 సం॥ అక్టోబరు 1 వ తారీఖున సేలం జిల్లాలో ప్రవేశపెట్టారు. ఒక ఏడాదితర్వాత చిత్తూరు, కడప, ఉత్తరఆర్కాటు జిల్లాలలో కూడ అమలులోకి తెచ్చారు. యుద్ధకాలంలో మళ్లీ నిషేధచట్టాలు వెనక్కి పడ్డాయి. మళ్లీ కాంగ్రెసు అధికారంలోకి రావటంతో, మద్రాసు ప్రభుత్వం, 1946 అక్టోబరు 1 వ తారీఖున అనంతపూరు, బళ్లారి, చిత్తూరు, కోయంబత్తూరు, కడప, కర్నూలు, నార్తు ఆర్కాటు, సేలం-ఈ ఎనిమిది జిల్లాలలో మద్యనిషేధచట్టం అమలులోకి తెచ్చారు. 1947 లో మరి ఎనిమిదిజిల్లాలు, గుంటూరు, నెల్లూరు, తంజావూరు, తిరుచినాపల్లి, మధుర, నీలగిరి, దక్షిణకనరా, మలబారు జిల్లాలకు కూడా చట్టాన్ని వర్తింపచేశారు. 1948 అక్టోబరు 2 తో, చెన్నరాష్ట్రం అంతటా పూర్తిగా మద్యనిషేధచట్టం అమలులోకి వచ్చింది.

ఈ చట్టం అమలు పర్చటంవల్ల, $17\frac{1}{2}$ కోట్ల ఆదాయం తగ్గిపోతుంది. అమ్మకపు పన్ను మొదలైన పన్నులవల్ల ప్రభుత్వం ఈ ఆదాయం కూడదీసుకొనే ప్రయత్నం చేస్తుంది. కానీ నష్టమెల్లా రాష్ట్రంలో ఉన్న బీదవాళ్లకి. మొత్తంగా దాదాపు 70, 80 కోట్ల రూపాయలు ఆదాఅవుతుందనే నాయకులు అంచనా వేశారు.

హైదరాబాద్ నిజాం పడ్డ భ్రమలు

హైదరాబాద్‌లో మిలిటరీప్రభుత్వం అమలులోకి వచ్చి, శాంతి భద్రతలను రక్షించే చర్యలు పూనుకోటంతో, ప్రజలు, సివిలియన్ ఉద్యోగులు, అందరూ కూడా నూత్నప్రభుత్వంతో తమ సంపూర్ణ సహకారం చూపిస్తున్నారు.

లాయక్ అలీ మంత్రివర్గ చర్యలు ఒకటొకటె బైలుపడి వస్తున్నాయి. సెప్టెంబరు 10, 11 లలో మీర్ లాయక్ అలీ పాకిస్థాన్‌కు ఎగిరివళ్లివచ్చి, భారత సైన్యాలను హైద్రాబాదువారు మూడు వారాలు ఆపగలిగితే, పాకిస్థాన్ ఇండియాపై యుద్ధం చేస్తుందని జిన్నా స్వయముగా హామీ ఇచ్చాడని ప్రచారం మొదలు పెట్టాడట. అసలు సిడ్నీకాటన్ సరఫరా చేసిన ఆయుధాలతోటీ, రజాకార్, స్టేటు సైన్యాల సాయంతోటీ మూడు నెలలదాకా భారత సైన్యాలను ఎదిరించగలమని లాయక్ ఆలీ ఆశలు పుట్టించాడట.

సైన్యాల వ్యూహరచనాధికారం అంతా ఇత్తెహాద్ నాయకుడు కాశింరజ్వీయే కైవసం చేసుకొన్నాడు. సైనికాధ్యక్షు కార్యాలయాలు అతని ఆజ్ఞలకే ఎదురు చూచేవట!

భారతవిమానాలు రాత్రినూట హైదరాబాద్ మీద ఎగురుతూంటే, "మన విమానాలే"నని, లాయక్ ఆలీ నైజాంను బుజ్జగించాడట.

అన్నిటికన్న ముఖ్యవిషయం, లాయక్ ఆలీ మంత్రివర్గనాయకులు, బంగారమూ, ధనరాసులూ అన్నీయుద్ధం మొదలెట్టక పూర్వమే పాకిస్థాన్, యూరప్ అమెరికాలకు చేరవేయటము.

ఇక హైదరాబాద్ రెండుమూడు రోజుల్లో పడిపోతుం దనగాకూడా, ఫక్రుద్దీన్, మధ్యప్రాచ్యంలో ప్రచారం చేస్తానని కరాచీకి విమానం మాట్లాడాడు. ఆ విమానంలో, ఫక్రుద్దీన్ కుటుంబాన్నీ చరాస్తినీ అన్నిటినీ కరాచీ తర్లించుకుపోయాడట. ఇలాంటి కథలన్నీ ఒకటొకటి బైటపడుతున్నాయి.

హైద్రాబాద్ గాంధీ జయంత్యుత్సవాలు భారతయూనియన్‌లోకన్న ఉత్సాహంతో జరిపింది. స్వామి రామానందతీర్థ హైద్రాబాద్ ప్రజలను ప్రబోధిస్తూ, హైద్రాబాద్ రాజ్యాంగ స్వరూపము హైద్రాబాద్ ప్రజలే నిర్ణయించుకోగలరని హామీయిచ్చాడు.

చౌదరీ తాత్కాలిక మిలిటరీ ప్రభుత్వము, పాక్షికతత్వం అనేది ఏమాత్రమూ లేకుండా, చక్కగా పరిపాలన సాగిస్తూంది. రజాకార్ల అరెస్టులు, చురుకుగా సాగాయి. రజాకార్లలో పశ్చాత్తాపం చూపించిన వాళ్ళపట్ల, జాలితలిచే స్థితికూడా వచ్చింది. వ్యక్తి విద్వేషాలతో, లేని నేరాలు కల్పించి రజాకర్ల పేరిట అన్యాయంగా ఎవళ్ళనీ పట్టించి ఇయ్యటం సహించమని చౌదరి ప్రభుత్వం నిర్దష్టంగా చెప్పివేసింది. కాందిశీకులు నెమ్మదినెమ్మదిగా మళ్లీ సంస్థానంలోకి చేరుకొంటున్నారు.



కీర్తిశేషులైన న్యాయమూర్తి గోవిందరాజాచారిగారు

ఈ నెల 2 వ తేదీ తెల్లవారుఝామున హృద్రోగముతో మరణించిరి.

గొప్పవారితో గుసగుసలు-3. కలియుగ చక్రవర్తులు:

మహాపద్మనందుడు

కీ॥ శే॥ వారణాసి శ్రీనివాసరావు

మనకంటే అన్నివిధాల—అంటే, ఎన్నుకోదగ్గ విధాల, శారీరక సౌఖ్యం కోసం నే డేర్పడ్డ సౌకర్యాల విషయంలో గాకపోయినా—అన్నివిధాల మన పూర్వులే గట్టివాండ్లు. చక్రవర్తి పదవ్యవహారం చూడండి, షట్చక్రవర్తు లున్నారు: అంటే భూచక్రాన్నంతా పాలించిన వార్నే చక్రవర్తు లన్నారా అనుపిస్తుంది. షోడశ రాజు ల్నే పదహారుగుర్నీ రాజులే అన్నారుగాని చక్రవర్తులనలా—వారంతా భరతఖండాన్నంతా పాలించినా. మనయుగంలో మన మేం జేసాం, ఏ నాల్గు రాజ్యాలు సంపాదించినా చక్రవర్తంటున్నాం: ఎందు కనం, భ్రష్టబ్రాహ్మణ్ణే బ్రాహ్మ డంటూంటే! అంటే ఏమిటంటే, పూర్వ వాసన్ను వదల్లాక ఎట్లాగో ఒకట్లా ఆ కుతితీర్చుకు నేమార్గాన్న న్వేషిస్తున్నాం. ఇది సహజమే: మనం పట్టుకు నోచుకోలేనప్పుడు మాయ పట్టును, బంగారానికి నోచుకోలేనప్పుడు మాయ బంగారాన్ని ధరించి పట్టేసుకున్నాం, బంగారు పెట్టుకున్నా మనుకోవడంలా? ఏమిటి దానికి! కాబట్టి కలియుగంలో చక్రవర్తుల మనుకున్న వారంతా చక్రవర్తులు కారన్నమాట ఆరవ జార్జి దేభులు. అయిన యిప్పుడు మేం వద్దంటే మా మాట నెవరు వింటారు? పయిగా వీడి కింత గర్వమేం; మేమంతా యెన్నాళ్ళనుండో జౌ ననడానికి కాదనేందుకు వీ డెవడు! అంటారు. కాబట్టి మా కెందుకీ గోల. వాండ్లందర్నీ నోరారా చక్రవర్తులే అంటాం, ముమ్మాటికీ చక్రవర్తులే, మూడు రాష్ట్రాల కధిపతులైనా ఢంకా మీద దెబ్బగొట్టి చక్రవర్తులే.

ఇప్పుడు వార్నాహ్వానిస్తాం. వారంతా చారిత్రక పురుషులు: వార్లో మంచివారూ చెడ్డవారూ, వుంటారు. వారేం జెప్తారో, చెప్పగల్లో చూడాలి. ఈ మహానుభావుల పుణ్యమాని దేశం పరాధీనమైంది. లక్ష్మికి నివాసస్థానమైన భరతఖండం దారిద్ర్యదేవతకు నాట్యరంగమైంది, అన్నివిధాల భ్రష్టమైంది. అయితే దానికి ప్రజల పూచీమాత్రంలేదాని తోచొచ్చు. లాకేం? వుంది. ఆ కథనుకూడా విరళంచేయడంకోసమే శీర్షికలో కొందరు వ్యక్తులనాం—ద్వితీయ భాగంలో కొందరు వ్యక్తుల్నాహ్వానించి కొన్ని విషయాలు విశదం చేసినట్లు. ఇక నుపక్రమిస్తాం.

[శోణానదీ తీరానికి కొంచెం దూరంగా వున్న యిసుకదిబ్బలమీద పాడువడ్డ ఒక భరంతు ప్రక్క నిల్చున్న వనొక్క గొప్ప వ్యక్తి సమీపిస్తారు: వ్యక్తి అని జాగ్రత్తగా వాడా: ఆయన మాంచి వర్చస్వి, తేజస్వి, కలియుగంలో నాజానుబాహు డనొచ్చు; ప్రతిలక్షణంలో రాజస ముట్టిపడుతూంది. నన్ను సమీపించి నా స్వాగత మందుకుంటూ—]

వ్యక్తి: ఎవరయ్యా మీరు? మా సేనమహాశాఖలుంగారు ఫలానొచ్చేటుండి నిన్నొకాయన పిలుస్తున్నాడు, ఆయన కల్లా కపటం లేని మంచివాడు, వెళ్ళి ఆయన్తో నేమీ దాచకుండా మాట్లాడివస్తే సంతోషిస్తా మంటే వచ్చాం. ఎవర్నాయనా మీరూ?

నేను: ఈకాల బ్రాహ్మణులం.

వ్య: (తల పంకిస్తూ) ఉహూ! చింత చచ్చినా చేవ చావలా! అందు కనేంటయ్యా మమ్మల్ని స్వయంగా నాహ్వానించకుండా క్షత్రియులైన వేత్రాజులగారి ద్వారా పిల్చావ్?

నే: తమరేనాండి, మహాపద్మనంద చక్రవర్తిగారు?

మహా: మరెవ రనుకున్నావ్!

నే: చిత్తం. తమవంశం—

మ: ఎరగన ట్లడుగుతావయ్యా, అంతా చెబితే పోతుంది. మావంశం హర్యంకవంశం, మాతండ్రి కాలశోకరాజు, మాతల్లి మైథిలీదేవి.

నే: కాలశోకరాజుగా రంటే!

మ: కాలశోకరాజుగా రంటే కాలశోకరాజుగారు! నీవడగదలచుకుంది గ్రహించలేని పరేంగితజ్ఞానంలేని వాండ్లం గాం. ఒక రోజు స్వారీ కెళ్ళి తిరిగి రాక మర్నా డుదయం మంగల కత్తితో గొంతు దెగిన తమ కళేబరాన్న గస్తవొడ్డున ప్రదర్శించిన కాల శోక మహారాజుగారు. ఆ కత్తి ఒక అంబష్ఠ జాతి వానిది. ఇంకా గావాలా?

నే: చిత్తం. వద్దు వద్దీమాత్రం జాలు. వారు కారు నలుపుగా?

మ: ఆ. రా, దారికి రావయ్యా, అడుగ యింకా అడుగు. షుమారు రెండు వేలేండ్లయిం తర్వాత నెవ్వ రేమనుకుంటే నేం—అప్పుడే లక్ష్యపెట్టని మాకు? వారు కొర్నలుపైనా మాతల్లిగారు తెలుపు. ఏదేదో అవాచ్య పుకూతలు కూసేవాండ్లా కాలంలో. నీకేం దాచకుండా చెప్పమంటే కూడుదైనా అమాత్రమందిచ్చాను.

నే: అనుగ్రహం! తమ క్షత్రియు లంటే అంతదుర్భర వైర మెందుకండీ!

మ: చెప్తాం విను, మా తండ్రిగారు మహా శాంతమూర్తులు, ధర్మస్వరూపులు. మాతల్లిగారు మహా ప్రతిభావంతులు, తీవ్రస్వభావులు. నాయనగారు పోగానే కల్లోలం జరగబోతూంటే వారి స్త్రీధనంగా నున్న కోటిధనాన్ని వెచ్చించి, సేనను గట్టుకుని మాకు రాజ్యాన్ని నిలిపారు. మమ్మల్ని చిన్నప్పట్నుంచీ మా సామంతులైన క్షత్రియులు మొగాలు బిగించుకు చూడడం, పలకరించకపోవడం మాకు చిత్రంగా వుండేది. ఇదేమిటా అనకునేవాండ్లం. బుద్ధి తెలిసింతర్వాత గత్యాగత్యా యేదో విధవపురాణం విన్నాం. అప్పట్నుండీ వా రంటే మాకు మంట. మా పట్టాభిషేకానికి వా రొక్కరూ రాలా. వారాలేదు సరిగదా, కొందరు బ్రాహ్మణులను పేరుపడ్డవాండ్లనుగూడా రానీలా. దాంతో మాకు పరిపూర్ణక్రోధం గలిగింది. అధికారం చెలాయించట మారంభించినప్పట్నుండీ పగ దీర్చుకోవడమారంభించి, చేజిక్కిన క్షత్రియుణ్ణల్లా సంహరించి సర్వక్షత్రాంతక బిరుదు వహించాం.

నే: అంటే, క్షత్రియుల్లో ఒక్క పురుగ్గూడా మిగలకుండా సంహరించారనా?

మ: అట్లాంటి బిరుదుల అర్థాని కంత వ్యాప్తుండదు. చాలామందిని సంహరించామన్న మాట. అసలు మా ఉద్దేశ మా జాతిని మళ్ళీ పరశురాములవారిలాగున తుడిచేద్దామని. మా తల్లిగారు సుక్షత్రియకాంత. కులాభిమానంచేత కొంత సంహారం జరిగేటప్పటికి నాయనా, అపంటే మిగిల్నవాండ్లందర్నీ హిమవంతాన్నానకున్న పప్పులీవనంలోకి త్రోలి తగిన కాపలా బెట్టాం.

నే: చిత్తం. వారంతా క్షత్రియులు గదా, శస్త్రజీవులు తమ రంత జేస్తే తగిన ప్రతిక్రియనాలోచించకున్నారా?

మ: ఏం జేస్తారోయ్? మేం రాజ్యానికి రావడంతోటే విదేశాల్లో, ముఖ్యంగా పారసీక సామ్రాజ్యంలో—అదే అప్పుడు ప్రపంచంలో కల్లా మిన్నగా ఉండ—వున్న సైన్యపద్ధతులను గుర్తించి వాటిని మన స్థితిగతుల కనుగుణంగా మార్చి, వాట్లో వారు వాడిన కొత్తల్ని కొన్ని టెనిగూర్చి, నూతన సాధన సామగ్రినమర్చి ఇంతవంటిది ప్రపంచంలో నెక్కడా లేదనే సైన్యాన్ని తయారుచేసాం. బ్రహ్మాస్త్రం ముందు మిగిల్న అస్త్రాలు వ్యర్థమైనట్లు మా సాధనాల ముందు వారి సాధనాలు రాణించలా! వాండ్లేం జేయగల్రోయ్.

నే: అయినా, మూర్ఖంగా బెనుగులాడ్తారుగాని, ఊరుకుంటారా?

మ: అట్లా పెనుగులాడిన వారి కథ చెప్పాంగా.

నే: ఈ కృషిలో తిమకు సహాయ మెవరండీ?

మ: మేమే చేసుకున్నామనుకో కొంత వరకు; చాలావరకు రాక్షసు డనే బ్రాహ్మణోత్తము డొకడు మా మంత్రిసత్తము లుండేవారు, వారు మా శత్రువులకు రాక్షసుడు గానీ మాకు దేవతే. చాలావరకు వారు సాయపడ్డారు.

నే: వారు కేవల మంత్రాంగం...

మ: మంత్రాంగమే యేం కర్మం? అవసరమైతే కత్తిబట్టి సైన్యాల్ను నడిపించేవారు. వారి సర్వవిధములైన నీతీ లాకుంటే మా సామ్రాజ్య మట్లా జరిగేది కాదు. వారే మా తల్లిగారితో జెప్పి క్షత్రియసంహారాన్నాపు జేయించారా అని మా కనుమానంగా వుండేది. వారి నీతి అప్రతిహత మైంది.

నే: చాణక్య నీతో?

మ: చాణక్యుడు వారి నీతికి మెరుగు బెట్టాడు.

నే: చిత్తం. తమ సామ్రాజ్య మెంతవరకుండేదండీ.

మ: హిమవంతం మొదలుకొని దక్షిణాన గోదావరీనది నానుకునేదాకా వుండేది. అసలు మా అభిప్రాయం పూర్వరాజుల్లాగా భరతఖండమంతా యేల్దామని. గోదావరిని చేరేప్పటికి, వాయువ్యంనుంచి పారసీకుల తాకిడి కలిగేట్టుందని విని తిరిగొచ్చాం. తిరిగి రాకుంటే కన్యాకుమారివరకూ వెళ్ళేవాండ్లమే. వాయువ్యపు తెడ్డడి తీరిం తర్వాత మళ్ళీ వెళ్దామంటే రాజ కుటుంబ వ్యవహారాల్లో నిమగ్నులం గావాల్సొచ్చి మాకు వీలైందికాదు.

నే: ఏమిటండీ ఆ వ్యవహారాలు?

మ: ఏం జెప్పమన్నావయ్యా కర్మఫలానుభవాన్ని?

నే: అంటే?

మ: అంటే యేముంది? ఈశ్వర కటాక్షం వల్ల మా కెనమండుగురు పుత్రు లుదయించారు. మేము దండయాత్రల్తో కాలక్షేపం జేస్తూంటే వారి పాలన మా తల్లిగారి వశమైంది. వాండ్లను వారు ముద్దుచేత అతిగారాబం జేసారు. వ్యవహారా లక్క పెట్టుకుని మేం రాజధాని చేరకముందే మా తల్లిగారు మృతి నొందారు. ఇకను వార్నదుపుపెట్టేవారు లేక వారు పూర్తిగా మితిమీరి పోయ్యారు. వాండ్లు నేర్వని అధర్మం, చేయని క్రౌర్యం లేదు. మే మొచ్చేటప్పటికి యెనమండుగురు రాక్షసులా వీరని మాకు తోచే దుష్ప్రవర్తన ప్రకటిత మైంది. ఈడుకొచ్చినవార్నేం జేయం?

నే: మంత్రిగా రేరడీ?

మ: చాలావరకు వారు మాతోనే వుండేవారు. వారి మాట మటుకు వింటారా ఆ తుంటర్లు?

నే: దీనికంతా అర్థం తమ తల్లిగార్ననడ మెందుకూ, తమరుగూడా వార్ని గారాబం జేసా రన్నమాటే?

మ: అనవయ్యా అను; నీ వన్నావని కోపం లేదు మాకు. ఏంజెయ్యమన్నావ్? నిజ మొప్పుకుంటే తప్పేమిటి? మేంమటుకు వాళ్లు తెలిసి ప్రవర్తించామా? ఇంత బలం, అధికారం చేజిక్కిందని మేమే మితిమీరాం; దాన్ని చక్కగా విని మాని వారి ప్రవర్తన్నా పరవళ్లో దిద్దుకున్నారు వారు. నూ రను, నయ్యానవయ్యా, ఒక్కమాట సెప్తాం బట్టు: సాంప్రదాయంలో నెంతో వుందయ్యా; ఏను క్కంకుశ మెట్లాగో, ఓడకు లంగ రెట్లాగో, వ్యక్తికీ, సంఘానికీ సాంప్రదాయ మట్లా. దాన్ని పాటిస్తే అదపూ, స్థాయీ కుదర్తాయ్. లాకపోతే ఆ వ్యక్తీ సంఘం ఆకాశంలో దెగిన గాలిపటంలా గాడ్తాయ్.

నే: చిత్తం. మంచిమాట సెలవిచ్చారు: చివరకేం జేసా రేమిటండీ?

మ: చేసే దేముందీ? వచ్చాం, కల స్థితంతా ఆకళింపు జేసుకున్నాం, మంచం బట్టాం. సలహా పొందబోతే సలహాదార్లు రకరకాల సలహా లిచ్చారు. కొందరు వార్ని సంహరించమన్నారు. ఆ మాట నానికి ఝడిసి కర్మానుభవం తప్పదన్నారు. మేమూ అట్లాగే అనుకుని, కన్న సంతానంమీద మమతచాతి రాజ్యాని కింతకన్నా యేమీ చేయలేలేమనుకుని, చివరకు రాక్షసులవారిని రప్పించి "స్వామీ. వీరు మీ పుత్రులు, ఏడాది కొకర్ని రాజుం జేయండి, కనిపెట్టుండండి. రాజ్యాన్ని మటుకు చెడనీకండి" అని ఒప్పగింత జేసి ప్రాణం వదిలాం! కర్మోయ్, కర్మ!

నే: చిత్తం-ఈ చరిత్ర మహాజాలిగా వుంది. అయితే తమకు మహాపద్మ యేమిటండీ?

మ: అదేనుందోయి? మా పరిపాలన్లో నొక మహాపద్మం ధనం సేకరించాం. దాన్నిప్పుడు నీ దగ్గరగా వున్న భరంతు లున్నాయే, అవి సున్నంతో గట్టిన బొక్కసప్పెటెలు—శోణానది ప్పుడక్కడ పారుతూందిగానీ నాడీ భరంతులపైనుంచి పారేది—వాట్లో భద్రపరిచాం ఎవరికీ తెలీకుండా. వాట్ని కట్టించడం కోసం మూడుక్రోశాలవరకు గట్టి కాపలా పెట్టి, కొన్ని వందలమంది కూలీల నేర్పరచి, శోణానది పడకను మలిచ వాట్ని కట్టించి, ధనాన్ని వాట్లో బెట్టించి, పైన మూతలు గట్టించి, నదిని మునుపటి పడక్కు తిప్పించి ఆ కూలీల్లో నెవడైనా చెప్పిపోతా డేమో రహస్య మని ఆ కూలీలందర్నీ సంహారం జేయించి, అంతపని చేసాం.

నే: (విస్తుబోతూ) (స్వ) అరి, వీడినీతి పాడుగానూ! వీడూ మళ్ళీ వేను డంత వాడ్లా గున్నాడు. (ప్ర) కథ విని విస్తుబోతున్నా! వాండ్ల కుటుంబాల జీవనోపాధి?

మ: దానికేం లోపం జేయలా. రాక్షసమంత్రి నిర్ణయంమేరకు వాండ్లందరికి తగ్గ ప్రతిఫలాలు ముట్టజెప్పాం. వాండ్లం తా అనుకోకుండా, రాత్రి వరదలు వచ్చాయ్, అందరూ కొట్టుకుపోయ్యారు వదంతి పుట్టించి అని, ప్రచారం జేసాం. వాండ్లందరి భోజనసదుపాయం పని అయ్యేదాకా నదీతీరాన్నే యేర్పరిచాం గాబట్టి ఎవరికీ మేం జేసిం దామాకీ చిక్కలే దనుకుంటాం.

నే: ఆ ధనమంతా యేమైందండీ?

మ: నీవు చంద్రగుప్తమౌర్యుణ్ణి పిలవవ్! ఆత న్నడుగు, చెప్తాడు.

నే: అంటే దాన్ని వారు కైంకర్యం జేసారన్నమాటా?

మ: ఏదో అన్నాంగా, మళ్ళీ యెందు—

నే: చిత్తం. మనకూ, పారసీకులకూ నున్న సంబంధబాంధవ్యా లెట్టివండీ?

మ: మా కాలంలో పారసీకులూ ఆర్యులే! మన పూర్వుల్తో కలిసున్నవాండ్లే. కొన్ని కారణాల్చాత—అవి మన కిప్పుడు నవ్వుపుట్టిస్తాయెందుకంటే, వాండ్లంతా చిల్లరదేవు ళ్లెందరున్నా భగవంతు డొకడేనని, త్రాగుడు పనికి రాదని వాదించడ మారంభించారు. మన

(18 వ పేజీ చూడుడు)

కథానిక :

"డాక్టరు"

"కేరా"

జనరల్ యోషీదా, మొగాలకు తొడుగులు అమ్మే ఆ వీథివెంట పోతూంటే, పిల్లలు భయపడి పారిపోయారు. జనరల్‌కు ప్రత్యేకంగా మొగం అంటూ లేదు......అన్నీ మచ్చలు...కత్తిపోట్లు...గాయాలు. ఐనా అతని కళ్లు తమ. పనిని తాము చెయ్యగల్గుతున్నాయి. గాయపడకుండా కత్తి మొనలనుంచి అదృష్టవశాత్తూ కళ్లు రెండూ తప్పించుకొనగల్గాయి. కొన్ని వారాల పాటు హాస్పిటల్‌లోనే ఉండిపోయాడు. అతని రెజిమెంటులోని ఆఫీసర్లు చాలామంది అతను చనిపోయాడనే అనుకున్నారు. హాస్పిటలులో ఉండగా చూడటానికి వచ్చినవారుకూడా, యోషీదా బ్రతుకుతాడని అనుకోలేదు.

అతను జనరలు యోషీదా అయితే అవవచ్చు. కాని మొగం మాత్రం అతనిది కాదు. మాట్లాడితే కంఠస్వరం బొంగురు పోయినట్టుగా ఉంటుంది. రెజిమెంటులోని సైనికులకు యోషీదా అర్థం కాకుండా ఉన్నాడు. దయ అంటూ ఏ కోశానా లేని వాళ్లజనరలు యీ విధంగా తయారయ్యాడంటే నమ్మలేకుండా ఉన్నారు. శత్రువులంటే ఎన్నడూ దయ చూపేవాడు కాదు. ఖైదీలనుగా పట్టుకోవటం అతనికి యిష్టం ఉండేదు. ఒక్కసారిగా సఫా చెయ్యటమే అతని పని. దానివల్ల తిండి ఖర్చు కూడా తగ్గుతుందని అతని అభిప్రాయం. చాలామందిని కాల్చి చంపటానికి తన సైనికులకు పర్మిషను యిచ్చాడు. అది ఒకవిధంగా సైనికులకు ప్రాక్టీసు. దానివల్ల ఆనందం తృప్తి కలుగుతుంది. అన్నింటికంటె మందు గుండు సామగ్రికూడా అంతగా ఉపయోగించవలసిన అవసరంలేదు.

జనరలు యోషీదాకు ప్రత్యేకంగా మొగం అంటూలేదు. ఉన్నా గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉంది. కాని హృదయం మాంఛి దిటవైనది. హాస్పిటలులో పడుకుని ఉండే ప్లానులు తయారుచేసేవాడు. చైనాలో యితనికంటె పరిపాలన కొనసాగించే జనరలులలో గొప్పవాడు లేడు. మొగం లేనప్పటికీ యోషీదా హృదయం జాగ్రతగా కొత్తకొత్త ప్లానులకోసం వెదకులాడుతూనే ఉండేది.

మొగాలకు తొడుగులు తయారుచేసే ఆ వీథిలోకి ప్రవేశించాడు. మనుష్యుల చర్మాన్ని, మాంసపుకండలను బాగుచేసే, షాపులోకి వచ్చాడు. షాపు యజమాని డాక్టరు ఫాంగ్ కాన్. ప్రక్కనే డాక్టరు తమ్ముడు ఫాంగ్‌కి దుకాణం ఉంది. ఆటబొమ్మలు, ముసుగులు తయారుచెయ్యటమేగాక, ఉత్సవాలలో ఊరేగే బొమ్మలను కూడా తయారుచేస్తాడు. అతని దుకాణంలోని తొడుగులు ఉపయోగించకుండా ఏ పట్టణంలోనూ, ఉత్సవం అంటూ జరుగదు.

డాక్టర్ ఫాంగ్ కాన్ కడుపునిండా తిని, విశ్రాంతి తీసుకుంటున్నాడు. సామాన్యంగా భాగ్యవంతులే అతని దగ్గరకు వస్తూంటారు. ఇప్పట్లో చైనాలో భాగ్యవంతుడంటూ ఎవ్వరూ లేరు. ఐనా డాక్టరు ఫాంగ్‌కు నిర్విచారం.

దేశసమస్యలన్నీ, అతని స్వంతానికి సంబంధించిన సమస్యలే. 'శిక్షణలేని వ్యక్తులను యుద్ధంలో నడపటం అంటే వారిని నాశనం చెయ్యటమే' అనే కన్‌ఫ్యూసియస్ సిద్ధాంతాన్ని డాక్టరు అంగీకరిస్తాడు. అవసరం వచ్చినపుడల్లా, ఉచితంగా, గాయాలు తగిలిన సిపాయీల మొగాలను బాగుచేసేవాడు. అంతకంటె గొప్ప సేవ చేశాడు. సాధారణంగా అతనిది శాంత స్వభావం. రాత్రిపూట అతను తిరుగుతూండగా జపానువాడు ఎవరన్నా కనిపించాడా వాడికి మూడిందన్నమాటే. డాక్టరు చేతులు ఇనుప కడీలు. ఒక్కడూ ఐదుగురు జపాను సిపాయీలకు సమాధానం చెప్పగలడు.

జనరలు యోషీదాకు మొగం పాడయిపోయినప్పటికీ, దౌర్జన్యం మామూలుగానే ఉంది. గాయాలతో ఎంతగా మారినా యోషీదా జనరలు. చక్రవర్తి ఎదుటకూడా పెరేడ్ చేసాడు. పండుగలు ఆఖరు అవటంతోనే చక్రవర్తి బంగారు తలుపుల వెనుక మూసివేయబడ్డాడు. మళ్ళీ పెరేడ్‌కు అవకాశం వస్తేనే కాని చక్రవర్తి కనిపించడు.

ఫిలిప్పైన్లమీద జపాను దండయాత్రలో, డాక్టరు పెద్దకొడుకు చచ్చిపోయాడు. డాక్టరు గుళ్ళో దేవుడుముందు నిలబడి ప్రతిజ్ఞ పట్టాడు. తన కొడుకు బ్రతికున్న ఋతువులన్నింటికీ, ఒక్కొక్క ఋతువుకు పదిమంది చొప్పున జపానువాళ్లు చావాలి. ఏడుస్తూ కాలం గడపలేదు. చెయ్యవలసిన పని ఎంతయినా ఉంది. విచారపడటానికి తర్వాత కావలసినంత సమయం ఉంది. చైనా మీద దండయాత్ర జరిగింది. యుద్ధం ఎంతోమంది హృదయాలలో, కనపడని గాయాలను కలుగచేసింది. ఆకలిబాధ ప్రళయ తాండవం చేస్తోంది. రోగాలు మాత్రం కొంతవరకు అరికట్టబడ్డాయ్. ప్రతిరోజు రాత్రిపూట డాక్టరు ఫాంగ్ తిరుగుతూనే ఉన్నాడు. జపానీయులు చస్తూనే ఉన్నారు. తతిమా జనం కూడా రాత్రిళ్లు తిరుగుతూనే ఉంటారు. పగలు పొలం దున్నుకునే రైతు, రాత్రిపూట సైనికుడుగా తయారవుతున్నాడు. ఆఖరుకు వంటవాళ్లుకూడా సాయంత్రం యజమాని యింట్లో పని పూర్తిచేసుకుని, యిల్లు వదలిపోతున్నారు. రాత్రిపూట చైనావాతావరణం జపానీయులకు సరిపడదని జపాను సైనికులు అనుకుంటున్నారంటే, అందులో ఏమీ ఆశ్చర్యములేదు. తిరిగి తమతమ యిళ్లకు పోవాలనుకుంటారు. కాని కొద్దిమందికి మాత్రమే ఆ అదృష్టం పట్టుతుంది.

తను షాపులోకి రాగానే డాక్టరు ఫాంగ్ లేచి ఆహ్వానించలేదని జనరలు యోషీదాకు కోపం వచ్చింది. ఐనా సరిగా మొగం అంటూ లేనివాడికి, ఆవిధంగా కోపం రావటం మంచిది కాదని జనరలుకు తెలుసు. గది గోడల మీద చిత్రించిన చిత్రపటాలు రెండు, తమ్ముడి షాపులోని మొగాలకు ఉపయోగించే తొడుగులు వ్రేలాడుతున్నాయ్. ఆ తొడుగులలో ఒకటి జనరలు హిరోహిటో మొగం లాగా ఉంది. యోషీదా దానిని అంతగా ప్రత్యేకించి చూడలేదు. అందువల్ల పోట్లాటవచ్చే అవకాశం తప్పిపోయింది.

'నేను జనరలు యోషీదాను' అన్నాడు పొట్టిమనిషి కటువుగా.

'కొత్తమొగాన్ని నీకు తయారు చెయ్యమంటావా?' నెమ్మదిగానే అడిగాడు డాక్టరు. జనరలుకు అతన్ని వాలకం ఏమీ నచ్చలేదు. తన ఒక్కచూపు చాలు ఎందుకు వచ్చిందీ తెలుసుకోవటానికి.

'నువ్వు డాక్టరు ఫాంగ్‌వి ఐతే...'

'సరైనచోటుకే వచ్చావ్. ఎలాంటి మొగం కావాలి? దుర్మార్గాన్ని ప్రదర్శించేదనుకుంటా...'

'దుకాణం నాశనం కావాలని ఉందా...ఏం?' జనరలు గట్టిగా అరిచాడు.

'ఐతే...నువ్వు పాడయిన మొగంతో దండయాత్రలు చెయ్యవలసి ఉంటుంది' సమాధానం సరిగానే వచ్చింది.

"ఇంకా చాలామంది డాక్టర్లు ఉన్నారు"

"ఆ...ఉండటానికి చాలామంది ఉన్నారు. నాడి చూడటానికి, జ్వరం నయం చెయ్యటానికి, ఇంకా టానిక్కులు తయారు చెయ్యటానికీ చాలామంది ఉన్నారు. కాని మొగాలను బాగుచేసే డాక్టర్ని, యీ రాష్ట్రానికంతా నేను ఒక్కణ్ణే. ఎవడికైనా, గొప్పవాడికి మొగం చెడిపోతే, నాదగ్గరకే వస్తాడు. మొగంలో ఏర్పడ్డ అన్ని లోపాలనూ బాగు చెయ్యగలను. కాని బాధితముఖభంగిమల్ని, వాటి ఛాయల్ని తీసివెయ్యటం నా తరం కాదు. చైనావంశపు రాజుల కాలంలో, చైనాగోడ పూర్తిఅయిన రోజుల్లో, మా పూర్వీకుడు యీ కళలో ప్రసిద్ధిచెందినవాడు ఒకతను ఉండేవాడు. మేము చేసే యీ పనిని అమెరికను మిలిటరీ డాక్టర్లు ప్లాస్టిక్ సర్జరీ అంటారు. నా పూర్వీకుడు దీనివల్ల చాలా ఆస్తిని సంపాదించాడు. తన యీ పనితనాన్ని, నా పూర్వీకుడు ఆయన కొడుక్కి నేర్పాడు. అతను తన పెద్ద కొడుక్కి...ఈవిధంగా మా వంశంలో యిది పెద్దకొడుక్కి నేర్పబడుతూండేది. ఇది కొన్ని శతాబ్దాలనుంచి వస్తూన్న మా వంశపు ఆచారం. ప్రతివానికి ఫంగ్ కాన్ అని పేరుపెట్టబడుతుంది. ఈ కళ నాకు లభించటం నా అదృష్టం. సామాన్యంగా ఒకకలాన్ని బాగుచేసే తెలివితేటలుంటే చాలు, వైద్యశాస్త్రంలో ప్రవీణులమని అనుకునే డాక్టర్లు చాలామంది చైనాలో ఉన్నారు. వాళ్ళవల్లనే యీ సామెత పుట్టింది. 'రోగానికి మందు తీసుకోకుండా ఉండటమే తగిన మందు' అని, 'మనిషిని చంపేది, మందు కాదు, డాక్టరు' అని సామెతలు ప్రచారంలోకి వచ్చాయి. ఏమైనా 'చౌ' 'చిన్' వంశపు రాజుల కాలంలో వైద్యశాస్త్రం ప్రాముఖ్యత చెందింది. డాక్టర్లు గొప్ప వ్యక్తులుగా ఎంచబడ్డారు. అలాగే 'ఫంగ్ కాన్'ల వంశం కూడాను"

"చాలా బాగుంది" బయటకి అనేశాడు యోషీదా "ఇదంతా నా కెందుకు?"

"ఎందుకా?...డాక్టరుగా నా కున్న యోగ్యతలు నీలాంటి వాళ్లకు అవసరమే. ఎందుకైనా యీసంగతి కూడా చెపుతున్నా. సరియైన డాక్టరు ముందుగా జాతికి గల బాధలను తొలగిస్తాడు. ఆ తర్వాత సామాన్య వ్యక్తుల బాధల్ని..."

"అంటే, ముందుగా చైనాకు గల గాయాల్ని మాన్పాలన్న మాట. ఆ తర్వాత నాకు సాయం చేస్తావా?" జనరలు మాట తీరులో కొంత తీవ్రత చల్లడి అయింది.

"వాదించటానికి యిది మంచి విషయమే. ఐనా దీనికోసం నిన్ను వినియోగించను. మా దేశాన్ని కాపాడే శక్తులకు యుద్ధం అంటే విసుగుపుట్టిన రోజున, విదేశస్థులందరినీ ఒక్కసారిగా తుడిచి పారేస్తాయి"

డాక్టరు ఫంగ్ కాన్ శాంత పరిస్థితుల్లోనే ఉన్నాడు. తన భావాలు బయటికి రాకుండా కళ్లు మూసుకున్నాడు. తన కత్తుల దయకు గురియై జనరలు పడుకుని ఉండటం మంచి అవకాశమే. కత్తులు తన యిష్టం వచ్చినట్టు ప్రవర్తించి, యీ దుర్మార్గుడి ప్రాణాలు తీసివేస్తే, చైనాలో చల్లటి తోటలమీదనుంచి గాలి వీచిందన్నమాటే. ఫంగ్ కాన్‌కు ఉన్నతోట చిన్నదే ఐనా, కొంచెంసేపు దానిలో కూర్చుంటేనే కాని నిద్రపోయేవాడు కాడు. ఆ రాత్రిపూట అంతా సవ్యంగానే ఉందని, పూల మొక్కలు అతనికి తెలియపరచేవి.

అసలు యీ ఆపరేషను జరగదేమోనని, డాక్టరు తన బుద్ధిని మరల్చుకుంటాడేమోనని జనరలు యోషీదాకుభయం వెయ్యటం ప్రారంభించింది. మళ్లీ తిరిగి డాక్టరు చెప్పటం మొదలుపెట్టటంతో యిదంతా మరీ దృఢపడింది.


"ఒకసారి, తోడేలు చిహ్నాలుగల మొగంతో ఒక మనిషి నాదగ్గరకు వచ్చాడు. సముద్రంమీద ప్రయాణంచేస్తూ బందిపోటుగా డబ్బు సంపాదించేవాడు. తనను ఎదిరించలేని బలహీనులదగ్గర పన్ను వసూలు చేసేవాడు. తీరప్రాంతంలో ఉండి ఎవరినన్నా పట్టుకుందామంటే, ఆ మనిషి యితని తోడేలుమొగం చూసి భయపడి అందకుండా పారిపోతూండేవాడు. అందుకని నాదగ్గరకు వచ్చాడు. అతని మొగపు చిహ్నాలు బాగుచెయ్యాలట. తన మొగం వేదాంతి మొగంలా ఉండాలని అన్నాడు. సరేనని ఒప్పుకున్నా. మాంఛి అందమైన ప్రశాంతతను వెలిబుచ్చే మొగాన్ని తయారుచేసా. ఐనా తోడేలు క్రూరత్వం అతని కళ్లద్వారా ప్రదర్శితమయ్యేది. ఏమైనా నాకు తృప్తి కలిగింది. మొగాలను బాగుచేసే డాక్టరునుగాని, కళ్లను మార్పుచేసేవాణ్ణి కాదుగా..."


"చాలా బాగుంది" అన్నాడు జనరలు. డాక్టరును భయపెట్టి లొంగతీసుకోవటం అంటే పర్వతాన్ని రోడ్డుమీద తనవెంట తీసుకువెళ్లటం అన్నమాట. ఏమైనా డాక్టరు చాకచక్యంతో తనకు సహాయపడవచ్చు. తనేం సముద్రపు దొంగకాదు. మొగంకూడా తోడేలు మొగంవంటిది అంతకంటేకాదు. పెద్దగౌరవం గల బుషిడో వంశస్థుణ్ణి. మొగంను చూసి ఎవ్వరూ, యిది నిజమని నమ్మలేరు. ఐనా యీ విధంగా డాక్టరుకు తన ప్రాణాల్ని అప్పగిస్తున్నానని జనరలు ఒక్కసారికూడా అనుకోలేదు. మొనదేరిన కత్తులు చరిత్రను మార్పుచేశాయనికూడా జనరలుకు తెలియదు.


"రేపు ప్రొద్దున్నే నీకు కొత్త మొగాన్ని చెయ్యటం ప్రారంభిస్తా" డాక్టరు చెప్పటం మొదలుపెట్టాడు. "సూర్యోదయం కాకుండా యిక్కడికి రా. ఆలస్యం అయితే యీ పని నేను చెయ్యను.

ఆ రాత్రి డాక్టరు చాలాసేపు తోటలో గడిపాడు. వెదురుపొదల గుండాలోంచి వీస్తూన్న గాలి చేసే శబ్దం వినటానికి బహు సొంపుగా ఉంది. కొత్తగా బయటకు తీసిన కత్తులలాగా, సూర్యకిరణాలు ఆకాశంలో కనబడటంతోనే, డాక్టరు కత్తులు తనపనిని తాము ప్రారంభిస్తాయి. ఆ పనిని తలచుకుంటే హాయిగా ఉంటుంది? ఐనా ఆపరేషను విజయవంతంగా జరుగుతుందన్న నమ్మకం ఏమిటి? డాక్టరుకు తెలియకుండానే, అనవసరంగా భయం వెయ్యటం మొదలుపెట్టింది. ఏమీ సరిగా అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నాడు. నెమ్మదిగా పక్కనే ఉన్న చలువరాతి బెంచి మీద కూర్చుండిపోయాడు. ఎవరో తన వెనక నిలబడి ఉన్నట్టుగా అతనికి అనుమానం వేసింది. బహుశా యోషీదా అయిఉంటాడు—అతను కూడా తన పదును కత్తితో తాను చెయ్య తగినపనిని కూర్చి ఆలోచిస్తూ ఉండవచ్చు. తల కదలించి డాక్టరు కళ్లు మూసుకున్నాడు. చావంటే తనకు యింత భయం కలుగుతున్నందుకు అతనికి అమితంగా కోపం వచ్చింది. పిల్లలు, స్త్రీలు, బాంబులతో ముక్కలు ముక్కలుగా అవుతున్నారు...ముసలివాళ్లు, గ్రుడ్డితనంతో, ఒకప్పుడు రోడ్లుగా ఉన్న, దారి తెన్నూలేని మార్గాలలో తిరుగుతున్నారు. చైనా దుర్భర పరిస్థితులలో ఉంది. ఈ స్థితిలో జీవించటంకంటె, చావు దొరికితే చాలా గొప్పవిషయమే. యోషీదా చంపనీ, తనకేం భయంలేదు. భవిష్యత్తుకు తానేమీ జడవటంలేదు. తనకేం బాకీలు లేవు. పూర్వీకులు యిచ్చిన మాత్రల్ని జాగ్రతగానే దాచాడు. ఐనా డాక్టరుకు భయంగానే ఉంది. కొంత

(16 వ పేజీ చూడుడు)








బెజవాడ మున్సిపల్ కౌన్సిల్ మాజీ సభ్యుడు, రజాకర్ ముఠానాయకుడు అబ్దుల్ సత్తార్. ఈతనిని ఖైదీగా మద్రాసు తీసికొని వచ్చిరి.

★ రజాక

ఇంతవరకూ సంస్థానంలో 2 వేల మంది రజాకార్లు అరెస్టుచేయబడి
రజాకార్లకు, వారి ఆయుధములను, యూనిఫారములను నూతులలోనో,
సంస్థానమునకు దొంగచాటుగ చేరవేసిన ఇటాలియన్ బారెట్టా సబ్ మెషీన్‌గన్లు,
మోర్టారులు, 2 అంగుళముల మోర్టారులు, 14 బ్రెన్‌గన్లు, 25 టామీగన్లు, 14 స్టెన్‌గన్లు,
125 సర్వీసు బెయనెట్లు, 141 టాక్ సర్వీసు రైఫిలుబెయనెట్లు, 2000 కత్తులు, 100
సామగ్రిలో ఒక భాగంమాత్రమే. ఇటువంటి సామగ్రి ట్రక్కులకొలది ఎంతో ఆప
ప్రజలలో ఒక కొత్త ఉత్సాహము కనిపించుచున్నది. హైదరాబాదులో సర్వ వ్యక్తి
మైన ఈ పతాక ఇంత విస్తారముగ హైదరాబాదులో ఎన్నడూ కానరాలేదు.
లకు అనుగుణముగ మార్పు చెందుటలో నిపుణులనుటకు నిదర్శనముగ నున్నది. పత
కారులుగ ప్రజలను అయిష్టులుగ నుండేవారు.





అరెస్టులు ★

...ని తీవ్రముగ దండించెదరని చెప్పుటకు వీలులేక పోయినప్పటికి, వీరిలో ఘాతుకములు చేసినవారు తగు శిక్ష పొందెదరనవచ్చు. లొంగుబాటుకు ముందు రజ్వీ, ...నో పారవేయవలెనని, లేదా భూమిలో పాతిపెట్టవలెనని చెప్పెనట. చాలామంది రజాకార్లు ఆప్రకారమే చేసినట్లు కనబడుచున్నది. సిడ్నీ కాటన్ ... 14 భారత సైనికులు రజాకార్లనుండి వశపరుచుకొనిరి. ఇవి చాల ఆధునికమైనవి. రజాకార్లనుండి వశపరుచుకొనబడిన ఆయుధములలో ...లియర్ ... 100 పైచిలుకు '303' గన్లు, 88 రైఫిల్సు, 44 పారాట్రూప్ రైఫిల్సు, 4500 మజిల్ లోడర్లు, 75 నాటుబజాకాలు, 403 నాటు పిస్తోళ్లు, 35 గ్రనేడులు, ...0 కత్తులు, 650 బరిశెలు, 15000 సార్లకు సరిపోయే మందుగుండు సామాను ఉన్నవి. ఇంతేగాక ఈ ఆయుధసామగ్రి రజాకార్ల వద్ద పట్టుబడిన మొత్తం ...డే ... పంపివేయబడినది. ఇంకా ఎంతో జిల్లాలనుండి రోజూ వచ్చుచున్నది. హైదరాబాద్, సికిందరాబాద్ గ్రామాలయిన పలు ప్రదేశములందు వ్యాపారములు యథాపూర్వముగ జరుగుచున్నవి. దాదాపు అన్ని ఇళ్లమీద, షాపులమీద త్రివర్ణ పతాకాలు ఎగురుచున్నవి. భారత స్వాతంత్ర్య చిహ్నా ... బజార్లలో అడుగడుగునా పతాకాలు అమ్మువారే కనపడుచున్నారు. ముస్లిములుకూడ త్రివర్ణ బాడ్జీలు ధరించుచున్నారు. హైదరాబాదీయులు పరిస్థితు... న్లను, అరబ్బులను వారి వారి స్వదేశములకు పంపుటకు పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్ చేసిన నిర్ణయము అందరికీ తృప్తి కలిగించినది. వీ రెప్పుడును పేచీ ... ఇదివరకటి ప్రభుత్వము అరబ్బులను, పఠానులను విలువయిచ్చి రప్పించి, రజాకార్లలో చేర్చుటకు శాయశక్తులా కృషి చేసినది.

★

మదరాసులో రజాకరు ఖైదీలు

హైదరాబాదులో పట్టుబడిన రజాకరు సైనికులను ప్రజలు హింసించకుండా తప్పించి పోలీసులు మదరాసునకు తెచ్చిరి. సెంట్రలు స్టేషనువద్ద తీసిన ఛాయాచిత్రాలు.

★



ముక్కుకు ముక్కు

శ్రీ ఓగేటి శివరామకృష్ణ

అనగా అనగా ఒకవూళ్ళో సత్తెయ్య అనే పెద్దఆసామి ఉంటూండేవాడు. సత్తెయ్యభార్య సత్తెమ్మ. తెలివితేటల్లో భార్యాభర్త లొకరినొకరు మించినవారు. వారిలో లోభత్వ ముట్టిపడుతూ యుండేది. వారి గుణములు మంచివి కాకపోవడంవల్ల, వారివద్ద నౌకరుగా చేరడానికి యెవరూ యిష్టపడేవారు కాదు. ఎవరయినా చేరడానికి వస్తే లేనిపోని నిబంధన పెట్టేవారు. ఆ నిబంధన యేమంటే: 'తమవద్ద పని చేస్తూ మధ్య మానివేసి వెళ్ళిపోగూడదు. అట్లా వెళ్ళిపోయేపక్షంలో అతగాడి ముక్కు మాకు కోసియిచ్చివేయాలి. ఒకవేళ మేమే పని మాని వేయాల్సిందని చెబితే మేమే మా ముక్కు కోసియిస్తాం' అని.

కష్టతరమైన ఆ నిబంధన మూలకంగా యెవరూ అక్కడ సేవకుడుగా చేరడానికి ఇష్టపడేవారు కాదు. ఒకవేళ మొదట్లో చేరినవారు, తప్పించుకొనిపోవ ప్రయత్నించేవారు. చిట్టచివరకు మొదట్లో అనుకున్న ప్రకారంగా ముక్కు కోయించుకొని బయటకు వచ్చేవారు.

ఓమారు రాముడనే కుర్రవాడు నౌకరుగా ప్రవేశించాడక్కడ. అతనితోనూ అందరితోనూ చెప్పినట్లుగానే చెప్పారు. రాముడంగీకరించాడు. కొంతకాలం పనిచేశాడు. వారు చేయించే పనులు చూస్తే ఉద్యోగం వదలి వెళ్ళిపో బుద్ధిపుట్టింది రాముడికి కూడా. అందరికీ జరిగిన గౌరవంతోనే చివరకు రాముడు బయట కొచ్చాడు.

రామునికో తమ్ముడుండేవాడు. అతనిపేరు కిష్టయ్య. అంతా అతగాణ్ణి 'కొంటెకిష్టయ్య' అని పిలిచేవారు. కిష్టయ్య మంచి బుద్ధిమంతుడూ, తెలివయినవాడూను. అన్నయ్యాకారం చూసేసరికి కిష్టయ్యకళ్ళీ నీళ్ళుకారాయి. రాముడు జరిగిన సంగతంతా చెప్పాడు. కిష్టయ్య యేదో ఆలోచించి 'వాళ్ళకు బుద్ధిచెప్పి వస్తానుండు' అని బయలుదేరాడు.

కిష్టయ్యని చూసి ఆ దంపతులు యేలాగయినా అతన్ని వెనక్కు తిప్పి పంపించి వేయాలనుకొన్నారు. యెంతో భయపెట్టారు కాని కిష్టయ్య చెక్కు చెదర్లేదు. చిట్టచివరకు దంపతులకు కిష్టయ్యను నౌకరుగా పెట్టుకొనటం తప్పలేదు. కిష్టయ్య పని చెయ్యసాగాడు.

ఏలాగయినా దంపతుల నోటినుంచి 'బాబూ నువ్వు మాకక్కర్లేదు. వెళ్ళిపో' అని వారిచేత అనిపించుకొనడం, వారి ముక్కు కోయించి తీసుకొనడమే కిష్టయ్య ఉద్దేశం. భార్యాభర్త లింట్లో లేనప్పుడు మెల్లి మెల్లిగా యింటిలోని వస్తువులను దొంగిలించడం మొదలుపెట్టాడు. దంపతులు చూచీ చూడనట్లు ఊరుకున్నారు.

ఒకసారి సత్తెమ్మ కిష్టయ్యను గొఱ్ఱెమాంసం తీసుకొనిరమ్మని చెప్పింది. వెంటనే కిష్టయ్య ఆలోచించుకొని, దొడ్లో ఉన్న గొఱ్ఱెను చంపి, దాని మాంసం తీసుకొనివచ్చి సత్తెమ్మ ముందు పెట్టాడు. కిష్టయ్య ప్రవర్తనకు సత్తెమ్మా, అప్పుడే వచ్చిన సత్తెయ్యా ఆశ్చర్యపడ్డారు.

కిష్టయ్య చేతులు కట్టుకొని యిలా చెప్పాడు: "మీరు చెప్పినట్లుగా చేశా. మీరు గొఱ్ఱెమాంసం తీసుకొనిరమ్మని చెప్పారు కాని, బజారుకు పోయి కొని తీసుకొనిరమ్మని చెప్పలేదుగదా. ఇందులో నా తప్పేం ఉంది?"

అతగాణ్ణి వెంటనే పంపించివేయాలనే యుద్దేశం ఆ దంపతుల కిద్దరికీ కలిగింది. కాని పంపించడానికి తామెవ్వరు? ఒకవేళ పంపించవచ్చును కాని ...ముక్కు నెవరిచ్చుకొంటారు? ఈ ఆలోచన పుట్టినప్పుడు కిష్టయ్యని పంపివేయాలనే ఆలోచన ఆగిపోయేది.

మరొకమారు సత్తెమ్మ యింట్లో పనిచేసుకొంటోంది. సత్తెమ్మ కొడుకు గుక్కపట్టి యేడుస్తున్నాడు. కిష్టయ్యతో చెప్పింది సత్తెమ్మ, 'పిల్లవాడు యేడ్వకుండా చూడమని'.

పిల్లవాడు కేరు కేరుమని యేడుస్తున్నాడు. కిష్టయ్యయజమానురాలు, పిల్లవాడు యేడ్వకుండా చూడమని చెప్పింది. పిల్లవాడు గుక్కపగలకుండా యేడుస్తున్నాడు. మరి యజమానురాలి మాటను తానాచరణలో పెట్టడమేలాగ? — పిల్లవాడు ఏడ్పు మానకపోవటంవల్ల పిల్లవాని గొంతుక నొక్కేశాడు. అంతట్నించి పిల్లవాడు కిక్కురుమనలేదు!

భార్యాభర్త లిది చూశారు. తమ పిల్లవాడు పోయేసరికి తమ మతిపోయింది. ఏలాగయినా వీనిబారినుండి తప్పించుకొనవలె ననే ఆలోచన కలిగింది. అందుకుగాను తాత్కాలికంగా అక్కడినుండి పారిపోవ నిశ్చయించారు.

నిశ్చయ మయినతర్వాత కావలసిన వస్తువులు ఒక కఱ్ఱపెట్టెలో పెట్టుకొని, ప్రయాణానికి సిద్ధమయ్యారు.

ఈ గాలివార్త కిష్టయ్యచెవిలోకి యెలాగో వచ్చింది. ఏలాగో నెమ్మది మీద ... ఆ కఱ్ఱపెట్టెలోని కెళ్ళి కూర్చున్నాడు.

అర్ధరాత్రి అయినతరువాత వారు ప్రయాణం సాగించారు. సత్తెయ్య నెత్తిన పెట్టె పెట్టుకొని ముందుకు పోసాగాడు భార్యతో. కిష్టయ్య లోనుండి సౌఖ్య మనుభవిస్తున్నాడు. ఆకలయినప్పుడు, అందులో తమ కవసరమైనప్పుడు తినవచ్చు ననుకొని, కొన్ని పండ్లు పెట్టుకున్నారా దంపతులు. కిష్టయ్య వానిని భుజించేశాడు.

చాలా దూరం వచ్చారు. మర్నాడు మధ్యాహ్నమయింది. అలసిపోయారు వాళ్ళు. కొన్ని పండు తిని విశ్రాంతి తీసుకొందామని ఒకనూతికి దగ్గరగా వచ్చి పెట్టె దింపారు. అబ్బ! ఇప్పటికి శనిగాడి బాధ వదలిందనుకొంటూ సత్తెయ్య పెట్టె తెరిచాడు. అందులోంచి కిష్టయ్య బయటికి వచ్చాడు!

ఆ కలితో నన్నవా రిద్దరికీ కిష్టయ్యని చూచి నవ్వాలో, ఏడ్వాలో అర్థమవలేదు. చేతులు కట్టుకొని యిలా గన్నాడు కిష్టయ్య: "అయ్యా, తమ సేవకుణ్ణి సేవకుణ్ణి వదలి, తామొంటరిగా పోయి కష్టములు పడుతూంటే నే నెట్లా చూడగల్ను. తమ కింత నిర్దయ కలిగింది నామీద. తమరలా వదిలేస్తారనే భయంచేతనే పెట్లో..'

వాళ్ళాకలితో అల్లాడి పోతున్నారు. తోడు కిష్టయ్య యమధర్మరాజుమల్లే ఉన్నాడు వాళ్ళకి. కిష్టయ్య వాళ్ళకు తాగినన్ని మంచినీళ్ళు తెచ్చి పోశాడు. ఏలాగయినా యింతటి కిష్టయ్య బాధ వదుల్చుకోవాలని తలచసాగారు సత్తెమ్మా, సత్తెయ్యాను. ఏవేవో ఆలోచనలు చేశారు. చీకటి పడింది. ఆ రాత్రికి, ఆ నూతిగట్టునే పరుండ నిశ్చయించుకొన్నారు. సత్తెమ్మ ముగ్గురికీ పక్కలు దూరందూరంగా వేసింది. మొదటిది నూతిదగ్గరగా కిష్టయ్యకు; రెండవది తనకూ, మూడవది తన భర్తకూ. కిష్టయ్య ఏదో ఆలోచించుకొని, వారితోబాటు నిద్రించాడు.

సత్తెయ్య, సత్తెమ్మలు నిద్రపోయిన తరువాత కిష్టయ్య లేచాడు. వారేదో దురాలోచన చేస్తున్నట్లుగా తోచింది కిష్టయ్యకు. యజమానురాలి పక్కను తాను పరున్నచోటికి మార్పుచేశాడు. తరువాత కిష్టయ్య నిద్ర నభినయింపసాగాడు.

సత్తెయ్య నిద్రముఖంతో లేచాడు. తొందర తొందరగా లేచి, మొదటి పక్కను నూతివైపునకు లాక్కుని పోయాడు. దానిమీద పరున్న శరీరాన్ని నూతిలోనికి తోశాడు.

తిరిగి చూచేసరికి కిష్టయ్య లేచి నుంచున్నాడు! సత్తెయ్య తల వంచుకొన్నాడు. ఏం చెయ్యడానికీ తోచలేదు. తన భార్యను తనచేతులతో చంపివేసినందు కతడు విచారించలేదు. కాని, కిష్టయ్యను వదల్చుకొనటం యెల్లాగా అని బాధపడసాగాడు.

కిష్టయ్య తన ముక్కు కోసియిచ్చి శని వదల్చుకొందామనుకొన్నాడు. అత్తమామలకు తన భార్య మరణం సంగతి చెప్పవలెననే ఆలోచన కలిగింది. వెంటనే ముక్కు కోసి యివ్వటమనే ఆలోచనకు స్వస్తిచెప్పాడు. ముక్కుకోసియిస్తే అత్తమామలూ, బావమరుదులూ హేళన చేస్తారని అతనికి భయం కల్గింది.





వింత చీమలు

"రాము"

అమెరికాలో, తేనెటీగలవలె తేనె తయారు చేసే చీమలు కొన్ని యున్నవట. చిన్న చిన్న మొక్కలు, పూలమొక్కలు గల ప్రదేశములో ఇసుకనేలపై నాలుగైదు చదరపడుగుల వైశాల్యము గల్గి వీటి పుట్ట యుండును.

వీటిలో రెండు రకముల చీమలున్నవి. పసుపురంగు చీమలు, నలుపు రంగు చీమలు. పసుపు చీమలలో తేనె చేయునవి కొన్ని, తేనె చేయువాటిని పోషించు సేవకులు కొన్ని. నల్లచీమలు పసుపువాటికంటె బలిష్ఠమయినవి. ఇవి రక్షకభటులు. పసుపుచీమలకొరకు ఇవి ఇతరులతో పోరాడును. ఇవి పుట్ట ద్వారములలో సెంట్రీలవలె రెండు శ్రేణులలో పోవుచుండును. వీటికి శత్రు వగపడినవెంటనే తమ దవడలు విప్పి, వెనుకకాళ్లపై నిలబడి, అన్నియు కలిసి



యుద్ధమునకు పోవును. వీటి చేతబడిన సాలీళ్లు, కందిరీగలు మొదలయిన కీటకములు సహస్రఖండములుగా చీల్చబడును.

నల్లచీమలు కొన్ని పుట్టను రక్షించుచుండగా, కొన్ని పుట్టద్వారమువద్దకు ఒక బారులో సువాసన గల ఆకులను, పూలను మోసికొనివచ్చుచుండును. ఈ పత్రపుష్పములను సేవకులయిన పసుపుచీమలు అందుకొని పుట్ట లోనికి తీసికొనిపోవును.

ఈ తేనె చీమలపుట్టలో, భూమికి మూడడుగుల లోతున సాలెపురుగులవలవలె అల్లబడిన చదరములుగల జాల మొకటి గూటిగోడలకు అంటవేయబడియుండును. ఒక్కొక్క చదరములో నొక తేనె తయారుచేసే పసుపుచీమ కూర్చొని యుండును. ఈ గూళ్లనుండి ఈ చీమలు బయటికి రావు. ఇవి హెచ్. జి. వెల్సు మహాశయుడు వర్ణించిన మోర్లాకుల (Morlocks) వంటివి. వీటికి నిత్యకారాగారవాసమే.

వ్యవసాయము చేసే చీమలు మన దేశములో కూడ కనపడుచుండును. ఇవి తమ పుట్టచుట్టూ పదునైదు, లేక ఇరవై అడుగులవరకు శుభ్రముగా, ఏ మొక్కా లేక యుంచును. ఈ చక్రము మధ్య పుట్టతలు పుండును. ఇక్కడినుండి, ఒక్కొక్కమారు అరవై అడుగుల పొడవు గల రోడ్లు ఆరు, లేక ఏడు, అన్నివైపులకు నిర్మింపబడియుండును. ఈ రోడ్లలో రెండు బారులుగా పుట్టవైపు ధాన్యము మోసికొని కొన్ని, పుట్ట విడచి ధాన్యము తెచ్చుటకు కొన్నీ పోవుచుండును.

ధాన్యము సేకరించుట కొక చీమ మొక్కపై కెక్కి కంకిలోని విత్తును గుంజి వెలివేయును. ఊడివచ్చిన విత్తును దవడలతో అదిమిపట్టుకొని కొంత క్రిందికి దిగి క్రింద వేచియున్న స్నేహితులకు వితనము పడవేయును. పళ్లచెట్టుమీద మనుష్యుడు కాయలను క్రింది పడవేయగా వాటిని వాని స్నేహితు లేరుకొన్నట్లు ధాన్యపు మొక్కపై నున్న చీమ క్రిందికి వేసిన గింజలను ఇతర చీమలు సేకరించి గూటికి చేర్చును.

ధాన్యము దొరకు స్థలము చాల దూరముగానుండిన చీమలు కొన్ని జట్లుగా తయారగును. మొదటి జట్టు కొంత దూరము మాత్రము ధాన్యము మోసి రెండవజట్టు కందించి మరల ఇంక కొంత ధాన్యము తేబోవును. రెండవ జట్టిట్లే మూడవదానికి అందించి వెనుదిర్గును.

ఈ చీమలు తమ ఆహారముగా జొన్న, వరి మొదలయిన ధాన్యములేగాక కొన్ని గడ్డి ధాన్యములు గూడ వాడును. కొన్ని గడ్డి ధాన్యములనివి పండించును గూడ! వీటికి చీమ-వరి అని పేరు. ఈ ధాన్యపు బీజముల నివి శరత్కాలమునకు ముందే పుట్టచుట్టూ గల చదును ప్రదేశమున నాటును. నవంబరు నెల మొదటి రోజులలో పుట్టపై సుంద్రముగా నాల్గడుగుల వెడల్పుతో పచ్చని పైరు మొలచును. చీమ లీ పైరును చాల జాగ్రత్తగా సాగుచేయును. ఈ పైరు చుట్టూ ఒక్క గడ్డి మొక్కను గూడ ఉండనియ్యవు. జూన్ నెలలో పంటకు వచ్చిన ఈ పైరును కోసి ధాన్యము సేకరించిన తర్వాత, ఎండు మొక్కలను పీకివేసి, చీమలు వచ్చే పైరు నాటను భూమిని దున్ని పరిశుభ్రముగా నుంచును.

పంటబెట్టుటవలన లభించిన ధాన్యపుగింజలను గానీ, లేక వేరే విధముగా సేకరింపబడిన గింజలను గానీ, చీమలు వాటి పుట్టలలో ప్రత్యేకమయిన గాదె (granary) లలో నిలువజేయును. పుట్టలోనికి ధాన్యము రాగానే కొన్ని చీమలు వాటిని పొట్టు, తవుడు లేకుండ పరిశుభ్ర పరచును. పొట్టు పుట్ట పైభాగమున కుప్ప వేయబడును. ఈ కుప్పలు గాలికి కొట్టుకొని పోవును. చీమల ధాన్యపు గాదెలు భూమికి నాల్గడుగుల లోతులో నుండును. వీటి గోడలు, నేల కప్పు చాల బలిష్ఠముగాను, నునుపుగాను మంచి వైశాల్యము గలిగియుండును.

చీమలు ఈ విధముగా నిల్వజేయు ధాన్య మేల మొలకెత్తదో ఇంతవరకు మనకు తెలియదు. మొలకెత్తుటకు కావలసిన తేమ, గాలి, వెచ్చదనము ఉన్నను నేలలోని ఈ గింజలు చెడవు. ఇవి మొలకెత్తకుండ చీమలు కొంత జాగ్రత్త వహించుటయు గలదు. ఎక్కువ వానవలన, లేక మరే కారణమువలననయిన గింజలు తేమగా నున్నయెడల చీమలు వాటిని సూర్యరశ్మిలో నెండబెట్టి తర్వాత గాదెలలోపోయును. గింజలు మొలకెత్తకుండ గాదెలను ఆమ్లపు ఆవిరులతో నింపును. ఒకవేళ గింజలు మొలకెత్తినా, వెంటనే చీమలు ప్రథమమూలము (Radicles) ల కొరికివేసి మొక్క వృద్ధిచెందక చేయును!

ఈ చీమల ఆహారము ఒక్క ధాన్యమే గాదు. ఇవి చెదపురుగులను గూడా గాదెలలో నిల్వజేసి భక్షించునట!

వ్యవసాయముచేసే చీమలు, తేనె చీమలు, పోట్లాడే బందిపోటు చీమలు—వీటి జీవితము, ప్రవర్తన, అలవాట్లు గమనించిన చీమలకుకూడా కొంతవరకు జ్ఞానమున్నదని మన కభిప్రాయము కలుగక మానదు.

చీమలు మానవుల వలెనే పరిసరముల కనుగుణ్యముగా సర్దుకొనుచుండును. తేనెటీగలవలె వీటి పుట్ట లేక గూడు ఒకే ఆకారముతోను, శిల్పపు కట్టడముతోను ఉండదు. ఇవి ఏ పనిలోను ఐకమత్యముతో మెలగుచుండును. ఆస్ట్రేలియాలో ఆకుపచ్చని చీమ లున్నవట. ఇవి మనుష్యుని తలయంత పెద్ద గూళ్ళు గూడా నిర్మించును. ఈ గూళ్లు ఆకుల వంచి ఒక మనీపర్సు వలె కుట్టుటవల్ల ఏర్పడినవి. ఇట్లు ఆకుల వంటవేయుటకు కొన్ని వేల చీమలు ఆకులను వంచిపట్టుకొని యుండగా, కొన్ని వేల చీమలు తమ నోటినుండి స్రవించు జిగురు ద్రవముతో అంటించి కుట్లు వేయును.

కిర్బీ అనే శాస్త్రజ్ఞుడీ క్రింది చక్కని కథ తెల్పుచున్నాడు. అతడు గోడకొంచెము దూరములోనున్న బల్లమీద కొన్ని తినుబండారములు ఉంచి చీమలు రాకుండునట్లు, బల్ల నాల్గు కాళ్లు నీటి గిన్నెలలో పెట్టియుండెనట. నీటిగిన్నెలు చీమలకు అడ్డు రాలేదు. త్వరలో నీటి నీదుకొని తినుబండారములవద్ద హాజరవడము మొదలుపెట్టినవి. తర్వాత అతడు బల్ల కాళ్లకు టర్పెంటైను రాచి చీమల నా మార్గమున రాకుండునట్లు చేసెనట. కాని అచిరకాలములోనే చీమలు మరీ బల్లమీద అగుపడినవట. పరిశీలింపగా చీమలు గోడపై కెక్కి, బల్లనుండి ఒక అడుగు ఎత్తునుండి బల్లమీదకు దుముకుచుండినవట!

ఎసిటాను చీమలు నీటివాగుల నతితెలివితో దాటునట. అవి నీటివెంటనే ఒక ఇసుకనేలవరకు ప్రయాణముజేసి అచ్చట ప్రతిచీమ ఒక ఎండు కట్టెముక్క దవడలతో పట్టుకొనునట. ఈ కట్టెముక్క నీటిలో వేసి దానిపై చీమ ఎక్కును. ఇట్లే అన్నీ అవతలిగట్టుకు గుంపుగా చేరును. ఆఫ్రికా చీమలు చెట్లనుండి దిగుటకు కొమ్మలనుండి ఒక గొలుసువలె ఒకదాని నొకటి



పట్టుకొని క్రిందివరకు వ్రేలాడునట. అవి వాగుల దాటుటకు గొలుసువలె ఏర్పడిన చీమల వంతెనపై నడచిపోవునట.

చీమలు గాయపరుపబడిన లేక చంపబడిన తమ స్నేహితుల జూచినపుడు చాల కలవరము జెందును. చీమలబారులో ఒకటిరెండు చీమల చంపి అచ్చటనే వాటి కళేబరముల వదలివేసిన కొంతసేపటికి చీమలన్నీ పలాయనమైపోవును.

చీమలు వాటిలో మృతిజెందినవాటిని మానవుల వలెనే సమాధిచేయునని ఒక శాస్త్రజ్ఞుడు తెలుపుచున్నాడు. "చనిపోయిన చీమలచుట్టూ ఒక గుంపు చీమలు మూగినవి. కొన్ని తమపుట్టకు వెళ్ళి మరికొన్ని చీమల తోడితెచ్చినవి. అన్నీ జతలు జతలుగా ఒక బారుగా తీరినవి. ఒక్కొక్క జత ఒక్కొక్క పీనుగను మోసికొన్నవి. ఊరేగింపు బయలుజేరినది. పీనుగు మోసికొన్న జత చీమల వెనుక ఖాళీగానుండే చీమల జత ఒకటి ఉండునట్లు నలభై జతల చీమ లా ఊరేగింపులో నుండినవి. ఈ బారుల వెనుక ఒక గుంపుగా కొన్ని వందల చీమలు అనుసరించి వచ్చుచుండినవి. పీనుగు మోయు జత చీమ లలసినపుడు—వెనుకనున్న జత పీనుగు నందుకొంటూ అన్నీ ఇసుక ప్రదేశము చేరినవి. చీమలు కొన్ని ఇసుకలో గుంతలు తీసినవి ఒక్కొక్క గుంతలో నొక్క పీనుగ నుంచి మన్నుగప్పినవి. ఇంతలో కొన్ని చీమలు ఈ పని చేయక పారిపోవ జూచినవి. వాటిని పట్టుకొని తెచ్చి అన్ని చీమలు వాటిపై బడి చంపివేసినవి. అన్నింటినీ ఒక గుంతలో తోసి మూసివైచినవి."

ఇట్టి అద్భుతమైన మనస్తత్వముగల చీమలగురించి పరిశోధనలు సల్పిన సర్ జాన్ లబ్బక్ మాక్ కుక్, లినిసికమ్, బేట్స్ మొదలయిన జీవవైజ్ఞానికులు మన కెంతయో వందనీయులు. వీరు చీమలేగాక ప్రతిజంతువుమనస్తత్వము, అలవాట్లగూర్చి వివరముగా పరిశోధించియున్నారు.

చేసేదిలేక కిష్టయ్యను వెంటబెట్టుకొని బయలుదేరాడు సత్తెయ్య. కిష్టయ్య యేదో ఆలోచించాడు. యజమానికంటె ముందుగా సత్తెయ్య అత్తవారింటి కెళ్లి వారితో "ఏమండోయ్, నన్ను మీ అమ్మాయి పంపించింది. మీ అల్లునికి పిచ్చెత్తింది...అల్లుడుగారిలా గొస్తున్నారుట. రావటంతోటే అతగాణ్ణి పట్టుకొని, వాతలు వేస్తే, వెంటనే అది పోతుందని ఆవిడ చెప్పింది. రావటంతోటే ఆ పని చెయ్యండి".

సత్తెయ్య యింటికి వచ్చాడు.. తనకంటె ముందుగా వచ్చిన కిష్టయ్యను చూసి వీడు మళ్ళా యేదో హంగామా చేసిఉంటా డనుకొంటున్నాడు... 'మీ అమ్మాయి నూతిలో బడి మరణించింది' అని చెబుదా మనుకొంటున్నాడు సత్తెయ్య... ఆ మాట లనబోతూంటే బావమరుదులు వచ్చి, కాళ్లూ చేతులూ పట్టుకొన్నారు. అత్తగారు అట్లకాడ కాల్చి, మామగారి కిచ్చింది. అతడు అట్లకాడ పుచ్చుకొని, సత్తెయ్య దగ్గర కొస్తున్నాడు. సత్తెయ్య అంతా చూశాడు. గ్రహించాడు కూడాను. ఇదంతా కిష్టయ్య చేసిన నాటకం. పాము దగ్గర కొస్తే వాతలు తప్పవు... ప్రక్కనే కిష్టయ్య నవ్వుతున్నాడు... సత్తెయ్య ఏడుస్తూ "ఒరేయ్ కిష్టిగా నీ కక్ష తీర్చుకొంటున్నావ్... తీర్చుకో, ముక్కు యిస్తా. ఇంక నా జోలికి రాకు. వదలండి' అని బలవంతాన వదలించుకొని తన ముక్కు కోసి కిష్టయ్య కిచ్చాడు ... అంతా ఆశ్చర్యంతో చూశారు.

కిష్టయ్య సంతోషంతో, ముక్కుతో ఇంటికివచ్చి, అన్నగారి ఊడిపోయిన భాగాని కంటించాడు; అది అతుక్కుపోయింది!...

బాలగేయాలు

గౌరమ్మ

శ్రీమతి పర్చ సీతాదేవి

(సంపాదకురాలు)

౧

ఒక్కొక్క పో కందునే - గౌరమ్మ
ఒక్కకట్టాకు లందూ
రాచూరిసున్నమందూ - గౌరమ్మ
రాయబారా మందునూ
నిను జూచి మాయన్నలూ - గౌరమ్మ
ఏడు మేడా లెక్కిరీ
ఏడు మేడల లోపలా - గౌరమ్మ
దొంగలేమో దోచిరీ
దొంగలతో ఏమందునూ - గౌరమ్మ
దొరలతో ఏమందునూ
బంట్లకూ బయ్యారమూ - గౌరమ్మ
బాలలతో పెండ్లాటమూ.

౨

ఒక్కొక్క అతిుంతలూ - గౌరమ్మ
ఒక్క మల్లెసారెలూ
నన్న దీపాలలో - గౌరమ్మ
చిన్న చిటివత్తులూ
నీలాటి రేవువద్దా - గౌరమ్మ
నీనోము నీకు జెల్లె
నీనోము నీకు జెల్లె - గౌరమ్మ
నా నోముఫలము జెప్పూ
తపుకుతో తపికెడూ
ముత్యాలు తీసుకొని
గుమ్మడి పుచ్చులా
సొమ్ములూ పెట్టుకుని
వీథినా పెండ్లాడవే - గౌరమ్మ
వాడనా పెండ్లాడవే.

డాక్టరు

(11 వ పేజీ తరువాయి)

ప్రయత్నం మీద తల వెనక్కి త్రిప్పి చూశాడు. ఎవ్వరూ లేరు. కాని దూరాన నల్లటి ఆకారాలు, పొడుగాటి గౌనులు తొడుక్కుని తోటలోకి ప్రవేశిస్తున్నాయ్. సన్నటి దెయ్యాలలాగా, నెమ్మదిగా వచ్చాయ్. అవి రావటానికి ఒక తలుపు లేకపోతేనేం, అవి వచ్చేసాయ్. కథలు చెప్పేవాడిముందు వినేవాళ్లు కూర్చున్నట్టుగా తమతమ స్థానాలలో డాక్టరుకు ఎదురుగా కూర్చున్నాయి. అన్ని ఆకారాలూ ముసలివాళ్లలుగా ఉన్నాయ్. ఒక్కటీ కుర్రతనపు ఆకారంలేదు. అన్నింటికీ తనతో సంబంధం ఉన్నట్టుగా ఉంది. కాని తనకు ఏమీ అర్థం కావటంలేదు.

ఇప్పటికి అర్థమయింది. వీళ్లంతా తన పూర్వీకులు—డాక్టర్లు. వీరికి నిదర్శనంగా తను యిప్పుడు బ్రతికిఉన్నాడు. అందరూ ఫంగ్ క్వా పేరుగలవాళ్లే.

మచ్చెమటలు పోశాయ్. కళ్లు ఆ గుంటల్లో మంచుముక్కల్లు అయిపోయాయ్. జీవమే హరించుపోయి, నెత్తురు గడ్డకట్టుకుపోయింది. పూర్వీకులయెదుట తనవిచారణజరుగుతున్నట్టుగా ఉంది. ఈ డాక్టర్లలో ఒక్కడూ కూడా తన రోగికి రోగాన్ని పోగొట్టకుండా ఉండలేదు. ఎన్నడూ మోసం కూడా చెయ్యలేదు. మొగం బాగుచేస్తానని చెప్పి తను యోషీదాను చంప దల్చుకున్నాడు. చైనాకోసం తాను ఎంతమంది జపానీయుల్ని చంపినా అది పూర్వీకులకు అక్కరలేదు. తన దగ్గరకు మందుకోసం వచ్చిన రోగులుమాత్రం వాళ్లు కాకూడదు. ఈ పూర్వీకులంతా శస్త్రవైద్య విధానాన్ని ప్రఖ్యాతికి తెచ్చారు. చైనాచరిత్రలో, ఎన్నటికీ చెరిగిపోని సిరాతో, తమ కుటుంబ దివ్య చరిత్రను వీళ్లు వ్రాసుకున్నారు. తమ వంశంలో ఒకడు ద్రోహం చేశాడని అది చెరిగిపోవటానికి వీలు లేదు.

పొడుగాటి చెట్లనుంచి, మంచు కురుస్తోంది. రాత్రంతా నిశ్శబ్దంగా ఉంది. పొదురు పొదలలోనుంచి వచ్చే సంగీతం ఆగిపోయింది. తోటలో సువాసన లేదు. ఏమీ చప్పుడు అవటం లేదు. డాక్టరు కళ్లు తీవ్రంగా పనిచేస్తున్నాయ్. జనరలు యోషీదా మొగంలోని చెడుతనాన్ని బాగు చెయ్యటానికి తన పూర్వీకులంతా ఎందుకు కనపడటం? చచ్చిన తర్వాత విరోధికూడా, స్నేహితుడేగా!...

గోడప్రక్కనే త్రాగి, ఒక కవి యింటికి పోతున్నాడు. జపాను సైన్యపు నిబంధనలకు వ్యతిరేకంగా పాటకూడా పాడుతున్నాడు.

దెయ్యాలున్నాయ్
దేవతలున్నాయ్...
పాడవోయ్...
యిష్టం వచ్చినట్టు—
పాడవోయ్...
ఆకలితో...
అటమటించి
చస్తానో...బ్రతుకుతానో......
తెలుసా...ఎవరికి తెలుసు...
ఏం తెలుసు...

బాంబు పడిన శబ్దం అయింది. రాత్రిపూట వచ్చే యీ శబ్దాలకు తిర్గి ప్రాణం వచ్చినట్టుంది. డాక్టరు ఫంగ్ క్వా తన చుట్టుపక్కల, ఆత్రుతతో చూశాడు. తన పూర్వీకుల ఆకారాలు మాయమై పోయాయ్. వాళ్ల జ్ఞాపకంమాత్రం తనలో అలాగే నిలిచిపోయింది. వారిచ్చిన సందేశం తెలిసింది. వాళ్లు మాట్లాడకపోయినా, కనిపించటంతోనే సరిపోయింది. కాని జనరలు యోషీదాను వదలించి వెయ్యాలనే కోరిక యింకా పీకుతోనే ఉంది.

ఉదయ కాలపు సూర్యుడు తూర్పుదిశన ఆకాశానికి మెరుగులు దిద్దుతున్నాడు. అక్కడే నీళ్లతో డాక్టరు తన మొగం కడుక్కున్నాడు. దానితో నుదురు చల్లబడింది. మంచు బిందువుల లాంటి చెమటకూడా పోయింది. తను చెయ్యవలసిన పని ఉంది. షాపులోకి రావటంతోనే జనరలు యోషీదాను చూశాడు. జనరలు డాక్టరు కోసం ఎదురుచూస్తున్నాడు.

అభివందనాలు మామూలుగానే జరిగాయ్. లోపలికి—సర్జరీ గదిలోకి రమ్మని డాక్టరు సంజ్ఞ చేశాడు. తోటకు ఎదురుగా ఉన్న సర్జరీగదినే డాక్టరు స్టూడియో అని అంటాడు. ఇక్కడే మొగాలను బాగుచెయ్యటం. భయపు సూచనలను కనపరచకుండా, డాక్టరు ధైర్యంగానే ఉన్నాడు. తన విరోధులజాతికి చెందిన డాక్టరు కత్తులతో తనకు ఆపరేషను చెయ్యటం... ఏం జరిగినా ఎవ్వరికీ తెలియదు. నిజానికి తన ప్రాణాలను యోషీదా యీ డాక్టరుకు అప్పగిస్తున్నాడు. షింటో దేవుళ్లని నిజానికి ఒకసారి తలచుకోవాలి. కాని యోషీదా తన భవిష్యత్తు కార్యక్రమాన్నిగురించి తెగ ఆలోచిస్తున్నాడు.

డాక్టరు ఫంగ్ క్వా తన పనిని తాను చేస్తున్నాడు. పక్కనే బల్లమీద స్నేహితుల లాగా వరుసలో ఉన్న కత్తుల్ని, సున్నితంగా ఉపయోగిస్తున్నాడు. ఆఖరున ఉన్న కత్తి సన్నగా, పదునుగా ఉంది. దానితో జనరలు ప్రాణాలు ఒక్కసారిగా టప్‌మని అనవచ్చు. అలా జరుగకుండానూ ఉండవచ్చు. జనరలు ఎదురురొమ్ముమీదనుంచి, తొడలనుంచి కావలసినంత చర్మాన్ని తీసి, మొగంమీద అమరుస్తున్నాడు. మామూలుగా దేశవాళీ సువాసనపు మత్తుమందు యివ్వటంవల్ల, జనరలుకు బాధ ఏమీ కనిపించటంలేదు. డాక్టరు తన పనిలో నిమగ్నుడైపోయాడు. ఈ చిన్న మొగపు మనిషికి తానేం విరోధి కాడు. టాంగ్ వంశపు రాజులకాలంనుంచి, తన పూర్వీకులు వంశంలో ఒకరి కొకరు యిస్తూపోయిన అద్భుతశాస్త్రాన్ని వినియోగపరుస్తున్న డాక్టరుగానే ఉండిపోయాడు. ప్రొద్దు ఎక్కినకొద్దీ గంటలతరబడి, డాక్టరు పనిచేస్తూనే ఉన్నాడు. వెలుతురు తగ్గిపోతూండేసరికి డాక్టరు కట్లుకట్టాడు. చైనా దేశీయుడి మొగంలాంటిది చివరికి తయారయి కూర్చుంది.

డాక్టరు ఆజ్ఞప్రకారం, నౌకరులు జనరలు యోషీదాను, తోటలో ఉన్న గదిలోకి మోసుకుపోయారు. హాయిగా పడుకుని విశ్రాంతి తీసుకోవచ్చు. తానొక దుర్మార్గపు జనరలునని, అంతా తన్ను ద్వేషిస్తున్నా సరిగానే సౌకర్యాలు కలుగచేస్తున్నారని......యీ విషయాలన్నీ అక్కడ పడుకుని సుఖంగా మరచిపోవచ్చు.

ఈ లోగా డాక్టరు తన మామూలు బట్టలు వేసుకుని, తన గదిలో ప్రశాంతంగా టీ త్రాగడానికి కూర్చున్నాడు. తెరచిన కిటికీలోనుంచి సువాసనతో గూడిన మంచిగాలి వస్తోంది. మళ్లీ యింకో రాత్రి రాబోతోంది. ఐనా అతని కేం భయంలేదు. తన పూర్వీకులకు, శస్త్రశాస్త్రానికి విశ్వాసపాత్రు డయాడు. ఏమైనా యిక చైనాకు భయంలేదు. తన పూర్వీకులనుంచి తనకు విజ్ఞానం లభించింది. వాళ్లు చనిపోయినా తమ భావాలను తనకు అందచెయ్యగల్గారు. ఇదిఅంతా కల అని అనుకోవటానికి కూడా వీలు లేదు. నిజంగా తన పూర్వీకులు వచ్చారు. ఏభై సంవత్సరాల వయస్సులో నక్క, ఆడదిగా మారటం ఎంత నిజమైన విషయమో యిదీ అంత నిజమే.

తనకు చేసిన పరిచర్యల విషయంలో, యీ మధ్యవారాలలో యోషీదాకు తప్పు పట్టటానికి వీలులేకుండా ఉంది. తిండి సరిగ్గా పెట్టారు. పక్క కూడా చక్కనిది యిచ్చారు. ఏమయినా అలగడ మాత్రం మహామెత్తగా ఉంది. తన దేశంలోలోగా కొయ్యది అయితే, యోషీదాకు బాగుండేది. అదీ కాకుండా అతనికి పరుపులమీద పడుకునే అలవాటు లేదు. శీతకాలంలో మంటకై ఏర్పరచబడ్డ పొయ్యి అతన్ని కొద్దిగా కలవరపరచింది. బహుశా చైనా దేశభక్తుడు ఎవడన్నా ఒకడు పొయ్యిలో మంట పెట్టవచ్చు. తను కాస్తా వేడికి కమిలి పోవలసి వస్తుంది. భయపడటానికి కూడా ఆస్కారం ఉంది. కాని డాక్టరు విషయంలో అలా భయపడవలసిన అగత్యం ఏమీ లేదు.

పక్కమీదనుంచి లేచి క్రిందరగ్గులమీద పడుకుందామనుకున్నాడు. కాని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. అది పిరికితనం అని కూడా అనవచ్చు. అందుకని మెత్తటిపరుపువల్ల కలిగే బాధని చచ్చినట్లు సహించాడు.

కట్లు విప్పవలసిన రోజు వచ్చింది. ఆ ప్రొద్దున్నే కట్లు విప్పారు. తొందరపాటును అణచిపెట్టుకుంటూ, డాక్టరు తనకు ఎదురుగా పట్టుకున్న అద్దంలోకి చూశాడు. కుర్రకారు చైనావాడి నవ్వుతూన్న మొగం ప్రత్యక్షమయింది. డాక్టరు మొగాన్ని తయారుచేస్తూ, నవ్వు చిహ్నలను ఏర్పాటు చేసాడు. ప్రపంచంలోకల్లా అస్తమానం నవ్వుతూండే జాతిఅయినా, తన చైనా ప్రజలు, నవ్వుమొగం కలవాడిని అసహ్యించుకుంటారని డాక్టరుకు తెలుసు. అందులోనూ యిప్పట్లో చైనా అమిత బాధల్ని అనుభవిస్తూంటే, నవ్వవలసిన అగత్యం ఏమీ లేదు. ఐనా యోషీదా నవ్వి, తృప్తిపడ్డాడు.

'నీఋణం తీర్చుకోలేను'అన్నాడు యోషీదా. ప్రమాదం ఏమీ లేకుండా తను చైనాకు ఒక భయంకరరూపంగా తయారవవచ్చు. ఎవ్వళ్లూ అనుమానించకుండా ఎంతమందినైనా చంపవచ్చు కూడా.

డాక్టరు నెమ్మదిగా "నీకు తృప్తి కలిగిందన్న మాట" అన్నాడు.

"చాలా..." అన్నాడు యోషీదా......

"ఐతే నాకు సంతోషం. నీకు తృప్తికలగదేమో ననుకున్నా"

"ఏమిటి నీ ఉద్దేశ్యం? నాకేం అర్థం కాకుండా ఉంది. ఏం, నా మొగం చందమామలా తెల్లగా సుంద్రంగా లేదూ?"

"ఉంది......కాని మళ్లా ఆ తోడేలుకథ జ్ఞాపకానికి వస్తుంది. నీ కళ్లను కొంచెం బాగు చెయ్యాల్సింది."

"ఐతే నా కళ్లు తోడేలు కళ్లలాగా వున్నాయా?" కోపంగా అడిగాడు జనరలు.

"అబ్బే కాదు...జపాను కళ్లు...ఇంకా చెప్పాలంటే, కోపంగా త్రాగినవాడి కళ్లలాగా..."

కోపాన్ని ఆపుచెయ్యటానికి యోషీదా ప్రయత్నం చెయ్యలా. "నీ హేళనకి నీ వంశాన్ని, నీ మామగారిని అందర్నీ నాశనం చేస్తా"

"చైనాలో మేమంతా చావుకు అలవాటు పడ్డాం. మృత్యువు ఎప్పుడూ వేళ్ల కొసలలో ఉంటుంది" డాక్టరు నెమ్మదిగా జవాబిచ్చాడు. "అందుకనే మాకు చావు అంటే భయం లేదు. కాని నీకు మాత్రం మంచి యిబ్బందే కలుగుతుంది. ప్రతినెలా రావలసి ఉంటుంది. నీ మొగానికి మందు వెయ్యాలి. లేకపోతే యిదివరకున్నా, నల్లగా తయారవుతుంది. ప్లేగు తగిలినవాడిలా నిన్ను అంతా చూస్తారు. యిక నీ జీవితం దుర్భరం."

"నా చేతిలోనుంచి బయటపడ్డావు" జనరలు అన్నాడు "నీ తప్పుల్ని క్షమిస్తున్నా"

"నేనూ నీకు అటువంటిదే యిద్దామనుకున్నా. నవ్వు మొగం ఉన్నా లేకపోయినా, నీలో దుర్మార్గం ప్రతిబింబిస్తూంటుంది. ఏమైనా నేను డాక్టర్ని. నేను చేసిన పని జయం పొందాలని కోరుకుంటా. ఎప్పుడూ శస్త్రవిధానంలో నాకు అపజయం అంటూలేదు. ఆ...యిక నాపనికి నువ్వుప్రతిఫలం యివ్వాల్సిన సమయం వచ్చింది."

"నీ కేం కావాలో కోరుకో"

"నాఫీజు అంత పెద్దదికాదు. నీ జేబులో ఏమన్నా కాగితాలు ఉంటే..."

"నీకోరిక నే నేం తీర్చలేను. దగ్గరున్నవి రహస్యపు కాగితాలు.ఎవ్వరూ చదవటానికి వీలు లేదు"

"నాకేం చదవాలని లేదు. నీకు యిష్టమయితే వాటిని తగలబెడుదాం"

ఈ దృశ్యానికంతా యిది వరకే రిహార్సలు జరిగినట్టుగా ఒక నౌకరు కొవ్వువత్తి వెలిగించి తీసుకువచ్చాడు.

"కాగితాలు ఇయ్యి" అన్నాడు డాక్టరు.

మాట్లాడకుండా యోషీదా యిచ్చేశాడు. డాక్టరు వాటికి నిప్పు అంటించాడు. చక్కగా తగులడిపోయాయ్. అంతా బూడిదయిపోయిన తర్వాత డాక్టరు బంగారంలాగా వాటిని ప్రోగుచేసుకున్నాడు. "ఇదే నాఫీజు. నాకు సంతోషంగా ఉంది"

"అది వట్టి బూడిద" అన్నాడు యోషీదా.

"నాకు మతి చెడిం దనుకో. పెద్ద మొత్తాన డబ్బు దుకాణంలో ఉంచటం. మీ సైనికులు యీ దేశంలో, తిరుగుతూన్నంతవరకు అసంభవం. బంగారాన్ని అంగీకరిస్తే ప్రాణానికే మోసం వస్తుంది. బూడిద తీసుకుంటే...ఏం భయంలేదు"

"కట్టు కథలు నా కేం రావు"

"సమయం వచ్చినపుడు నీకు దీని అర్థం తెలుస్తుందిలే. నువ్వు ప్రయాణమై వెళ్లవచ్చు. సీలయితే నెల దాటినతర్వాత మళ్లీయిక్కడికి రా..."

"తప్పకుండా వస్తా...నా అందమైన మొగం కాపాడుకోటానికి"

దుకాణాన్నుంచి బయలుదేరి యోషీదా అతిథికుండా వెళ్లిపోయాడు. స్నేహపూర్వకంగా, పిల్లలు అతను పోతూంటే చూసి నవ్వారు. అతని శరీరంలో అంతా దుర్మార్గమే ఉంది. కాని మొగంలో ప్రశాంతత, నిజాయితీ ఉన్నాయి. అందుకనే పిల్లలు భయపడి పారిపోలేదు. ఇక తన యిష్టం వచ్చిన చోటుకు భయంలేకుండా పోవచ్చు. అవసరమొస్తే మాట్లాడటానికి కొంచెం చైనా భాష కూడా వచ్చు.

ఆ పెద్దవీధినంట పోతూ పొడుగాటి పోస్టర్లను చూశాడు. కొంచెంగా అర్థం అవుతాయి. ప్రక్కనే పోతున్న వాళ్లల్లో చాలామంది అతని కంటె పొడుగ్గా ఉన్నారు. దుకాణాలలోంచి వాళ్లు, చైనావాడు జపాను యూనిఫారం వేసుకుని ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. దేశద్రోహులు చైనాలో చాలా తక్కువ. అటువంటప్పుడు వీడిని చూసి ఆశ్చర్యపోయారు. ఏమైనా చీకటిరాత్రులు చాలా ఉన్నాయ్. వీడి పని అంతమవటం ఏమంత కష్టం కాదు.

కొన్నాళ్లపాటు తన సైనికులతో ఉండి, తను లేనప్పుడు వచ్చిన ఉత్తరాలను వాటిని చూసుకుందా మనుకున్నాడు యోషీదా. తర్వాత ఒషీమాకు తన డ్యూటీ వప్పగించి, యాత్రలు చేద్దామనుకున్నాడు. సరస్సు పక్క పెద్ద హోటలును తమ హెడ్‌క్వార్టర్సుగా ఉపయోగించుకుంటున్నారు. తనవాళ్లంతా అక్కడ తనకు విందు చెయ్యవచ్చు. జపాను చక్రవర్తికి, తన పనులు తెలిస్తే పెద్దగా గౌరవించవచ్చు కూడా...

యోషీదా తన క్యాంపుకు దగ్గరగా రాగానే, జపాను సైనికుడు అటకాయించాడు. తన చైనా మొగముగురించి చెప్పేలోగానే,వెనకనే బాయనెట్ గ్రుచ్చాడు. మిగతా సైనికులంతా పరుగెత్తుకువచ్చారు. హేళన చేశారు. తను యోషీదానని, సుప్రీమ్‌కమాండరునని చెప్పుదామనుకున్నాడు కాని వాళ్లగోలలో తన మాటలు ఏమీ వినపడలేదు. మాట్లాడితే పొడుస్తున్నారు. వట్టి వెధవలు. ఏమీ వాళ్లకు అర్థంకాదు. బుషీడో వంశపువాడిని యింతగా, అవమానం చెయ్యటమా...ఈవిధంగా శత్రువులమీద బాయొనెట్ ప్రయోగించి, ప్రాక్టీసు చెయ్యమని చెప్పినట్టుగా, అతనికి జ్ఞాపకం వచ్చింది. కాని దానిని యివ్వాళ తనమీదే ప్రయోగిస్తున్నారు. వెధవలు అనుభవిస్తారులే. అందరినీ కట్టగట్టి సరస్సులోకి తోయిస్తా. చస్తూంటే ఒక్కడూ బయటికి లాగకుండా ఏడిపించాలి. ఒకవేళ బయటకు వస్తే మళ్ళీ లోపలికి నెట్టించటమే.

ఒషీమా రావటంచూసి యోషీదాకు తిరిగి ఆశ కల్గింది. కర్నల్ ఒషీమాకు మంచీ చెడ్డా తెలుసు. చైనాలో చదువుకున్నా చైనా వేదాంతంమాత్రం పట్టుబడల్దా. దయాస్వభావం ఉంది. శత్రువులంటేమాత్రం దయ లేదు. గెస్టాపో పద్ధతులలో ఆరితేరిన చెయ్యి. దుర్మార్గంలో జర్మను హిమ్లరును కూడా మించిపోతాడు. బుషీడోకు వ్యతిరేకమైనవాళ్లని జంతువుల్లాగా వేటాడాడు. తనంతట తాను పడ్డ యీ యిరకాటంలో తప్పకుండా ఒషీమా రక్షిస్తాడు.

ఒషీమాదగ్గరకు వచ్చినకొద్దీ, యోషీదా ఆశలు అడుగంటాయ్. చంపాలనే కోరిక

ఆంధ్రదేశంలో ఆహారవసతులు

(8-వ పేజీ తరువాయి)

అన్నిరకాల ఆహారపు పంటల గురించి వరుసన చూద్దాం :

పంట	తెలుగుజిల్లాలు ఎకరాలు	తమిళ జిల్లాలు ఎకరాలు	తె. జిల్లాల్లో హెచ్చు	తమిళజిల్లాల్లో హెచ్చు
(1) మొత్తం ఆహారధాన్యాలు	1,21,91,180	1,04,23,713	17,67,467	...
(2) వరి	43,58,959	50,84,822	......	7,25,863
(3) మిగతాధాన్యాలు	78,32,221	53,38,891	24,93,330	......
(4) అపరాలు (Pulses) మొత్తం	17,52,866	12,80,643	4,72,223	...
(5) పచ్చిమిర్చి, వగైరా	3,11,235	1,99,812	1,11,423	...
(6) పంచదార చెఱకు వగైరా	94,254	1,30,255	...	36,001
(7) మామిడి	1,52,505	47,601	1,04,904	...
(8) అరటి	16,748	61,877	...	45,129
(9) మొత్తం పళ్లు కూరగాయలు	2,59,028	2,44,775	14,253	...
(10) మొత్తం ఆహారపు పంటలు	1,46,19,146	1,22,93,818	23,25,328	...

(1943—'44లో)

ఇప్పటి మద్రాసురాష్ట్రపు నిర్మాణంబట్టి చూసినా ఆంధ్రదేశంలో ఆహారవసతి కూడా నాడులోకంటె ఎక్కువ అదునుగా ఉందని రుజువయింది. విస్తీర్ణం, జనాబాసమ్మర్దంబట్టి తమిళ తమిళనాడులోకంటె తెలుగుజిల్లాల్లో పరిస్థితే బాగుంది.

	విస్తీర్ణం చ॥ మై.	చ॥ మైలుకు జనాభా	కుటుంబానికి సగటున ఆహారపు పంటకింద వున్న భూమి ఎకరాలు	జనాభా (1941)
తెలుగు జిల్లాలు	67,025	280	3.6	1,87,84,304
తమిళ జిల్లాలు	49,306	509	2.4	2,51,04,565

వ్యవసాయంమీద అధికంగా ఆధారపడే దేశంలో చదరపుమైలుకు 250 మంది ఉండటం యుక్తం అని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అమెరికాలో చ॥మై॥కు 40.8 మంది, రష్యాలో 20.8 మంది, ఫ్రాన్సులో 197 గురు, ఇండియాలో 246 గురు ఉన్నారు. ఈ లెక్కన తెలుగు జిల్లాల్లో చ॥మై॥కు 30 మంది ఎక్కువఉంటె, తమిళనాడు జిల్లాల్లో చ॥మై॥కు 259 మంది ఎక్కువ ఉన్నారు. జిల్లాలవారీగా చూస్తే తెలుగుజిల్లాల్లోకంటె తమిళజిల్లాలలోని జన సమ్మర్దపు సమస్య ఎక్కువగా బోధపడుతుంది.

జిల్లా	చ॥ మైలుకు సగటు జనాభా
విశాఖ	422
తూ. గోదావరి	342
ప. గోదావరి	567
కృష్ణా	416
గుంటూరు	393
కర్నూలు	150
బళ్ళారి	184
అనంతపురం	174
కడప	178
నెల్లూరు	204
చిత్తూరు	274
చెంగల్పట్టు	593
ద. ఆర్కాటు	620
ఉ. ఆర్కాటు	552
సేలం	407
కోయంబత్తూరు	395
తిరుచునాపల్లి	507
తంజావూరు	686
మధుర	501
రామ్నాడు	408
తిన్నెవెలి	517
నీలగిరి	212
మలబారు	679
సౌత్-కనరా	377

తెలుగుజిల్లాలు మొత్తం 11. వీటిలో 6 జిల్లాల్లో చ॥ మైలుకు 250 మందికంటె ఎక్కువ ఉన్నారు. 5 జిల్లాలలో 250 మందికి తక్కువ ఉన్నారు.

తమిళజిల్లాలు, మద్రాసు మినహా, 11, 10 జిల్లాలలో చ॥ మై॥ కు 250 మందికంటె ఎక్కువ ఉన్నారు. ఒక్క నీలగిరి జిల్లాలో మటుకే తక్కువ ఉన్నారు. ఈ నీలగిరిజిల్లాను మినహాయిస్తే 395 మందికి తక్కువగా ఉన్న జిల్లాయే లేదు.

ఈ పరిశీలనవలన తేలే అంశాలు : తెలుగు జిల్లాల విస్తీర్ణం తమిళ జిల్లాలకంటె హెచ్చు. జనాభా తగ్గు. సమ్మర్దం తగ్గు. ఆహారపు పంటలు పండించే భూమి హెచ్చు.

	సగటున చ॥ మైలుకు ఆహారపుపంటలకింద ఉన్నభూమి ఎకరాలు	చదరపు మైలుకు సగటు జనాభా
తెలుగుజిల్లాలు	205.5	280
తమిళజిల్లాలు	244.5	509

మనిషికి ఎకరం అని లెక్కచూస్తే తెలుగు జిల్లాలో ప్రతి చ॥ మైలులో సగటున 74.5 ఎకరాలు ఎక్కువ సాగులోకి తేవటం అవసరమైతే తమిళనాడులో 264.5 ఎకరా లెక్కువ సాగులోకి తేవాలి. పసిపిల్లలను, వృద్ధులను మినహాయించి—వీరు యుక్తవయస్కులతో సమానులు కారు, భోజన విషయంలో—చూస్తే, 100 మంది జనాభా 75 మంది యుక్తవయస్కులతో సమానమని లెక్క. ఆలెక్కన తెలుగుజిల్లాల్లో చ॥ మై॥ కు 210 మంది ఉంటారు. అప్పుడు తరుగు 4.5 ఎకరాలు మట్టుకే. తమిళజిల్లాలలో చ॥ మై॥ కు 381 మంది ఉండి, తరుగు 136.5 ఎకరాలు ఉంటుంది.

రెండు ప్రాంతాలలో ధాన్యపు రాలుబడి కూడా చూద్దాం (1943-44 లో).

తమిళనాడు 11 జిల్లాలలో—మద్రాసుకాక, నీలగిరిజిల్లాను మినహాయిస్తే మిగతా 10 జిల్లాలలో 8 జిల్లాలలో ఎకరానికి 1500, పౌన్లు, అంతకంటె ఎక్కువ పండుతయ్. మిగతా రెండు జిల్లాలలో అంతకంటె తక్కువ రాలుబడి. నీలగిరి జిల్లాలో రాలుబడి తెలియదు.

తెలుగుజిల్లాలు 11 లో, 7 జిల్లాలలో ఎకరానికి 1500 పౌన్లు, అంతకంటె ఎక్కువ పండుతయ్. మిగతా 4 జిల్లాలలో అంతకంటె తక్కువ రాలుబడి.

భారతదేశంలో మొత్తంమీద ఎకరానికి బియ్యపు (Cleaned Rice) రాలుబడి 794 పౌన్లు.

రాష్ట్రం	ఎకరానికి రాలుబడి పౌన్లు.
అస్సాం	921
బెంగాలు (పశ్చిమ)	993
బీహారు	669
బొంబాయి	946
మధ్యరాష్ట్రాలు, బీరారు	697
ఒరిస్సా	591
సంయుక్తరాష్ట్రాలు	591
మద్రాసు	1011
కూర్గు	1170

దేశం మొత్తం అన్ని రాష్ట్రాలలోకంటె మద్రాసురాష్ట్రంలో రాలుబడి హెచ్చు. ఇదే ఆంధ్రదేశానికి, తమిళనాడుకూ వర్తిస్తుంది.

దేశం మొత్తంలో ఎక్కువ రాలుబడి మద్రాసు రాష్ట్రంలోనే ఉన్నా, ప్రపంచంలో మిగతా దేశాలలో రాలుబడికంటె చాలా తక్కువ.

దేశం	ఎకరానికి పౌన్లు
ఈజిప్టు	1455
ఇటలీ	2447
జపాను (1945-46)	2030
అమెరికా	1294
చైనా (46-47)	1549
ఇండియా	847
బర్మా	624
సయాం	906
స్పెయిన్	2517

(1943-44 లో)

ఇప్పుడున్న రాలుబడిని ఇంకా 50% వృద్ధి చెయ్యగలిగితే—అట్టే కష్టం కాదు — ఆహార పరిస్థితి ఇంకా సవ్యంగా ఉంటుంది.

దేశంలోని ఇతర రాష్ట్రాలతో ఆంధ్రదేశాన్ని పోల్చి చూద్దాం.

రాష్ట్రం	జనాభా (మిలియన్లు)	ముఖ్యధాన్యాల కిందవున్న భూమి (1000ఎకరాలు)	మనిషికి సగటున ఎకరం
అస్సాం	10.20	3866	0.38
బీహారు	28.82	15136	0.52
బొంబాయి	20.85	17390	0.87
మధ్య రాష్ట్రాలు	16.82	15061	0.88
ఆంధ్రదేశం	18.78	11465	0.60
తమిళనాడు	25.10	10361	0.41
ఒరిస్సా	8.72	5330	0.66
సంయుక్త రాష్ట్రాలు	55.02	30875	0.56

మిగతా రాష్ట్రాలలో చాలా వాటిలోకంటె ఆంధ్రదేశంలో మనిషికి సగటుభూమి ఎక్కువ.

కాబట్టి మద్రాసురాష్ట్రంలోని తమిళనాడు ప్రాంతంతో పోల్చిచూసినా దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోల్చిచూసినా ఆంధ్రదేశంలో ఆహారవసతులు ఆ యా ప్రాంతాలలోకంటె అనుకూలంగా, స్వయంపోషకంగా ఉన్నాయని రుజువవుతోంది. ఇంకా ఎక్కువ భూమిని సాగులోకి తెచ్చి, ఇప్పటి రాలుబడిని ఇంకా పెంపు చేస్తే, ఆహారవసతులు లేని ఇతర ప్రాంతాలను కూడా త్వరలో ఆంధ్రదేశం పోషించగలదు. తుంగభద్ర, రామపాదసాగర్ ప్రయత్నాలు ఫలించాక, ప్రపంచంలో ఆహారపుపంటలదృష్ట్యా ఆంధ్రదేశం ముఖ్యదేశాలలో ఒకటి కాగలదు.

అతని కళ్లల్లో ప్రతిఫలిస్తోంది. ఇతర ఆఫీసర్లందరికంటె, చైనాలో ఒషీమా చాలా మందిని చంపాడు. ఈ ఊచకోత అతని ఆఫీసర్లు చాలామంది అనుమతించారు.

నవ్వుతూన్న చైనా మొగం కల్గిన యీ వ్యక్తిదగ్గరకు వచ్చాడు ఒషీమా. జపాను జనరలు యూనిఫారం వేసుకోవటానికి వీడికి ఎంత ధైర్యం ఉంది? బుసాడోకు జరిగిన యీ అవమానానికి ప్రతీకారం జరుగాల్సిందే...

పక్కసైనికుడి చేతిలోనుంచి తుపాకీని ఒషీమా లాగుకోవటంతోనే, యోషీదా ఒక్కసారిగా భావురుమన్నాడు.

ఒక్క గట్టి పోటు. యోషీదా హృదయం చీలిపోయింది. ఒషీమా చిన్నగా నవ్వాడు. ఎప్పుడూ తనకు గురితప్పటం అంటూ లేదు. ఒక్కదెబ్బకే, తా. ఈ ఖైదీని ముక్కలుముక్కలుగా కోసి బాధపెట్టలేదు. అలా చేస్తే జపాను సైనికులకు హాయిగా ఉండేది.

ఆ రోజల్లా పడినచోటనే యోషీదా శవం ఉంది. చాలా అదృష్టవంతుడు. చైనా మొగం మీద గీతలు కూడా పడలేదు. డాక్టరు ఫంగ్ కాన్ ఆపరేషను దిగ్విజయంగా జరిగింది.

గ్రంథపరిచయం

కాంగ్రెసు కథలు

రచయిత : దండిపల్లి వెంకట సుబ్బశాస్త్రి, నవభారత పబ్లిషర్స్ లిమిటెడ్, కర్నూలు. వెల రూ. 1-0-0.

కాంగ్రెసు ఉద్యమాలలో, కథల కేమి, నవలలకేమి కొన్ని శతాబ్దాలకు చాలినంత కథావస్తువు ఈ అర్ధశతాబ్దపు భారతీయ చరిత్రలో సంభవించింది. కాని ఆ జీవితఘట్టాలు మరీ అంత సన్నిహితమై పోవటంవల్లనో ఏమో ఎక్కువగా రచయితలు అటు దృష్టి సారించలేదు. ఈ కథల సంపుటిలో, భారతకాంగ్రెసు చరిత్రలో జరిగిన ఉజ్జ్వలఘట్టాలను కళా దృష్టిలో ప్రదర్శించటానికి ప్రయత్నం జరిగింది. కొంత చరిత్ర చిత్రణానికి ఆఘాతం కల్గించకూడదను యథార్థ దృష్టికూడా తోడ్పడింది.

ఈ కథల సంపుటిలో 'అమ్మ', 'దేశం కోసం,' 'బాబూగనో్న', 'బలిదానం' అన్న నాలుగు కథ లున్నాయి. అమ్మ అనే కథలో సర్దార్ పటేలు అమ్మనుగురించి జనపథంలో వింటూవచ్చిన విషయాలు కథావస్తువుగా స్వీకరింపబడ్డాయి. 1932 సత్యాగ్రహ సమరంలో బొంబాయిలో, ధైర్యంగా లారీ కెదురునిలచి, దురంతంగా మీదినుంచిపోయిన లారీ క్రిందబడి మాతృదేశానికై ప్రాణాలు వీడిన 'గనో్న' యథార్థయువకుడు. ఆ గనో్న పెంపులో గల మానస ప్రవృత్తిని కథలో రచయిత చిత్రించారు. 'దేశంకోసం', 'బలిదానం' కథలు కల్పితంగా కనుపిస్తూ ఉన్నా, అల్లాంటి యథార్థ ఘట్టాలు అనేకం దేశంలో జరిగిఉండటం వల్ల కథలకు వాస్తవిక రమ్యత ఉంది.

రచయిత ఈ మాదిరి కథలను ఇంకా సంపుటాలుగా తెద్దామనుకొన్న ప్రయత్నము, శ్లాఘనీయమే. వాస్తవికతకు భంగం రానియ్యక్కరలేకుండా, నేటి స్వతంత్రంతో భారతీయుల కవగాహనమయి ఉన్న వాద ప్రతివాదాలు, అనవసర భావాలంకారాలు కథనంలోని దార్ఢ్యతను తగ్గించనీయకుండా, కథలలో కళాపోషణ చేసుకొంటూ వస్తే, ఈ కథలు తప్పకుండా సారస్వతంలో స్థానం ఆక్రమించుకొనే ఆస్కారం ఉంది.

అమరజీవి గాంధీజీ

పద్యకావ్యము. రచయిత: శ్రీ రత్నాకరం వెంకటేశ్వరులు, ధర్మవరం. వెల రూ. 1-4-0.

"గాంధీజీ" అన్న మకుటంతో, ఆయనపై భక్తితో వ్రాసిన నూటపదారు వృత్తాల సంపుటి. దాశరథీశతకము, కాళహస్తీశ్వర శతకం మొదలైనవాటిని వదిలేస్తే, తక్కిన పూర్వపు భక్తి శతకాల వరవడిలోనే పద్యాలు నడిచాయి. రచయితకు గాంధీజీపైనున్న భక్తి కిది తార్కాణంగా ఉన్నది.

సమర్థ సంకీర్తనము

కర్త : భూతపురి నారాయణస్వామి. ఎఱ్ఱగుంట్ల, కడపజిల్లా. వెల 0-8-0.

"సమర్థా రామచంద్రప్రభో" అన్న మకుటంతో, నడిచిన వృత్తశతకము. పద్యాలన్నీ ఒకఫక్కిలో సులభంగా నడుస్తాయి.

నేతాజీ

(పదం) రచన : శ్రీ ప్రయాగ నరసింహ శాస్త్రి. 4, మునియప్పిళ్లై వీథి, మద్రాసు 2.

సుభాష్‌చంద్రబోసు వీర గాథను బుర్రకథగా రచించారు. బుఱ్ఱకథరచనలో రచయితకు పూర్వానుభవం ఉన్నదన్న విషయం ఈ పాటలో బాగా విదితమౌతుంది. నేతాజీ కథను భక్తిపురస్సరంగా పాడి ఉద్రేకం తెప్పించటానికి అనువైన చక్కని ఫణితిలో కవి ఈ కథను చిత్రించారు.

దేవీనవరాత్రాలు

(7 వ పేజీ తరువాయి)

లను పూజించే బదులు కేవలం స్త్రీని పూజిస్తారు.

బృహన్నందికేశ్వర పురాణంలోని దుర్గాపూజా పద్ధతిలో సర్వతోభద్రమన నవావరణాలలో 'గుండీ' ననుసరించి పూజాలంకరణం చేసి విశిష్టకేతనాలతో జలకలశాలు నిలిపి కోటి యోగినీ దేవతలను పూజించవలెనని ఉన్నది. కళాకర్మకు సంబంధించిన మయదీపికలో దేవీమూర్త్యంతరాల స్వరూప లక్షణాలు చిత్రితాలై ఉన్నవి. తంత్ర గ్రంథాలను బట్టి ఆదిశక్తికోటియోగినీరూపాలలో ఇవి ప్రధానాలుగా కనిపిస్తున్నవి. ఇందు కొన్ని సౌమ్యమూర్తులు, కొన్ని అసౌమ్యమూర్తులు. వికృత, విశ్వరూపిక, యమజిహ్వా, జయంతి, దుర్జయ, యమాంకిక, విరాళీ, ఖేతీ, విజయంతిక, దేవకి, యశోద, నంద, అంబ, సర్వమంగళ, కాళరాత్రి, లలిత, జ్యేష్ఠా, నీలజ్యేష్ఠా, భూతమాత, సురభి, యోగనిద్ర, శ్రీ, చాముండ, చండిక, నవదుర్గ, రౌద్ర, కాళీ, కలవికర్ణి, బలప్రమథినీ, మనోన్మనీ, కృష్ణా, ఉమా, పార్వతీ, మహాకాళీ, శివరాత్రీ, వారుణీ చాముండా, శివదూతీ, కాత్యాయనీ, కౌర్త్రాయనీ, అభయ, అంబిక, యోగేశ్వరీ, భైరవీ, రంభా, శివా, తుష్టీ, సిద్ధి, బుద్ధి, క్షమా, దీప్తి, రతి, శ్వేతా, వైష్ణవీ, ఐంద్రీ, యామ్యా, కౌమారీ, వారాహీ, బ్రాహ్మీ, సరస్వతీ, లక్ష్మీ, సావిత్రీ, సర్వగంధా, గంధేశ్వరి, శక్తి, ఆశా, బృహత్కుక్షీ, సర్వజ్ఞా, వామనీ, భయాతప, ఖగానన, తపనీ, క్రోధన, వమని, మహాక్రూర, లోలుప, హాహారవ, పిశితాశా, బడబాముఖి, పిశాచి, హుంకార, పిచువక్త్రి, విశాలాక్షీవిమల, చంద్రావళి, లాలస, చంద్రహాస, లక్ష్మీకేశ్వరి, వరద, లంకా, కాలకర్ణి, లోల, ప్రచండోగ్ర, లయ, మేఘనాద, లీలా, కరంగినీ, బాల, విషజిహ్వా, క్షయా, రక్తాక్షి, అక్షయ, తాలుజిహ్వక, పింగాక్షీ, సవరాక్షపణ, సనంగ్రహి, వృక్షకర్ణి, హయానన, తరళ, తార, అక్షోభ్య.

అంటే ప్రకృతిలోని ప్రతి శక్తినీ ఒక దేవతా రూపంలో ప్రాచీనులు నిరూపించారని ఈ అనంతకోటి దేవతా స్వభావాదులను పట్టి తెలుస్తున్నది. ఆసేతుశీతాచలపర్యంతం విశాలమైన భారతదేశంలో ఉన్న దేవాలయాలలో ఈ దేవతారూపాలు శిల్పాకృతి ధరించినవి. నేడు శిల్పాచార్యుల మని చెప్పుకునే అనేకమంది విజ్ఞులకు కూడా అవగతం కానన్ని దేవతామూర్తులున్నవి. తంత్రగ్రంథాలను పరిశీలించి ఈ శిల్పమూర్తుల స్వరూపాదికాలను తెలుసుకో వలసిన విజ్ఞానం విశేషంగా కనిపిస్తున్నది.

ఈ దేవతామూర్తులలో విలక్షణ రూపాలు కలిగిన వాటిని గురించి కొలదిగా ప్రసంగించిన తరువాత మహిషాసురమర్దని, దుర్గ, కాళీలకు రూపకల్పనావశ్యకతనూ, భావనా వైచిత్రినీ నిరూపించుట సమంజసము. వికృత ఉష్ట్రవాహన. భయకృతి. మస్తకము మీద శవశకలం ఉంటుంది. 'ముసలం ముద్గరం యావై పరశుం బంధనం తథా, బిభ్రతి యమజిహ్వా స్యాత్ కరాళా మహిషస్థి' అనేది యమజహ్వా స్వరూపము. బిడాలీ దేవత రూపము చిత్రాతి చిత్రమైనది. 'శకటస్థా తిఘోరాస్యా క్షీరవర్ణా యమాంతికా, మార్జారస్థ బిడాలీచ విశాలాక్షీ భవేత్ సితా' అని ఆమెస్వరూప నిరూపణము. విజయాంతిక దుర్గాపూజలో ఉపవిగ్రహమైన విజయ. అంబను తైత్తిరీయ సంహిత 'ఏష తే రుద్ర భాగః; సహస్వస్రాంబికయా తం జుషస్వ' అని రుద్రునికి భగినిగా చెప్పుచున్నది. సర్వమంగళ జగద్ధాత్రు లిరువురు నేకరూపలు. కాళరాత్రి స్వరూప ఐన మహామాయను ధ్యానించినాడట. జ్యేష్ఠా, నీలజ్యేష్ఠ లిద్దరూ లక్ష్మితోబుట్టువులు. 'తురంగనాసాచ లంబోష్ఠీ లంబమానస్తనోదరీ, అలోహితా స్మృతా హ్యేషా జ్యేష్ఠాలక్ష్మీ రితిశ్రియే'—అని జ్యేష్ఠా లక్షణము. విమల వ్యాఘ్రయాన, చేతియందు కర్తరికలది. త్రినేత్ర. హుతాశనఅగ్నిలోని స్త్రీశక్తి. విశాలాక్షి సుందరి. హుంకార మానవక్త్రి మానగ. బడబాముఖి బడబాగ్ని స్త్రీమూర్తి, 'దగ్ధ్వాభయభృలోస్యే దండకపాలినీ, కృష్ణ

హాహారవా క్రూరా రాసభస్యా ఖరస్థితా' ఇది హాహారవ రూపము. వంగదేశంలో దుర్గాదేవిని చండికగా భావిస్తారు. దుర్గాపూజ కేర్పరచిన సలాన్ని 'చండీతల' మంటారు. పూజను చండీపూజ అంటారు. యోగేశ్వరిని వంగదేశములోని కొన్ని ప్రదేశాలలో మాత్రమే పూజిస్తారు. కరంకిని క్రోధసుత. ఇదేరీతిగా మిగిలిన దేవతామూర్తులును కొన్ని సాత్వికములు, కొన్ని రాజసికములు, కొన్ని తామసికములు.

ఈ సమస్తదేవతాస్వరూపాలకు మూలము ఆదిశక్తి. ఆమె ప్రథమంలో మహిషాసురుణ్ణి సంహరించటానికి అవతరించింది. రాక్షసమాత దితి కుమారుల అపజయానికి చింతించి మహిషీరూపంతో బ్రహ్మను గూర్చి తపస్సుచేసి మాయావి శూరుడైన మహిషాసురుని కన్నదట. వాడు దేవతలకు దుర్నిత్యుడై బాధలుపెట్టు సమయంలో దేవతలందరూ విష్ణుదేవుని చేరకుంటే వారి ఆలోచనా సమయంలో వారి శరీరాలనుంచి తేజోరూపాన వారి అంశాలు బయలుదేరి సుందరాకార, ఆభరణభూషిత, అత్యుజ్వలఅయిన మహాదేవి అవతరించింది. ఆమె అష్టాదశభుజ. బ్రహ్మాదిదేవతలు వారివారి ఆయుధాలను ఆమె కిచ్చారు. ఇంతలో మహిషాసురునికి రాత్రి కల ఒకటి వచ్చి అందులో దేవి తన్ను సంహరిస్తున్నట్లు తెలిసికొని నిరంతరమూ 'నా శరీరము నీ పాదాలను అంటిఉండేటట్లు ప్రసాదింపమని కోరగా' ఆతణ్ణి మహాదేవి ఉగ్రచండ, మహాకాళి, దుర్గ—అనే మూడు మూర్తులతో రూపుమాపి మహిషాసురమర్దని ఐంది.

పూర్వం తపశ్శక్తితో ముల్లోకాలనూ జయించిన రురునికుమారుడగు దుర్గుని శక్తికి తాళలేక దేవతలు శివుని శరణుచొచ్చారట. శివుని దుర్గుని సంహరించటానికి (శాంభవీశక్తిని) మహాదేవిని కోరగా ఆమె కాళరాత్రిని పంపించినది. కాళరాత్రి హుంకారాగ్ని మూలాన అతని సైన్యాన్ని నాశనంచేసింది. దుర్గుడు కాళరాత్రితో పోరాడుతూ వింధ్యాద్రివరకూ వచ్చి దేవిని చూచి మోహించి భార్యగా కోరాడు. ఆమె క్రూరదృష్టితో అతని సేవకులు చెండాడిన తరువాత దుర్గుడు గజరూపాన్ని ధరించిపోరాడగా ఆ గజాన్ని ఖండించిన తరువాత మహిషరూపాన్ని పొంది దుర్గుడు పోరాడాడు. దేవి త్రిశూలంతో అతణ్ణి పొడిచి సహస్రబాహువులతో ప్రత్యక్షమైన అతణ్ణి జంపి 'దుర్గా' నామాన్ని వహించింది.

కాళీతంత్రంలో మహాకాళిరూపాన్ని ఇలా నిరూపించారు: 'అతి భయంకర. కరాళదంష్ట్రి, చతుర్భుజ, ఒకచేతకపాలము, ఒకచేత ఖడ్గము—ఒకటి, వరదహస్తము. ఒకటి అభయహస్తము. శివశక్తి. దిగంబర. కరాళజిహ్వా. కాలాధిదేవత— మహాకాలునికి స్త్రీమూర్తి. జగత్తు కాలంలో లయ మొందినప్పుడు సమస్తమూ శివము కాని శవము. జగన్నాశనము చేసిన ఏకైక వీరగా ఆమె భయంకర స్వరూపంతో నిలుస్తుంది. వికటాట్టహాసము, విజయఘోరహాసము. నాలుగు హస్తాలు కాలంలో లయం పొందే నాలుగు దిశలు. ఖడ్గము వినాశ సాధనము. తెగిన తల విజయచిహ్నము. అమృతత్వంలో ఆనంద మున్నది. వరదహస్తము కాలాధిదేవతయైన ఆమె కున్న దానయోగ్యతా నిరూపణ లక్షణము. నగ్నత్వము సత్యము మాయావరణరహితమైన దని నిరూపించు గుణము. చితి జగచ్చితి. కాలాధిదేవతఐన ఆమె కాలకర్ణ, అంటే జగత్తులోని సమస్త రూపాలూ, వర్ణాలూ లయ మొంది కాలరాత్రి స్వరూపయైన ఆమెలో లయం పొందుత వని అభిప్రాయాన్ని మహాకాళీ రూపకల్పన నిరూపిస్తున్నది.

దుర్గాదేవి విగ్రహరూపానికి కూడా ఇటువంటి అర్థాన్ని ప్రతిపాదించి పూర్వులు నిరూపించారు. దుర్గ పరబ్రహ్మము. త్రిశూలము జ్ఞానము. ఆమె వాహనమైన సింహము మహిషాసురాదులు కామక్రోధాదులు. త్రినేత్రాలు త్రికాలాలు. లక్ష్మీసరస్వతులూ, వినాయక కార్తికేయులూ చతుర్విధపురుషార్థాలట. అందువల్ల దేవీపూజవల్ల సాధకుడు పురుషార్థసాధన మూలాన జ్ఞానాన్ని సంపాదించుకొని కామక్రోధాదులను ధ్వంసం చేసి త్రిపురనాశకుడు, సర్వవ్యాపి అయిన పరమాత్మను తెలుసుకొంటాడు అని దుర్గాపూజ అంతరార్థము.

[శరన్నవరాత్రి పూజావిధానాన్ని గురించీ, దేవీ స్వరూపాన్నిగురించీ విశేషంగా తెలుసుకోటానికి భారతి—రక్తాక్షి ఆశ్వయుజమాసము సంచికలోని 'శరన్నవరాత్రాలూ', భారతి—ఆంగీరస ఆశ్వయుజమాస సంచికలోని 'నవరాత్రి పూజా', గృహలక్ష్మి—ఆంగీరస సంచికలోని 'దసరాఉత్సవము'లను చూడ గోరుతాను. దేవీకథాదికాలంనుగురించి శ్రీ మాధవరామశర్మ శ్రీ దేవీకథలు ఆంధ్రభాషలో విశేష పరిచయం కలిగించగల పుస్తకాలు.]

మహాపద్మనందుడు

(10 వ పేజీ తరువాయి)

వాండ్లకూ, అంటే వాండ్లతో గలసనివాండ్లకూ, వాండ్లకూ ఆదొక పెద్ద సంగ్రామకారణమైంది. దాన్లో మనవాండ్లే గెల్చి వాండ్లను వెళ్లగొట్టారు. న 'వ్వెందు కొస్తుం దన్నా' మంటే—వాండ్లన్న మాటలు మన మిప్పు డంగీకరించేవేకా: మాకాలంలో భగవంతుడి విషయ మిద్దరికీ సమానమైనా త్రొగుడు మనం వద్దన్నాం. వాండ్లకది లేందే జరగదు కాబట్టి వారది పనికొస్తుం దనుకుంటున్నారు. ఇట్లా వుంటాయ్ తగాదాలన్నీ. నిదానంగా గూర్చుని విచారిస్తే సామరస్యం కుదర్ని తగాదా లోకంలో నుండదు! సరే, ఆనాడు వాండ్లు పోయి పారసీకదేశా న్నాక్రమించుకుని చుట్టుప్రక్కల నొకటో, రెండో దేశాల్నాకూడా ఆక్రమించుకుని కాలక్షేపం చేస్తున్నారు. అట్లా నుండగా, కొంతకాలానికి వారి రాజకుటుంబంలో సింహాసనం 'నాదీ, నాదీ' అని పోరాటం వచ్చి, జరిగిన యుద్ధంలో నిద్దరు రాజ్యార్హులూ మరణించారు. అప్పుడు వారి పెద్దలు విచారించి "మనమంతా మొదట భారతీయులమే; మన కొచ్చిన యొద్దడి తీర్చుకోడాని కిప్పుడా దేశం బోయి, దాన్ని పాలించే రాజకుటుంబా న్నాశ్రయిస్తే మన కొక్క ప్రభువు నియ్యకపోతారా"అని వచ్చి అప్పుడు రాజ్యమేల్తున్న కురురాజు నాశ్రయించగా, ఆయన తన చిన్న కుమారుణ్ణి వారి కిచ్చాడు. అతడే వాండ్లు మహాకైరస్—కురుశబ్దం నోటబట్టలేక యేర్పడ్డ పేరు—అనే మహనీయుడు. ఆయన ప్రాక్పశ్చిమాలు జయించి, ఆక్రమించుకొని ఒక మహాసామ్రాజ్యాన్ని స్థాపించారు. వారి అనంతరం వారు మన మాదేశాన్నుంచి వచ్చామన్న కృతజ్ఞత కూడా లాకుండా—అది స్థానబలమాహాత్మ్యం—మన దేశాన్ని జయించి యేలుకోవాలన్న ఆశను సూచించి దానికి తగ్గ పటాటోపం జేసారు. అట్లాటిదా న్నొకదా న్నాపడానికే, మేం గోదావరీతీరాన జేస్తున్న వందేరుమకాంనుండి తిరిగొచ్చి వార్ని సమీపించగానే మా రాణుకపటిమ చూచీ దండయాత్రను దించుకొని నిజరాజ్యమార్గాన్ని పట్టారు.

నే : అట్లాగాండీ? చివరకు, వచ్చి సింధుదేశాన్నీ, సప్తసైంధవాన్నీ ఆక్రమించుకున్నారటగా?

మ : అనే విన్నాం తర్వాత. అయినా, మన కా దేశా లెందుకోయ్? అక్కడివాండ్లొకప్పుడార్యులైనా విదేశసంపర్కంతో చెడిపోయ్యారోయ్? పయిగా హిమవత్పర్వతశాఖల శిఖరాలానుకున్న ఆ పారసీకపీఠభూమినుంచి నీళ్లను క్రిందికి దిమ్మరించినట్లు సైన్యాల్ని నడిపించ వీలున్న ఆ సరిహద్దును మన మెందు కొయ్యాలోయ్! సింధునదికి తూర్పున నున్న షుమారు మూడువందలమైళ్లి వెడల్పు, నాలుగువందల మైళ్లి పొడుగూ వున్న యెడారుండగా, దాన్ని దాలొచ్చినా: దుర్గమమైన పారియాత్రపర్వతపంక్తి (ఆరవల్లికొండలు) హస్తినాపురంవరకూ నుండగా ఈ సైసర్గికబలానుభూతమైన సరిహద్దున్నమ్మకొక అట్లాటి సరిహద్దెందుకోయ్ మనకు పడమర? ఇక హస్తినాపురాని కుత్తరాన హిమవంతం దాకా నున్న బయలన్నావ్, అదొక వంద మైళ్లలోపుది. దాన్ని రక్షించుకోవడం తేలికా, మేం మొదట చెప్పిన పీఠభూమిని రక్షించుకోవడం తేలికా? ఈమాట లనుకుంటూ "కావలిస్తే ఆ దేశాలు వాండ్ల కిచ్చి, పారియాత్రపు సరిహద్దు నేర్పరచుకుందా"మని మేము, మంత్రివరుడూ తిరిగి వచ్చేటప్పటికి వాండ్లు పారిపోయిరి!

నే : ఆహా, తమ రణనీతి మహాఆపూర్వంగా వుంద ప్రభూ!

మ : ఉందికాని, ఇంకా నీ కేం శంకలున్నాయ్, వాటన్నిటినీ తీర్చుకోడాని కింకా గడువు పడ్తుంది? మేం వేసరాజులుంగారి వేదాధ్యయనాని కెళ్లాలి.

నే : తమరూ ఆ వేద మధ్యాపనజేస్తున్నారా?

మ : తమరూ చేస్తున్నారా! నీవుమటుకు చేయవుటయ్యా. నిన్నక్కడికి రానియ్యాలి గానీ?

నే : అక్కడికి అంటూ, కెక్కడికండీ?

మ : అమరావతిబైట నందనవనానికి దూరంగా నొక దిబ్బుంది. అది పూర్వ మొక అమరావతున్న చోటట. దానిమీద కొన్ని పటకుటీరా లేసి మమ్మల్ని వాట్లో నుంచారు—అక్కడికి!

నే : అంటే తమ రమరావతిలో నుండరూ?

మ : అమరావతిలోనే! మమ్మ ల్నక్కడికి చూద్దామన్నా రానిస్తారు కూడానా?

నే : మమ్మల్నంటే?

మ : అంటే మావంటివాండ్లను. భూలోకంలో ఆర్యసాంప్రదాయాన్ని వదలి గడుసుపోకళ్లు పోయిన మావంటివాండ్లను. అంటే, వేనుడు, మాబోంట్లైన ఆర్య ప్రభువుల్ను, అన్యదేశీయప్రభువుల్నా!

నే : అయితే, తెలీ కడుగుతా, రావణాసురాది రాక్షస ప్రభువు లెక్కడండీ?

మ : మా క్కొంచె ముత్తరంగా వాండ్ల కుటీరా లున్నాయ్. అట్లా టునికి అవమానంగా వుందని మేమంతా మమ్మల్ని రోజూ చూడొచ్చే నారదమహామునితో మొత్తుకుంటే, ఆయన మొన్న తాను ఇంద్రుడితో చెప్పాననీ, ఆయన చిరునవ్వు నవ్వి, త్వరలో తగ్గ యేర్పాట్లు చేస్తామనీ అన్నా రని చెప్పారు. ఎం మాత్రం జరుగుతుందో, నారదుడు మాయలాళ్ల తాత! త

నే : తమ రున్న చోటు పూర్వ మొక అమరావ తున్నచో టన్నా రేమిటండీ?

మ : (లేస్తూ) ఏమిటోయ్, నీవు పోకిరిలాగున్నావ్! అమరావతి నెందరో రాక్షసు లెన్నిసార్లో ఆక్రమించుకున్నారని యెరగవ్? వాండ్లు ఉన్న నగరాన్ని భస్మీపటలం జేసిపోతే ఆ దిబ్బ లేర్పడ్డాయి. వాండ్ల బాధను విష్ణుమూర్తి తీర్చగానే దేవత లొచ్చి, మళ్లీ నగరనిర్మాణం జేసుకున్నారు. ఇక వెళ్తాం.

నే : చిత్తం. ఈ చిన్న ప్రశ్నకు సమాధానం దయచేసి వెళ్లండి. తమ మత మేదండీ?

మ : అరి, దుర్మార్గబ్రాహ్మడా! ఆర్యమతమే? మేం శివపూజాధురంధర్లం. ఆ మతం తీవ్రించడాని కనువైందని దాన్నవలంబించాం; సరేనా.

నే : చిత్తం. క్షమిచ్చా!

మ : దాని కేమోయ్! ఏదో పనుందిగాని, నీవు వేసే ముగ్గుల కెంతకాలమన్నా పుణిడి పలకాల్నపిస్తుంది. కావలిస్తే, మళ్లీ పిలు, వస్తాం. ఈసారన్నా నేరుగా పిలు: మైథిలీదేవి క్షత్రియకాంతే; ఫరవాలేదులే.

(నిష్క్రమణ)

నే: ఈయన కెంత కులపట్టుదల! మంగలాడికి పుట్టామన్న మాట నమ్మియా బ్రాహ్మడు, మనల్ని స్వయంగా పిలవకుండా వేను ణ్ణడ్డంపెట్టుకు పిల్చాడన్నది యెంత పొడుచుకొచ్చిం దీయనకు! (నిష్క్రి)

ఇండియా ఎదుర్కోవలసిన జనాభాసమస్య

శ్రీ నందకుమార్‌రాయ్

సందేహం లేదు. నలభైకోట్ల జనాభాకి ఆహారం ఏర్పాటుచేయడం సామాన్యం కాదు. నలభైకోట్లు! ప్రతి క్షణమూ పెరుగుతున్న జనాభా. ఇండియా-పాకిస్తాన్ ఉభయులు కూడ ఈ సమస్యని పరిష్కరించుకోవాలి. సమస్య అతిక్లిష్టమైన దవటంచేత మనలో చాల మంది భయపడి ఆ సమస్యాపరిష్కారం వాయిదావేసి భారంతప్పించుకోందామని ప్రయత్నిస్తారు. కాని, నిజానికి యీ సమస్య అంత క్లిష్టమైనదా? పరిష్కారం పైకి కనిపించినంత దుష్కరమా?

ఇండియాని గురించి చాలా దురభిప్రాయాలున్నాయి. చాల దురభిప్రాయాలు భారతీయులకే వున్నాయి! ఈ దురభిప్రాయాల్లో ఒకటి ఏమంటే, ఈ దేశంలో పెరుగదల మిగతా దేశాలలో కంటె చాల ఎక్కువగావుంది అనుకోడం. ఇది నిజముగాదు. 1872-1941 వ సంవత్సరాల మధ్య - డెబ్బయి సంవత్సరాల పైకాలములో - ఇండియా, పాకిస్తాన్‌ల జనసంఖ్య నూటికి యాభైనాలుగు పాళ్లు పెరిగింది. అదే సమయంలో గ్రేట్‌బ్రిటన్‌లో జనాభా కూడ నూటికి యాభైనాలుగుపాళ్లు పెరిగింది. 1821 - సంవత్సరాల మధ్య - డెభ్బయి యేళ్ల కాలం - 1891 జనాభా నూటికి ఎనభై ఒక్క పాళ్లు పెరిగింది. 1873-1942 సంవత్సరాల మధ్య జపాను జనాభా నూటికి నూటముప్పయి ఆరుపాళ్లు పెరిగింది. 1931-1941 వ సం॥ల మధ్య మన దేశములో నూటికి పదిహేను పాళ్లు పెరిగితే 1920-1930 ల మధ్య పదేళ్లలోను అమెరికాలో జనాబా నూటికి 16 వంతులు పెరిగింది.

మరొక దురభిప్రాయము: ఇండియాలో జనాభా వ్యాప్తి చాలదట్టం అనుకోడం. 1941 వ సం॥లో ఇండియాలో—అంటే ఇప్పటి పాకిస్తాన్ ప్రదేశంతో సహా—సగటున చదరపు మైలుకి 246 గురు జనులు నివసించేవారు. జావాలో 50,000 చదరపు మైళ్లలోను నాలుగు కోట్ల పదిలక్షల జనాభా వుండడం వల్ల చదరపు మైలుకి సగటున 300 మంది జనులు నివసిస్తున్నారు. ఇంగ్లాండు, వేల్సులోగూడ ఇదే సగటు జనాబా. హాలెండులో సగటు చదరపు మైలుకి 650 మంది వుంటున్నారు. జర్మనీ, జపాను, ఇటలీ అన్ని దేశాల్లో కూడ జనాభా ఇండియాకంటె దట్టంగానేవుంది. వీటిలో కొన్ని దేశాలు పారిశ్రామిక దేశాలు; కొన్ని దేశాలు వ్యవసాయ ప్రధానాలు జపానులో సాగుబడికి పనికి వచ్చే భూమి సమృద్ధిగాను లేదు. సముద్రం నుంచి, భూమినుంచి, అతి కృషి చేసి, సంపద కొల్లగొట్టుకోవాలి.

ఇండియా మనుష్యసంతతి నిజంగా దేశ సంపదలలో ముఖ్యమైన సంపద. దేశసౌభాగ్యవంతమై, ప్రపంచదేశాలలో, బలమైన దేశంగా పరిణమించడానికి, ఈ మనుష్యసంపద ఉపయోగించవలసిందిగాని, ఈ సంపదని మనదేశం తిన్నగా పోషించుకోలేదు, ఇండియాలోని ప్రజలు అర్ధాకలితో బ్రతికేవారు, విద్యావిహీనులు అనారోగ్యవంతులు అవడంవల్ల వారి కృషి తగినంత ఫలించదు. ప్రజలు చేతకాని ప్రజలయినారు. కృషివంతు తగినంత లేనందువల్ల ఉత్పత్తి తక్కువ. దానివల్ల ముందు సంతతికి తిండి తక్కువ. దానిమూలంగా మరింత అర్ధాకలితో బ్రతకవలసిరావడం—ఈవిధంగా యీ చెడుపు పెరుగుతూపోతుంది. ఈ చెడుగుని అరికట్టాలి. తగిన కృషిచేస్తే అరికట్టగలము. ఇతర దేశాల సహాయం అర్థించకుండానే, మనదేశంలోనే, ఎక్కువ ఉత్పత్తి చెయ్యగలము. ప్రజల జీవిత పరిస్థితులు అభివృద్ధిచెయ్యగలము. అంతే కాదు. జనాభా 10 మరి కోట్లు పెరిగినా ఇప్పుడు అభివృద్ధిని గూస్తే మరో ఇరవైయేసంవత్సరాల్లో జనాభా అంత పెరగకపోవదు. జీవిత పరిస్థితిలో క్షీణత లేకుండా కాపాడుకోవచ్చును. ఇండియాలో, బెంగాలులోనే జనాభా చాల ఎక్కువ. అయితే బెంగాలులో సేద్యానికి పనికివచ్చే భూమిలో నూటికి అరవైయేడో భాగంమాత్రం సాగుబడి అవుతున్నట్లు 1931 వ సెంసస్సు (Census) లో తేలింది ఉపయుక్తమైన భూమిఅంతా వుపయోగించుకుంటూ ఆధునిక పద్ధతుల మీద వ్యవసాయము సాగించటం వల్ల నూటికి ముప్పయివంతులు ఫలితం వృద్ధిచేసుకుంటే, రాష్ట్రంలో అప్పటి జీవనపరిస్థితిమీద అప్పటి జనాభాకి రెండురెట్ల జనాభాని పోషించుకోవచ్చునని మీద చెప్పిన సెన్సస్సులో తెలియవచ్చినది. బెంగాలు జనాభా అప్పుడు అయిదుకోట్లు. అంటే దేశంలో మిగతా భాగాల్లోకూడ భూమిఅంతా సాగుబడిలోకి తీసుకొస్తే, వ్యవసాయపద్ధతులు అభివృద్ధిచేసుకుంటే రెండురెట్ల జనాభాని, ఇక్కటికంటే చక్కగా పోషించుకోవచ్చునన్న మాట.

ఇప్పటి మన లోటుపాట్లన్నీ సవరించుకొని మనజీవిత పరిస్థితులుఅభివృద్ధిచేసుకోవడమేకాక, జనాభా పెరుగుదలకి ఏర్పాటు చేసుకోవాలంటే ఏది మార్గం? సత్యమార్గంలో మొదటిఅడుగు, ఆధునిక వ్యవసాయపద్ధతుల అవలంబన. మన దేశంలో ఎకరానికి 18 భుషెల్లు గోధుమలు పండిస్తాము. జపానులో, సామాన్యంగా ఎకరానికి 225, ఈజిప్టులో 24, ఇంగ్లాండులో 31, డెన్మార్కులో 39 బుషెల్లు పండిస్తారు. మన దేశంలో ఎకరానికి వేలుపౌండ్లు ధాన్యమైనా పండదు. జపానులో ఎకరానికి, 2,500, ఇటలీలో 2,000, ఈజిప్టులో 1,500 పౌన్లు ధాన్యం పండుతుంది. కొన్ని సంవత్సరాలకు ముందు, సర్ ఎస్. విశ్వేశ్వరయ్యగారు వ్రాస్తూ, జపానులో ఎకరపు పంట విలువ, సగటున, సాలుకి, 150 రూపాయలవుతే, మన దేశంలో పాతికరూపాయలని అంచనావేశారు.

వ్యవసాయంలో యంత్రసాధనాలు ఉపయోగించడం విషయం అటుంచి, భూమికి శక్తియిచ్చడం విషయమై గూడ మనము ఎన్నో సంగతులు నేర్చుకోవాలి. ఆశియాఖండంలో మన పొరుగు దేశాలనించే మనం ఎన్నో ఉపాయాల్లు నేర్చుకోవచ్చు. భూమిని బలంచేసి, వీలైనంత పండించుకునే నిమిత్తం, చీనాదేశస్థులు, సహజమైన పెంటలు ఉపయోగించడానికి వెనుకాడరు. మనం, భూమిని బలం చెయ్యడానికి ఉపయోగించవలసిన పెంటలు సాధారణంగా పిడకలుగా గదా ఉపయోగిస్తున్నాము. జపానులో సాగుబడిలోవున్న ప్రతి ఎకరానికి, సుమారు 500 పౌన్లు ఎరువు ఉపయోగించేవారు. మనదేశంలో 3/5 పౌండ్లు వేస్తాం. యుద్ధానికి పూర్వం, మన దేశం మొత్తముమీద 66,000 టన్నుల ఎరువులు మాత్రం ఖర్చు అయేవి. యుద్ధసమయంలో ఈమాత్ర ఎరువు మనదేశానికి సరాసరి కాలేదు. ప్రభుత్వం స్థాపిస్తూవున్న ఎరువుల ఫాక్టరీలు సంవత్సరానికి 3,50,000 టన్నుల ఎరువులు ఉత్పత్తి చేస్తాయి. ఇది చాల అభివృద్ధియని చెప్పవచ్చునుగాని, బలహీనమయిపోయిన మన పొలాల పరిస్థితినిబట్టిచూస్తే, కావలసినదానిలో ఇది ఒక అంశంమాత్రమే!

గోధుమ, ధాన్య పొలాలు తప్ప, ఇతర ఆహారపదార్థాల ఉత్పత్తి సాధనాలు మనము అభివృద్ధిచేసుకోనే లేదు. అలవాటులేని ధాన్యం తినడంకంటే, పస్తుపడి వుంటానంటాడు, మన దేశీయుడు ధాన్యం పాలక మొక్కజొన్న దిగుమతిచేసి దుకాణాలలో పెడితే, తిండి చాలక పోయినా మొక్కజొన్న పుచ్చుకొనడానికి నిరాకరించారు, కోజా వేలాదిప్రజలు. అవిధంగానే, నెయ్యి, అపురూపమయిపోయినా—నెయ్యి సమృద్ధిగా దొరక్కపోవడం, అటుంచి—చాల ఖరీదుకూడాను—మన దేశీయులు చాలమందికి నేయే కావాలని పట్టుదల. నెయ్యికి బదులు, మరేమియు వాడకూడదని దురభిప్రాయం.

నిజముగా, 'వనస్పతి' వంటివి అనేక విధాలుగా ఉపకరిస్తుంది. మన ఆహారంలో కావలసిన ఒకప్రధానభాగాన్ని సమకూర్చుతుంది.

ఆహారం విషయంలో వున్న యీ విధమైన మూర్ఖతలు, మన దేశాభివృద్ధిని అనేకవిధములుగ నిరోధిస్తున్నాయి. లోకంలో వున్న పశుసంపదలో మూడో భాగం మనదేశంలో వుండియూ, పాలు కరువై, అతితక్కువగా ఉపయోగింపబడుట విచారకరము. ఇండియా పాకిస్తానులలో, సగటున మనిషికి 6 6 ఔన్సుల పాలు ఉపయోగిస్తున్నట్లు అంచనా తేలింది. పంజాబు, సింధు రాష్ట్రాలలో, పాల వాడకం చాల ఎక్కువ కనుక, ఇప్పటి ఇండియాలో సగటున మనిషికి 5 ఔన్సులకి మించి పాలవాడకం వుండదని చెప్పవచ్చును. మన పశుసంపదను చక్కగా పోషించుకుంటే పాల ఉత్పత్తి చాల అధికం చేసుకోవచ్చును.

మన సముద్రములలో, నదుల్లో, సరస్సులలో లభించే అపారఆహారాన్ని మనం ఉపయోగించుకోడమేలేదు. ఒక జైనమతంలోతప్ప, ఏ యితరమతంలోనూ, మత్స్యాహారము నిషేధింపబడలేదు. అయితే ఒక్క బెంగాలులో మాత్రం, జనసామాన్యం మత్స్యాహారం విరివిగా వాడుతారు. సముద్రంలో సుదూరంపోయి చేపలని పట్టేటందుకు సౌకర్యాలు కలిగించి, కోళ్ళని సక్రమపద్ధతులమీద పెంచడం వ్యాపింపజేస్తే మనదేశంలో మాంసాహారుల భోజన సౌకర్యం వృద్ధిఅవుతుంది.

మనం తగినంతగా పళ్ళు, ఫలాలు, కాయగూరలు తింటున్నామని ఎవరనగలరు? ప్రతి పట్టణంలోను, పల్లెల్లోను, కాయగూరలు, పళ్లు ఫలాలు పండించడానికి తగిన భూవంతి లేకపోలేదు. ఈ చెట్లుచేమలు నాటడానికి పోషించడానికి అట్టే వ్యయము అక్కర్లేదు.


ఇప్పుడు ప్రారంభించుబోతున్న నదీ ప్రాజెక్టులవల్ల సాగుబడిఅయే భూములల్లో, కొంతభాగం తోటలకింద ప్రత్యేకిస్తే చాల బాగుంటుంది. మనకి ఆహారంమాత్రం అధికంగా వుత్పత్తి అయితే చాలదు. గ్రామస్థుల దేశానికి కావలసిన అన్నిరకాల ఆహారమూ వుత్పత్తి కావా. హైడ్రోఎలెక్ట్రిక్ ప్రాజెక్టుప్రేరేపమున నవీనమైన కార్ఖానాలు ఉత్పత్తి కావలెను. పరిశ్రమాభివృద్ధివల్ల అధికమవుతున్న మన జనాభాకి, ఉద్యోగం, కట్టుకోడానికి బట్ట, ఉండడానికి ఇల్లూ లభించుతాయి. [illegible] కావలసిన మనం ఉత్పత్తి [illegible] లేని ఆహారం విదేశాల [illegible] దిగుమతి చేసుకొంటేనేగాని, ఈ జనాభా తిన్నగా జీవించలేదు. అయితే విదేశాలనుంచి దిగుమతిఅయే ఆహారపదార్థాలమీద ఆధారపడి వుండడం ఎంత ప్రమాదకరమో మొన్నటి ప్రపంచ సంగ్రామంలో గ్రేట్‌బ్రిటెన్‌యొక్క అనుభవాలనిబట్టి వ్యక్తమవుతుంది.

మన జనాభాసమస్య అతి ప్రాముఖ్యమైనదని అమెరికాలోవున్న ఒక భారతీయుడు, అర్థిక శాస్త్రవేత్త డాక్టర్ యస్. చంద్రశేఖర్—ఇండియాప్రభుత్వంలో జనాభాశాఖ యొకటి ఏర్పాటు చెయ్యవలసిందని సూచించాడు. ఆ శాఖ పర్యవేక్షణకింద వివాహము సంతతి, ఆరోగ్యము, పుష్టికరమైన ఆహారము, విద్య, వృత్తి విద్య, క్షయ, కుష్ఠు మొదలయిన రోగనివారణ నిమిత్తము ప్రత్యేక వైద్యాలయాలు ఉండవచ్చును.

ఈ విషయాలన్నిటిసందర్భంలోను మనం నేర్చుకోవలసిన సంగతులు చాల వున్నాయి, నిజం, నిస్సందేహంకాని మన ప్రధానసమస్య భూమినుంచి అధికాహార వుత్పత్తిచేయడం ఎలాగ? మన కార్మికుడి కృషి అధిక ఫలవంతం చెయ్యడం, ఎలాగ? దీనికి సంబంధించినదే మన ప్రజల ఆహారం 'సరియైనవిగా' అభివృద్ధి చెయ్యడం.

ప్రతి పది సంవత్సరాలలోను, నూటికి పది వంతులు మన జనాభా పెరుగుతున్నది. 1971 వ సం॥ నాటికి జనాభా ఇంక పదికోట్లు పెరిగితే అతిశయోక్తి గాదు.

పెరిగే ఆ జనాభాకి పొట్ట గడవడం ఏలాగ? ఈ సమస్య మనము ఎదుర్కొని పరిష్కరించి తీరాలి. సంకోచించి లాభంలేదు. ఎంత త్వరలో సమస్యాపరిష్కారం చేసుకోగలిగితే అంత మంచిది.



లండన్‌లో 1938 నాటినుంచి కొత్తగా తయారుచేసిన ఇంజనీరింగ్ యంత్ర తయారీ పనిముట్లు ఈమధ్యనే ఒలింపియా ఇంజనీరింగ్ ప్రదర్శనంలో చూపించారు.

వ్యక్తిస్వాతంత్ర్యం-సంఘ స్వాతంత్ర్యం

శ్రీ అడపా రామకృష్ణరావు

ఆంధ్రపత్రిక 22-9-'48 సంచికలో "స్వరాజ్యం వచ్చిందా ?". అనే శీర్షికతో మిత్రులు 'అమరేంద్ర' గారు మన స్వాతంత్ర్యపు పరిమితుల గురించి వ్రాసిన వ్యాసాన్ని చదివాను. వ్యక్తిస్వాతంత్ర్యానికీ, సంఘ స్వాతంత్ర్యానికీ కొన్ని సునిశ్చితమైన హద్దు లున్నవి. రోడ్డు మీద మన నడకనుగురించి పోలీసుల మందలింపులకు గురి కాకుండా ఉండడానికీ, ఇతరులకి ఏమాత్రపు చిరాకూ కలిగించకుండా మన అభిమానగాయని సంగీతం వినడానికీ, ఇతరులు మనకు చికాకు కలిగించే స్థితిలో వారిని తగినంత దూరంలో ఉంచడానికీ మనం మనస్వేచ్ఛా పరిమితిని తెలిసికొని ఉండడం చాలా మంచిది.

ఈ స్థితిలో "అసలు స్వేచ్ఛఅంటే ఏమిటి ?" అనే ప్రశ్నవస్తుంది. ఈనాడు ప్రపంచంలో ఐనచోటా, కానిచోటాకూడా విరివిగా ప్రచారంలో ఉన్న పదజాలంలో "స్వేచ్ఛ" కూడా ఒకటి. ముఖ్యంగా 1775లో అమెరికాలోనూ, 1789 లో ఫ్రాన్సులోనూ ప్రజల తిరుగుబాటు వలన "స్వేచ్ఛ"ను గురించి చాలా చర్చ జరిగింది. నాటినుంచీ స్వేచ్ఛ రాజకీయాలనుంచి కవులకు ఇతివృత్తంగా కూడా ఎక్కువగా ఉపయోగంలో వుంది. లవ్‌లేస్ అనే కవి చెరసాలనుంచి తన ప్రియురాలికి లేఖ వ్రాస్తూ——

"రాతిగోడల వలన, ఇనుపచువ్వల వలన ఒక మనుష్యుడి స్వేచ్ఛ నశించదు. మనస్సు లొంగుబాటు చెయ్యనంతవఱకు స్వేచ్ఛకు ఏవిధమైన భంగమూ ఉండదు."

అని ఒక గీతములో వెల్లడించాడు.

ఊహారమ్యమైనదే కాని మనకు సంబంధించినంతవరకు చెరసాల ఎంత పండువెన్నెలతో శోభిస్తున్నా చెరసాల కాక మానదు. కనుక, కవిత్వాన్ని విడిచి కఠినసత్యంవంక దృష్టి మరల్చితే స్వేచ్ఛకు ఒకటి, రెండు చక్కని నిర్వచనాలు కనిపిస్తాయి.

ఫ్రెంచి విప్లవం జరిగినప్పుడు 1789 లో విప్లవకారులు "మనుష్యుని హక్కులు" ప్రకటించారు. ఈ ప్రకటన ప్రకారం స్వేచ్ఛ "ఇతరులకు హాని కలుగని పనిని దేనినైనా చేసే అధికారం."

హెరాల్డ్ లాస్కీ స్వేచ్ఛనుగురించి "ఈనాటి నాగరిక ప్రపంచంలో వ్యక్తిగతమైన, ఆనందానికి అవసరమైన సాంఘిక పరిస్థితులపై ఏవిధమైన ఒత్తిడీ లేకపోవడం" అని నిర్వచించాడు.

ఈ రెండు నిర్వచనాలవలనా స్వేచ్ఛ కొన్ని పనులను చెయ్యడానికి మనకు గల హక్కు అనీ, ఈ పనులు తోటిప్రజలకు ఏవిధమైన చికాకూ కలిగించనంతవరకే ఈ హక్కు మనకు ఉంటుందనీ తేలుతుంది.

ఈ స్వేచ్ఛకు సరిహద్దులను నిర్ణయించే అధికారం ప్రభుత్వానికి ఉంది. ప్రతి ప్రభుత్వమూ తన పౌరులకు సునిశ్చితమైన హక్కులను కొన్ని ఇస్తుంది. ఈ హక్కులను వారు ఉపయోగించుకోడానికి అనుకూల వాతావరణాన్ని కల్పించి, ఆటంకా లేవైనా ఏర్పడితే తొలగించి, ఈ పౌరసత్వపు హక్కులను జాగ్రత్తగా రక్షింపవలసిన బాధ్యతకూడా ప్రభుత్వానికి ఉంటుంది. వివిధదేశాలలో గుర్తింపబడిన పౌరసత్వపు హక్కులను కొన్నింటిని పరిశీలించుదాము :

(i) జీవించే హక్కు : ప్రతిపౌరునికీ జీవించే హక్కు ఉంది. ఇది ప్రాథమికమైన హక్కులలో ఒకటి. ఈ హక్కును కాపాడడం కోసమే సాధారణంగా అన్ని ప్రభుత్వాలూ ఆత్మహత్యను నిషేధించి, ఆత్మహత్యా ప్రయత్నాన్నీ నేరంగా పరిగణించి శిక్షిస్తాయి. ఇక్కడ ఒక చిత్రం ఉంది: 'జీవించే' హక్కు కోసం 'మరణించే' హక్కును మనం కోల్పోతున్నాం. ఎందుచేతనంటే పౌరులకు మరణించే హక్కు ఉంటే వారికి జీవించే హక్కును ఏ ప్రభుత్వమూ కల్పించలేదు !

ఈ సందర్భంలోనే నాగరిక ప్రభుత్వాలు కొన్ని మరణదండనను తమ శిక్షాస్మృతినుండి తొలగించాయి. మరణశిక్ష జీవించే హక్కును నిరోధిస్తుంది కనుక ఈ చర్య జనామోదం చెందింది.

(ii) వ్యక్తిగత క్షేమపు హక్కు : ఇతరులనుంచి వ్యక్తిగతంగా క్షేమంగా ఉండే హక్కు పౌరులకు ఉంది. ఒక పౌరుడు మఱొక పౌరుని జీవితంపై బలవంతంగా ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించినప్పుడు ప్రభుత్వం అతనిని శిక్షించి, ఆ పౌరుని క్షేమాన్ని కాపాడవలసి ఉంటుంది. క్రూరజంతువులనుండి కూడా పౌరులను క్షేమంగా ఉంచడానికి ప్రభుత్వం తగిన కట్టుబాటులను చెయ్యవలసిఉంటుంది.

(iii) గౌరవపు హక్కు : ఒక పౌరుణ్ణి మఱొకపౌరుడు అవమానించినట్లయితే——ఆ పౌరుడు తన పట్ల చేయబడిన ప్రచారం నిరాధారమైనదని, అది తనకు అవమానిహేతువని ప్రభుత్వాన్ని ఒప్పిస్తే ప్రభుత్వం అసత్య ప్రచారంచేసిన వ్యక్తిని శిక్షించి అతని గౌరవాన్ని కాపాడుతుంది.

(iv) మత స్వాతంత్ర్యం : మనుష్యునికి తన ఇష్టం వచ్చిన మతాన్ని స్వీకరించే హక్కు ఉంది. ఈ హక్కును ప్రభుత్వాలు గుర్తించడానికి చాలా కాలం పట్టింది. ముఖ్యంగా మధ్యయుగంలో యూరప్‌లో క్రైస్తవేతరులు తీవ్రమైన శిక్షలపాలయ్యారు. ఆధునిక ప్రభుత్వాలు మాత్రం ఈ హక్కును పూర్తిగా గుర్తించినవి.

ఈ హక్కుప్రకారం వ్యక్తికి తన ఇష్టం వచ్చిన మతాన్ని స్వీకరించడానికీ, తనకు వచ్చిన రీతిని ప్రార్థన చెయ్యడానికీ——అసలు చెయ్యకపోవడానికి కూడా!——తన మత విశ్వాసాలను ఇతరులకు వెల్లడించక పోవడానికీ అనుమతి ఉంది.

(v) విద్యకు హక్కు : పౌరసత్వపు బాధ్యతలన్నీ, సమగ్రంగా నిర్వహించడానికి పౌరులకు తిగిన విద్యా, శిక్షణ ఉండడం అవసరం. కనుక ప్రతి పౌరునికీ విద్యకు హక్కు ఉంది. ఐతే ఇది వివిధ దేశాలలో వివిధక్రమాణాలలో ఆచరణలో ఉంది. బ్రిటన్‌లో తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా విద్య నేర్పించే హక్కు తల్లి దండ్రులందఱికీ ఉంది. మనదేశంలో కూడా ఈ హక్కును ఆచరణలోనికి తేవడానికి ఇప్పుడు ప్రయత్నాలు జరుగుతున్నవి.

(vi) వాక్స్వాతంత్ర్యం : దీనిలోనే సభా స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం ఇమిడి ఉన్నవి. ప్రతిపౌరునికీ తన భావాలను బహిరంగంగా సభాముఖాన కాని, పత్రికాముఖాన కాని, మఱే రీతినైనా వెల్లడించడానికి హక్కు ఉంది. నిజానికి ప్రజాస్వామ్యపు ప్రాథమిక సూత్రం ఈ వాక్స్వాతంత్ర్యమే.

ఐతే——వెల్లడింపబడే అభిప్రాయాలు సత్యమైనవి అయివుండాలి. పైగా ఆ అభిప్రాయ ప్రకటన మూలంగా ప్రజలలో అశాంతి చెలరేగే అవకాశం ఉంటే జోక్యం కలిగించుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది.

యుద్ధసమయాలలోనూ, తాదృశమైన అసాధారణ సమయాలలోనూ ప్రభుత్వం వాక్స్వతంత్రాన్ని తాత్కాలికంగా ఉపసంహరించవచ్చు.

(vii) సంఘీభావపు హక్కు : సాంఘిక, మత, రాజకీయ, ఆర్థిక విషయాలలో దేనిలోనైనా ఒకబాటనే అనుసరించే పౌరులు ఒక సంఘంగా చేరి తమ అభిప్రాయాలను ప్రచారం చేసుకునే హక్కు వారికి ఉంది. ఐతే ఈ అభిప్రాయాలను ప్రశాంతంగా ప్రచారం చేసుకోవాలి కాని సాయుధమైన సంఘస్థాపనకు ప్రభుత్వం అనుమతించదు.

(viii) సాంఘిక ప్రయోజనాల హక్కు : రోడ్లనూ, పార్కులనూ, గ్రంథాలయాలనూ, ఉపయోగించడానికీ, నిర్ణీతమైన వెలలకు పోస్టు, రైల్వేలను ఉపయోగించడానికీ, న్యాయం కోసం న్యాయస్థానాలలో ఫిర్యాదు చెయ్యడానికీ, ప్రభుత్వ వైద్యాలయాలలో చికిత్స పొందడానికీ పౌరు లందరికీ హక్కు ఉంది.

ఇవి కాక రాజకీయంగా ఎన్నికలలో ఓటు వెయ్యడానికీ, తగిన షరతులను పాటించగలిగితే ఎన్నికలలో అభ్యర్థిగా నిలబడడానికీ, ప్రభుత్వోద్యోగాలకు దరఖాస్తు చెయ్యడానికీ పౌరులకు హక్కు ఉంది.

ఈ హక్కులన్నీ అన్ని దేశాలలోనూ పూర్తి పరిమాణంలో ప్రజల వశంలో లేవు. అది ఆయాదేశాల ప్రభుత్వాలు విశ్వసించే రాజకీయ సిద్ధాంతాలమీద, ఆదేశప్రజల విజ్ఞాన చైతన్యాలమీద ఆధారపడి ఉంటుంది.

ఈ హక్కులను కాపాడడానికీ, ప్రజలు తమ ఆనందంకోసం ఇతరులను చికాకు పెట్టకుండా ఉండడానికీ ప్రభుత్వం పోలీసుశాఖను ఉపయోగిస్తుంది. కాగా రోడ్డుమీద నడిచే వ్యక్తి తన స్వేచ్ఛమూలంగా ఇతరులకు కష్టకారణం అవుతున్నప్పుడు మందలించే హక్కు పోలీసుకి వుంది. అటువంటి సమయాలలో 'అమరేంద్ర'గారు వర్ణించిన పల్నాటిరైతువలె "స్వరాజ్యం వచ్చినా నీ జులుం తప్పలేదా ?" అని సమాధానం చెప్పడానికి పౌరులకు అధికారం లేదు. కాని ఈ కథ ఇక్కడ ముగియడంలేదు. ఈనాడు చాలా దేశాలలో పోలీసు, జనసామాన్యానికి తమ పౌరసత్వపు హక్కులను రక్షించడంలోగాక, కలవారిని జనసామాన్యపు ఒత్తిడినుండి రక్షించడానికి మాత్రమే ఉపయోగపడుతున్నాడు. పెట్టుబడిదారీ విధానం అమలులో ఉన్న దేశాలన్నింటిలోనూ కలవాడికీ, లేనివాడికీమధ్య ఒక పెద్దఅఘాతం పూడ్చరానిది ఏర్పడివుంది. లేనివాడు గంజిలోకి ఉప్పుగల్లు లేక ఆకటిబాధతో అటమటిస్తూవుంటే, కలవాడి కుక్కపిల్ల తనకు పోసిన పాలు ఎక్కువై కాళ్లతో తన్ని ఒలకపోస్తున్నది. ఈ స్థితిలో పోలీసు, కలవాడి కుక్కపిల్లకు ఎక్కువైన పాలు లేనివాడి పిల్లలకు అందడానికి తోడ్పడడంలేదు సరికదా——ఆకటి బాధతో లేనివాడు ఆ పాలను తీసుకోవడానికి ప్రయత్నించినందుకు అతనిని ఇనుపచువ్వల వెనుక జాగ్రత్తగా బంధించి కలవాడికి కష్టం ఏ మాత్రమూ కలగకుండా ఉంచేటందుకు మాత్రమే ఉపయోగపడుతున్నాడు. ఇటువంటి పరిస్థితులలో సహజంగా జరుగగల విషయం ఒక్కటే——లేనివాడు పోలీసును ధిక్కరించటమే. ప్రపంచంలో జరిగిన విప్లవా లన్నింటికీ మూలకారణం సామాన్యప్రజానీకంలో ఇటువంటి తీవ్రమైన అసంతృప్తి ప్రబలడమే.

ప్రపంచంలో ఆచరణలో ఉన్న న్యాయ సూత్రాలూ, శిక్షాస్మృతులూ——అన్నీ మనుష్యులు ఏర్పరచుకున్నవే. కనుక మానవజాతి పురోగమిస్తున్నకొద్దీ ప్రాతచట్టాలను సవరించవలసిన అవసరం ఏర్పడుతూ ఉంటుంది. కాలంతోపాటు ప్రభుత్వం కూడా ముందడుగు వెయ్యకపోతే ప్రజలు న్యాయాన్ని తమ హస్తగతం చేసుకో ప్రయత్నిస్తారని చరిత్ర నిరూపిస్తోంది.

కాగా, వీథిన పోలీసును ఎదిరించే ప్రజ తమ హక్కుల సరిహద్దులు తెలియనివారైనా కావచ్చు; లేదా ఆ హక్కులపట్ల తీవ్రమైన అసంతృప్తి కలవారైనా కావచ్చు. మొదటి తరగతి ప్రజ క్షంతవ్యులు కారు. ఎందుచేతనంటే తప్పు చెయ్యడానికి న్యాయశాస్త్రంతో పరిచయం లేకపోవడం ఒక కారణం కాజాలదు; కాని రెండవతరగతి ప్రజ చేసే శాసనధిక్కారాన్ని ఏ శక్తీ ఆపలేదు. ఎందుచేతనంటే అది మానవజాతి చిరచరిత్రలో ఒక సహజ పరిణామం !



పతాకారోహణ చేయనున్న ఆచార్య రంగా.
చిలకలూరుపేటలో కాంగ్రెస్ సేవాదళోద్యోగులు శిక్షణ శిబిరం ప్రారంభోత్సవం సందర్భపు ఛాయాచిత్రం.

సంస్కృతం మన రాష్ట్రభాష

[శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి]

భారతదేశం స్వతంత్రమైన తరువాత మనం ఏదో ఒక దేశ భాషను రాష్ట్రభాషగా నిర్ణయించు కొనవలసిన అవసరం వచ్చినది. కొందరు హిందుస్తానీని, మరికొందరు హిందీని, యింకా కొందరు సంస్కృతాన్ని రాష్ట్రభాషను చేయ గోరుచున్నారు. మనం యీ విషయమై నేడు నిష్పక్షపాతంగా విచారించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. నా వ్రాత ఎవరికైనా బాధను కల్గిస్తే క్షమించవలెనని విన్నవించు కొంటున్నాను—"సత్యే నాస్తి భయం క్వచిత్".

మహాత్ముడే గాక నేడు అనేకులు కాంగ్రెసు అగ్రనాయకులు అతి నూత్నమై సాహిత్య రహితమైన హిందుస్తానీని రాష్ట్రభాష చేయగోరుచున్నారు. దీనిని ఆంగ్లేయులే నిర్మించారు. తేలికయిన ఉర్దూ పదములు, దేశీయపదములు కలిపి యీ సంకరభాషను నిర్మించారు. మొదట ఆంగ్లేయులు తమ సౌలభ్యం కోసం హిందీ సాహిత్య విచ్ఛిత్తికోసం యీ సంకరభాషను నిర్మించారు. యు. పి. సి. పి., బీహారు మొదలగు ప్రాంతాల్లో పాఠశాలల్లో కూడా హిందుస్తానీ రీడరులను జారీచేసిరి. ఆఫీసర్లూ, ప్రజానాయకులూ ఎంతగా ఘోషించినా ఆప్రాంతాల్లో హిందుస్తానీ వ్యాప్తినందలేదు. పైగా ఒక క్రొత్త సరకారు భాషను కూడా నేర్చుకొనవలసిన చిక్కు వచ్చినది. యీ హిందీ ఉర్దూమిశ్రితమైన త్రిశంకుస్వర్గంలాటి భాషలో పారిభాషికపదాలు నిర్మించడానికి ఏమాత్రం వీలులేదు. చూడండి: థర్మామీటరు, అనుపదానికి ఆతిశేమాపక, అనవలసివచ్చును. యిట్లే ప్రతి పదంలోనూ రెండు భాషలపదాల్ని యిరికిస్తే అది హాస్యాస్పదమైపోవును. ఉర్దూవారిచే తిరస్కరింపబడి, హిందీవారితో అవహేళన చేయబడిన, హిందూస్తానీ రాష్ట్రభాషగా ఉండజాలదు. పైగా ఉత్తర హిందూస్తానంలోని ప్రతి మనుజుడూ హిందూస్తానీని అసహ్యించుకొనుచున్నాడు. ఎంత నాయకప్రోద్బలమున్నా ప్రజా సహకారం లేని భాష ఎంతో కాలం జీవించలేదు. కాని ఉత్తర యిండియాలోని ప్రతి కమ్యూనిస్టూ హిందుస్తానీ నంగీకరింపని ప్రతి వాడినీ బూర్జువా అనీ, కేపిటలిస్టనీ తిడుతూంటారు. లెనిన్ గ్రాడ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రపంచ విఖ్యాతుడైన రాహుల్ సాంకృత్యాయన్ కూడా కేవలం హిందీని అంగీకరించినందున భారతకమ్యూనిస్టుపార్టీతో సంబంధాన్ని త్యజించవలసి వచ్చినది. హిందుస్తానీ వాడుక భాషగా ఉపకరింపవచ్చును. కాని, గంభీరమైన సాహిత్యవైజ్ఞానిక విషయాలు యీ భాషద్వారా వ్యక్తపరచడం అసాధ్యమైనది. ఏదైనా ఉత్కృష్టమైన విషయాన్ని వ్రాయవలసిన యెడల సంస్కృతంనుంచీ గానీ, అరబ్బీ ఫార్సీలనుంచిగానీ పదాలను ఎరువు తీసుకొనవలసివచ్చును. ప్రాచీనతయూ, తజ్జన్యమైన గౌరవమూ యీ భాషకు లేదు. కేవలం కొందరు మహమ్మదీయుల తృప్తికై 40 కోట్ల భారతీయులపై రెండు లిపులభారాన్ని రుద్దడం అన్యాయమైనది. ముస్లింల మనస్సులు మారనప్పుడు భాషద్వారా ఐకమత్యాన్ని సాధించబూనడం హాస్యాస్పదమైన విషయము.

హిందుస్తానీ రాజభాషగా స్వీకరింపబడినా హిందీ ప్రాంతాల్లో ప్రచారంలో ఉండే సంస్కృత మిశ్రితమైన సాహిత్య భాషను, పత్రికల భాషను మార్చివేయడం అసాధ్యమైన విషయము. యిప్పటి సాహిత్య హిందీని మార్చలేనప్పుడు హిందుస్తానీ సాహిత్యంమాత్రం ఏవిధంగానూ వృద్ధిజెందదు. లక్నోలోని పచ్చి ఉర్దూ భాషకు, అలహాబాదులోని సంస్కృత మిశ్రితమైన హిందీకిన్నీ హిందుస్తానీ ద్వారా సమన్వయం కుదురదు. యింతవరకూ బ్రిటిష్ వారు సైన్యంలో యీ హిందుస్తానీనే ఉపయోగించారు. అర్ధశిక్షితులుండే సైన్యంలో ఉపయోగపడవచ్చును కానీ అశిక్షితులలోనూ, పండితులలోనూ దీన్ని ఉపయోగించడం అసాధ్యమైనది. నిష్ఫలమైన హిందుస్తానీ విధానాన్ని గురించి విచారించడమే అనవసరం, ఒక్క నగ్న సత్యాన్ని మరువకూడదు. అగ్రనాయకులు హిందుస్తానీద్వారా పాకిస్తానాన్ని యిండియాలో ఐక్యంచేయడానికి ముస్లింల మత విషపూరితమైన మనస్సు మారుస్తామని కలలు కనడాన్ని ఎంత త్వరగా విరమిస్తే దేశానికి అంత శ్రేయస్కరమగును.

యిక హిందీ రాష్ట్రభాష అనే వాదాన్ని పరిశీలించవలెను. నేటి హింది 40, 50 ఏండ్లనాడు ఆంగ్లేయులతో పరిపాలనాసౌకర్యానికి నిర్మించబడినది. మనం నేడు చూస్తూఉండే హిందీ పండితులతో పెంచబడి కేవలం పుస్తకములలో మాత్రం ఉపయోగింపబడును. బీహారు, సి. పి., యు. పి. మొదలగునవి బహు భాషా ప్రాంతములు. ఆ ప్రాంతాలలో వ్రజ, అవధి, ఖడీ బోలీ, భోజపురి, రాజస్తానీ మొదలగునవి ముఖ్యమైన భాషలు. నేటి పత్రికల హిందీకిన్నీ యే ప్రాంతముల భాషలకున్నూ ఏమాత్రం సంబంధం లేదు. అక్కడక్కడ కొన్ని పదములు మాత్రం కలుస్తాయి. యీ భాషలకు ప్రత్యేక సాహిత్యంకూడా వున్నది.

మొట్టమొదట ఆంగ్లేయులు మన దేశములో పాతుకొనగానే హిందీప్రాంతాలు అని నేడు పిలువబడు ప్రాంతాలలో పైజెప్పిన భాషలున్నవి. దగ్గరదగ్గరనే అనేక భాష లుండడం, ఒక భాషకు యితరభాషతో సంబంధం లేకపోవడంవల్ల పరిపాలన అత్యంత క్లిష్టమై పోయెను. అంతవరకూ యీ భాషలలో పద్య సాహిత్యమే కానీ గద్య సాహిత్యం లేదు. పద్యాలలో పరిపాలన జరపడం అసంభవము. కనుక యీ ప్రాంతములో అతి స్వల్ప సంఖ్యాకులు మాట్లాడే ఖడీ బోలీని గద్యంగా తీసికొని కలకత్తాలోని ఫోర్టు విలియం కాలేజికి చెందిన గిల్ క్రిస్టుదొర, సదళ మిశ్ర మొదలగు పండితులచే కొన్ని పుస్తకములు రచింపజేసెను. అప్పటినుంచీ నేటివరకూ ఖడీ బోలీ గద్య హిందీ అనుపేరుతో వృద్ధిజెందుతూ వచ్చినది.

ఈ ఖడీబోలీ హిందీ నేడు సభలలోనా, పండిత గోష్ఠులలోనా, పత్రికల్లోనా ఉపయోగింపబడుచున్నది. యీ హిందీ ఉత్తర యిండియాలోని ఏ పట్టణంలోనైనా ప్రచారములో ఉన్నది. కానీ పల్లెలలో యిప్పటికీ అవధి, వ్రజ మొదలగు భాషలను మినహాయిస్తే యీ హిందీని వారు తెలుసుకొనజాలరు. మీరు ఉత్తర హిందూస్తానంలోని ఏ పల్లెకైనా వెళ్ళండి. ఈ హిందీతో మాట్లాడిన వారికి బొత్తుగా అర్థం కాదు. పట్నాలలో కూడా విద్యావిహీనులైన ప్రజలు తమలో తాము మాట్లాడుకొనునప్పుడు యీ హిందీని ఏమాత్రం ఉపయోగించరు. ఆంధ్రప్రజలు, రాయలసీమవాసులకు, ఉత్తర సర్కారు వాళ్ళకు ఉండే స్వల్పమైన భేదాలే హిందీప్రాంతాలలోనూ ఉండవచ్చునని అపోహ పడవచ్చును. హిందీ ప్రాంతాలకూ, ఆంధ్ర ప్రాంతాలకూ ఏమాత్రం సామ్యంలేదని గ్రహించవలెను.

రీక హిందీ సాహిత్యమును గురించి విచారించవలెను. మీరు నేటి హిందీలోనే సూరదాసు, తులసీదాసు మొదలగు మహాత్ములు తమ కావ్యాలను రచించిరని భావించకూడదు. సూరదాసు వ్రజభాషలోనా, తులసీదాసు అవధిభాషలోనా, మీరాబాయి, కబీరులు రాజస్తానీ, సధుక్కడి భాషలలోనూ తమ ఉత్కృష్ట రచనలను రచించిరి. వాస్తవంలో తులసీదాస రామాయణం అత్యుత్తమమైనది. కానీ అది నేటి హిందీలో రచింపబడలేదు. నేటి హిందీలో సాహిత్యరచన కేవలం 30, 40 ఏండ్ల నుంచీ ప్రారంభమైనది. కానీ ప్రజాసామాన్యానికి అపరిచితమైనందుననో, లేక ఉర్దూతో పోటీ చేయలేనందువల్లనో నేటి హిందీ సాహిత్యం అతి స్వల్పంగా వృద్ధిజెందినది. ఛాయావాద, రహస్యవాదము లనే వాదముల వలన హిందీలో ఒక్క ఉత్తమ కావ్యంకానీ రచింపబడలేదు. ప్రేమచందు, జయశంకర ప్రసాద్ వంటి ఒకరిద్దరిని వదలితే హిందీప్రాంతం ఒక్క ఉత్తమ సాహిత్యకారుని కూడా సృష్టించలేక పోయినది. రాష్ట్రభాషగా కాకుండా విజ్ఞానోపార్జన కయినట్లయిన హిందీలో చదవవలసినదీ, మన తెలుగు బెంగాలీలకంటె మిన్నయినది ఏమిన్నీ లేదు. మనం కష్టపడి అపరిచితమైన హిందీని నేరుస్తూంటే హిందీప్రాంతవాసులు తమ పత్రికలలో మనపై నిప్పులు కురిపిస్తున్నారు. పాఠకులు ఒక్కసారి ఉత్తరహిందూస్తానం పేపరులను పరిశీలిస్తే మనపై ఎంత ఘోరమైన దుష్ప్రచారం జరుగుచున్నదీ గ్రహించగలరు. యీ మధ్యనే ఢిల్లీలోని 'విజయ' అనే సుప్రసిద్ధ పత్రికాసంపాదకీయంలో కులతత్వాలకంటే మత పిచ్చికంటే భాషాప్రయుక్త రాష్ట్రవిభజనావాదం అతి భయంకరమైనదనీ, ఆంధ్రులు విచక్షణ లేకుండా మూర్ఖతతో, స్వరాష్ట్రానికి ఆవేశభరితులైనారనియూ ఎన్నో విధాల ఆంధ్రులను తిట్టిపోసింది. ఒక్క "విజయ" మాత్రమే గాక అక్కడి అన్ని పత్రికల విషయం యింతే. మనం రాష్ట్రైక్యతకై అనేక బాధలలో హిందీని నేరుస్తూంటే వారు మనవిషయమై తమ కర్తవ్యాన్ని ఏమాత్రం నెరవేర్చడంలేదు సరిగదా, మనపై దుష్ప్రచారం చేయడమే తమ కర్తవ్యంగా పెట్టుకొన్నారు.

హిందీ ప్రాంతవాసులకే అర్థంకాని హిందీని, హిందూస్తానీబురఖాతో ఉండే ఉర్దూభాషనూ మనం ఎన్నటికిన్నీ రాష్ట్రభాషగా అంగీకరించరాదు. అట్లు అంగీకరిస్తే తెనుగుభాష, తెనుగు రాష్ట్రంకూడా దెబ్బతినునని మనవి చేస్తున్నాను.

ఆసేతుహిమాచల పర్యంత ప్రచారంలో ఉండి రాష్ట్రభాషా గౌరవాన్ని పొందే యోగ్యతనూ, గౌరవమునూ, ప్రాచీనశోభనూ కల్గిన భాషయే నేడు రాష్ట్రభాషాపదవికి అర్హమైనది. అట్టి గౌరవం ఒక్క సంస్కృతానికి మినహాయిస్తే ఏ భాషకున్నూ లేదు. చాలాకాలం ముసల్మానుల రాచరికంవరకూ యీసంస్కృతమే రాచభాషగా ఉండినది. సంస్కృతమంత ప్రాచీనమైనది ప్రపంచంలో ఏభాషా లేదని పాశ్చాత్యులే అంగీకరింతురు. సజీవమైన భాష యిది యొక్కటియే.

కొందరు ఆంగ్లవిద్యామదమత్తులు సంస్కృతం మృతభాషయనీ అది అవ్యావహారికమనీ ప్రేలుదురు. ఉత్తర ప్రత్యుత్తరాల్లో సంభాషణల్లో ఉపయోగించునదియే వ్యావహారిక మనబడును. ఇప్పటికీ యింతగా పాశ్చాత్యవ్యామోహం పైకొన్నా అనర్గళంగా సంస్కృతంలో ఉపన్యసించేవారు భారతదేశంలో వేనకువేలు కలరు. పాశ్చాత్యులలోనా అనేకులున్నారు. నామట్టుకు నేను ఒక అస్సాం మిత్రునితో సంవత్సరకాలం సంస్కృత మాధ్యమంతో గడిపినాను. అతనికి ఆంగ్రం, నాకు అస్సామీ రానందువల్ల మాకు సంస్కృతమే శరణ్యమయినది. యింతకాలంలోనే మేము స్పష్టంగా దేశభాషల్లోవలెనే భావాల ప్రకటనకు ఏమాత్రం అంతరాయాన్ననుభవించలేదు. అనేక ఆంధ్ర పండితులు కాశీలోని పండితులతో సంస్కృతంలోనే పత్రవ్యవహారాలు జరపుచున్నారు. యిదీయంతా అవ్యవహారికమని ఎవ్వడూ అనజాలడు. యిప్పటికీ యింతగా అణచబడిననూ యింగ్లీషు తెలిసినంతమంది సంస్కృతజ్ఞులు మన దేశంలో ఉన్నారు. పండితులచే వాడబడుచూ ప్రతి కర్మలోనా ప్రయుక్తమగునట్టి సంస్కృతాన్ని మూర్ఖులు, అథవా ఆంగ్లవిద్యావిమూర్ఖులు మాత్రం అవ్యావహారిక మనగలుగుదురు.

ఇక సంస్కృతంలో ధర్మగ్రంథాలు మాత్రమే ఉన్నవని మరియొక ఆక్షేపణ. సంస్కృతంలో యితిహాసాలు, పశువైద్యాలు, శరీరతత్వాలు, గణిత, భాస్కర్యాలను గురించి అనేక గ్రంథములు రచింపబడినవి. చౌర్యకళను గురించి (దొంగతనం) కూడా వ్రాయబడిన గ్రంథము లున్నవి. విభిన్నవిషయాలను గురించీ విభిన్నరీతులతో యింత విపులంగా ఏ భాషలోనా పూర్వకాలంలో వ్రాయబడలేదు. మన పూర్వులు షడ్దర్శనాలలో ప్రతి విషయంపైనా చర్చించారు. ప్రమాణసిద్ధంకాని ఏ విషయాన్నీ వారు మూఢంగా విశ్వసించలేదు. జాబాలిమహర్షి ప్రమాణాభావంవల్ల దేవుడుకూడా లేడన్నాడు.

సంస్కృతలిపియంత సంపూర్ణమైన లిపి అరుదు. బెర్నార్డుషా కూడా యీ లిపిని ఎంతో ప్రశంసించినాడు. ముఖ్యంగా భారత భాషల ఉచ్చారణకూ, స్వరములకూ యిది అత్యంతోపయుక్తమైనది. భారత భాషలను సంస్కృతంలో ఏమాత్రం చిక్కులేకుండా వ్రాయవచ్చును. ఉర్దూతోసహా భారతదేశంలోని ఏభాషనైనను వేరొక లిపిలో ఏమాత్రం అపశబ్దాసహజత్వాలు లేకుండా వ్రాయడం అసాధ్యమైనది. నేడు హిందీప్రాంతాల్లో ఎన్నిభాషలున్ననూ నాగరిలిపిలోనే వ్రాయుదురు. యితర ప్రదేశాల్లో కూడా అధికసంఖ్యాకులకు నాగరీలిపి తెలియును. కనుక ప్రతిప్రాంతీయభాషయున్నా గవర్నమెంటు వ్యవహారాల్లో నాగరిలిపితో వ్రాయబడిన సౌకర్యమగు నను విషయాన్ని నాయకులూ, విద్వాంసులూ ఆమోదించవలెను. మన తెనుగులిపిలో అచ్చువేయడం, టైపుచేయడం కష్టము. మన తెనుగుభాషను అచ్చు వ్యవహారాల్లో నాగరిలిపితో ఉపయోగిస్తే మంచి దని నా భావన.

కొందరు సంస్కృతం అతికఠిన మైనదనీ రాష్ట్రభాషగా అతి తేలికయినభాష ఉండవలెనని వాదిస్తారు. ఈ కారణంతోనే హిందీని సమర్థిస్తారు. ప్రాతపద్ధతుల ప్రకారం సంస్కృతాభ్యాసం చేస్తే సంస్కృతం కఠిన మనవచ్చును. నేడు సంస్కృత పాఠ్యక్రమాన్ని మారిస్తే, "అభినవపాఠావళి"వంటి క్రొత్త రీడరులను విద్వాంసులచే రచింపజేసినట్లయిన సంస్కృతాన్ని సరళంగా నేర్చుకొనవచ్చును. ఈ కాలంలో సంస్కృతం రాష్ట్రభాషయైనా అనవసర కష్టదాయకమైన కౌముదిసూత్రాలూ, తర్కవచ్ఛేదాలూ అనవసరము. వ్యాకరణము యొక్క సామాన్యసూత్రములను అభ్యాసాలద్వారా బోధిస్తే సంస్కృతమును అతి తేలికగా బాలకులున్నూ నేర్చుకొనవచ్చును.

నేడు మనల్ని పారిభాషిక (టెక్నికల్) పదముల సమస్య అధికంగా బాధిస్తున్నది. కొందరు మన వాడుకలో ఉండే యింగ్లీషు పదములను పారిభాషిక పదములుకూడా మార్చవలె ననుచున్నారు. వాడుక పదములను సంస్కృతంలోనికి మారిస్తే "ఫుట్ బాల్"ను వాయుపూరిత కందుకమనియూ, బ్యాట్‌ను కందుకతాడన నియుక్తకాష్ఠనిర్మితదండ"మనియూ, ట్రాంను విద్యుదాకర్షితపత్తన జనవాహక యంత్రమనియూ అపహాస్యకరంగా అనవలసివస్తుంది. ప్రజల నోళ్ళలో నలిగిన ఏభాష పదమునయిననూ త్యజించరాదు. యింగ్లీషునుంచీ తద్భవములై తెలుగునుడికారమునకు సరిపోయినట్టి ఆసుపత్రి, లాటీను, మొదలగు పదములను పూర్వరూపంలోనికి మార్చరాదు. వాడుకలోని ఆంగ్ల పదముల నెప్పటికిన్నీ మార్చరాదు. వాడుకలో లేని పారిభాషిక పదములకు సరియైన సంస్కృత పదములను వెంటనే విద్వాంసులు నిర్మించవలెను. ఈ విషయంలో విలంబన యేమాత్రం తగదు.

భారతజాతి పూర్వౌన్నత్యం గలది. పూర్వౌన్నత్యాన్నందుకొనవలెనంటే, మన విజ్ఞాన సంస్కృతులను ప్రపంచంలో వెదజల్లవలెనంటే సంస్కృతంకంటే అర్హమైన భాష లేదనియూ, మనకు గౌరవదాయకమై దేశభాషలకు తల్లియైన సంస్కృతాన్ని వెంటనే రాష్ట్రభాషగా అంగీకరించవలసిన బాధ్యత నాయకులపైననూ, ఆందోళన చేయవలసిన బాధ్యత ప్రజలపైననూ గల దని ఆశిస్తూ విరమిస్తున్నాను.

పశువుల దివాణం

(6 వ పేజీ తరువాయి)

దేశం జరిగింది. వేదపతకాలు వెంటనే ధరించి చిరునవ్వుతో, గడ్డిగద్దెమీద కూర్చుని గునపం ప్రతి జంతువునీవచ్చి, పళ్లెంలోవుంచిన ధనాన్ని పరీక్షించవలసిందని అడిగింది. ఒక్కొక్క జంతువూ ధనాన్ని కన్నులకరువు తీరేలా పరీక్షించింది. పంచకల్యాణి ముట్టెతో వాసన చూసింది.

మూడుదినాల తర్వాత, పశువుల దివాణంలో పెద్ద అలజడి చెలరేగింది. సైకిలు తొక్కుకుంటూ, కంగారుగా తిమ్మయ్యవచ్చి, తిన్నగా భవనంలోకి పరుగెత్తాడు. గునపం గదిలోంచి పెద్దపెద్ద కేకలు వినిపించాయి. అబ్బాయినాయుడిచ్చినసొమ్ము దొంగనాణా లన్నవార్త దివాణమంతా ప్రాకింది. తక్షణం జంతువులను సమావేశపఱచి, అబ్బాయినాయుడిపై, గునపం మరణశిక్ష విధించింది. నాయుడు ప్రాణాలతో పట్టుబడ్డనాడు, అలానే ఉడకపెట్టా లంది.

"నేస్తాలూ! వాడు మనకి పరమశత్రువు. నమ్మించి మిత్రద్రోహం చేశాడు. కొంతమంది మనుషులను వెంటేసుకుని, వాడు ఏ నిమిషాన్నైనాసరే మనపైకి విరుచుకుపడొచ్చును. అందుచేత అందరూ జాగ్రత్తగా మసులుకోండి. దివాణంద్వారాలవద్ద కొంతమందిని కాపలా వుంచండి. పోతురాజుస్నేహాన్ని అర్థించేందుకు నాల్గు పావురాలను ఉత్తర మిచ్చి పంపాను. జాగ్రత్తగా ఉండండి."

అనుకున్నదంతా జరిగింది. ఉదయమే జంతువులు తిండి తింటూంటే, ద్వారాలు బద్దలుకొట్టి, అబ్బాయినాయుడు లోనపడ్డాడని, కాపలా జంతువులు, పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పాయి. ధైర్యంతో యుద్ధంచేయడానికి జంతువులు సిద్ధపడ్డాయి. కాని, పోయినసారి గోశాల యుద్ధంలో కల్గినంత సులువుగా విజయం చేకూరే సూచనలు కనిపించలేదు. ఆరుతుపాకులు పట్టుకుని పదిహేనుగురు మనుష్యులు లోన ప్రవేశించడం తడవుగా కాల్చడం మొదలైంది. జంతువులు గుళ్లదెబ్బలకి తట్టుకోలేకపోయాయి. జంతువులను పారిపోవద్దని, గునపం, పంచకల్యాణీ కేకలెట్టాయి. కాని అవి తోకలు ముడిచాయి. కొన్ని గుళ్లదెబ్బలకి బలిఐపోయాయి. జంతువులు భయపడి భవనంలోదూరి తలుపు వేసుకుని, తలుపు సందుల్లోంచి బైట జరుగుతూన్న యుద్ధం చూశాయి. పశువుల దివాణం—గాలిమర సహా—శత్రుహస్తగతమైపోయింది. గునపానికి, యేం చేయడానికీ పాలుపోయింది కాదు. పోతురాజు సహాయంగురించి ఆలోచించింది. అంతలోకే, పోతురాజుదగ్గిరకి పంపిన నాలుగు పావురాలూ, ప్రత్యుత్తరం పట్టుకొచ్చాయి.

ఆలోపుగా అబ్బాయినాయుడుబృందం గాలిమరప్రాంతం చేరింది. ఆ దృశ్యాన్ని జంతువులన్నీ ప్రాణాలు ఉగ్గపెట్టుకు చూస్తున్నాయి. గాలిమర తవ్వేందుకు ఇద్దరు మనుష్యులు, గునపం పారపట్టుకు సిద్ధమవుతున్నారు.

"అసంభవం! గాలిమరగోడలు తవ్వడం వాళ్లతరం కాదు. ఒకవేళ తవ్వడానికి పూనుకుంటారే అనుకుందాము. సరిగ్గా తవ్వేందుకు ఒకవారం పడుతుంది. ఫర్వా లేదు! ధైర్యంగా ఉండండి నేస్తాలూ!"అని గునపం జంతువులకి ధైర్యం చెప్పింది.

మనుష్యుల ప్రవర్తనమాత్రం ముసలి వెంకన్న చాలా జాగ్రత్తగా పరిశీలిస్తూంది. గాలిమర పునాదిలో, ఆ మనుష్యులు ఒక కన్నం చేస్తున్నారు.

"అనుకుంటూన్నదే జరుగుతూంది. ఆ కన్నంలో ఇంత మందు కూరుతారు. కూరి నిప్పంటిస్తారు! ఇంక గాలిమర ఎక్కడ నిలుస్తుంది?" అని వెంకన్న కళ్లు మూసుకుంది.

ఏ నిమిషాన్ని గాలిమర కూలిపోతుందో అని హడులెత్తిపోయి జంతువులన్నీ కన్నీళ్లు కార్చాయి. కొద్దినిమిషాలైనతర్వాత, అన్ని దిక్కులకీ మనుష్యులు పారిపోయారు. తర్వాత పెద్దశబ్దంతో గాలిమర రూపులేకుండా చెల్లాచెదరైపోయింది. ఆ శబ్దానికి జంతువులు హడిలిపోయి, కళ్లూ, చెవులూ మూసుకున్నాయి. శబ్దం తగ్గిపోగానే జంతువులు కళ్లు తెరిచి చూస్తే, గాలిమర ప్రదేశంలో పెద్దపొగతప్ప మరేమీ కనిపించలేదు. గాలిమర నేలకూలిపోయింది!

గాలిమర కూలిపోడం చూడగానే జంతువులకి ఎక్కడలేని మొండిధైర్యం వచ్చింది. 'ప్రతీకారం, ప్రతీకారం'మంటూ ఒక్కసారిగా బైటకివచ్చి, అతిశత్రువులమీదకి విరుచుకుపడ్డాయి. గుళ్లు దూసుకుపోతూన్నా అవి లెక్కచేయలేదు. పోరు ఘోరంగా సాగింది. మానవులు, తుపాకులు అదే పేల్చడం మొదలెట్టారు. జంతువులు దగ్గిరకి రావడంతోనే, కర్రలతో కొట్టి, కాళ్లతో తన్నారు. ఒక ఆవు, మూడు మేకలూ, రెండు బాతులూ, చచ్చిపోయాయి. తక్కిన జంతువులు గాయపడ్డాయి. చివరకు గునపం తోకచివర ఒక గుండు దూసుకుపోగా కొన్ని వెంట్రుకలు రాలిపోయాయి. ఇంక శత్రువులలో, పంచకల్యాణితాపులతో ముగ్గురి తలలు పగిలిపోయాయి. మరొకడి కడుపు, ఆవు కొమ్ములు గుచ్చుకుని చీల్చుకపోయింది. రెండు కుక్కలు ఒక మనిషి కట్టుకున్న పంచి చీల్చి పూర్తిగా చింపేశాయి.

గునపం కాపలా కుక్కలు తొమ్మిదీ, డొంకచాటునుంచి మనుష్యులమీద కురకగానే, వారు హడులెత్తిపోయారు. పారిపొమ్మని అరుస్తూ, అబ్బాయినాయుడు కాళ్లకి బుద్ధి చెప్పాడు. పాలాలమ్మట పడి అడ్డదిడ్డంగా పరుగెడుతూన్న మానవులను, జంతువులు తరిమి తరిమి తన్నులు తన్నాయి. ముళ్లడొంకలని లెక్కచేయక, మానవులు ప్రాణాలతో దివాణం నుండి బైటపడ్డారు.

ఆ రెండవ యుద్ధంలోకూడా జంతువులదే అఖండవిజయం. కాని రక్తసిక్తమైపోయాయి వాటి తనువులు. తోటిజంతువులు కొన్ని నేలమీద చచ్చిపడి ఉండడంచూసి, అవి కంటనీరెట్టుకున్నాయి. గాలిమర నిల్చిన తావు దగ్గిరకి పోయి కొద్దినిమిషాలపాటు విచారంతో నిలబడ్డాయి. గాలిమర, నామరూపాలు లేకుండా నాశనమైపోయింది. అవి పడిన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. కొంతమట్టుకు పునాదులు కూడా ధ్వంసమయాయి. పైగా పునర్నిర్మాణానికి రాలిపోయిన రాళ్లను ఉపయోగించేందుకు వీలుండదు. కారణం, రాళ్లు కూడా నుసిఐపోయాయి. నుసికాకుండా మిగిలినవి నలుదిక్కులా చెల్లాచెదరైపోయాయి. అలిసిపోయి, కుంటుతూ, తూలుతూ బడలికతో జంతువులు దివాణం చేరుతూండగా, గెంతుతూ నవ్వుకుంటూ రౌడీ వాటి కెదురుగా వచ్చింది యుద్ధం జరుగుతూన్నప్పుడది ఎక్కడికి వెళ్ళిందో ఎవరికీ తెలియదు.



విమానయానంలో పూర్వపువేగాలని మించి విమానం నడిపించిన వైమానికురాలు మిస్ లెట్టీకర్టిస్.

దివాణం భవనాల ప్రాంతంనుంచి, తుపాకీ కాల్పులశబ్దం రాగానే—

"తుపాకీ ఎందుకు పేలుస్తున్నారు?" అని పంచకల్యాణి ప్రశ్నార్థకంగా రౌడీవైపు చూసింది.

"మనం సాధించిన విజయచిహ్నంగా!"

"విజయం యేమిటి?"

"ఏం విజయం అని అడుగుతావేమిటి పంచకల్యాణీ? మన నేలమీదనుంచి-పరమపవిత్రమైన మన పశువులదివాణంనుంచి శత్రువులను ఓడించి తరిమివేశాముగా!"

"కాని, వాళ్లు గాలిమర నాశనంచేశారు. దానిని కట్టేందుకు మనం రెండుసంవత్సరాలు, రాత్రింబగళ్లు కష్టపడ్డాము!"

"ఐతే యేం! మరో మర కట్టుకుందాము. మనం తల్చుకుంటే, ఒకటికాదు, అరడజను గాలిమరలు కట్టివేయగలము. ఎంత అద్భుతంగా యుద్ధంచేసి మానవులకి బుద్ధిచెప్పామని! అంతా గునపం నాయకత్వంవల్లనే అనుకో!"

"ఐతే, రౌడీ! నీ వనేది, మనం మళ్ళా మన దివాణాన్ని సంపాదించుకున్నామన్న మాట! ఔరా!"

"అదే! మరి మనం యుద్ధం నెగ్గామన్నమాటేగా!" అని రౌడీ ఆనందం పట్టలేక గెంతింది.

పంచకల్యాణీ, యుద్ధంలో బాగా దెబ్బలు తింది. దాని మోకాళ్లమ్మట రక్తం కారుతూంది. ఒక కాలిడెక్క పూర్తిగా చీలిపోయింది; వెనక కాలి చట్టలో ఒక అరడజను గుళ్లు దూరిపోయాయి.

జంతువులన్నీ కుంటు కుంటూ దొడ్లోచేరుకున్నాయి. గుళ్లదెబ్బలతో పంచకల్యాణి చాలా బాధపడింది. గాలిమర కట్టవలసిన పని తిరిగి ప్రారంభించాలని అది మనస్సులో నిశ్చయించుకుంది. అదే మొదటిసారి పంచకల్యాణి, తన వయస్సుగురించి ఆలోచించడము. పదకొండు సంవత్సరాలొచ్చాయి. మునుపున్న శక్తితో తిరిగి పనిచేయగలనా అని అది అనుకుంది.

పచ్చజండా ఎగురుతూండడం - ఏడుసార్లు తుపాకీ పేల్చడం—విజయోత్సాహంతో, జంతువులనన్నిటినీ అభినందిస్తూ గునపం ఉపన్యసించడం-చూసి జంతువులు అమితానందం పొందాయి. యుద్ధంలో ప్రాణాలు ధారపోసిన జంతువులకి, వీరోచితమైన దహనసంస్కారం జరిగింది. విజయోత్సవాలు రెండుదినాలు జరిగాయి. పాటలతో, ఉపన్యాసాలతో మిన్ను ప్రోగిపోయింది. పెద్దపెద్ద విందులు జరిగాయి. గాలిమర వద్ద జరిగిందికొబట్టి 'గాలిమరయుద్ధం' అని గునపం రెండవ యుద్ధానికి పేరెట్టింది. 'పచ్చబావుటారక్షకుడు' అనే బిరుదు గునపం తనకు తానే స్వీకరించింది. అబ్బాయినాయుడు చెల్లని నాణాలలో కలప ఖరీదు చెల్లించాడన్నమాట, ఆ విజయోత్సవ సంభ్రమంలో, జంతువులు మరిచిపోయాయి.

కొన్ని దినాలతర్వాత దివాణంభవనంలోని సారాసీసాల పెట్టె పందులకళ్ల పడింది. ఒకరోజు రాత్రి భవనంలోపలినుంచి 'మూగజీవాలపాట' గట్టిగా బైటకి వినపడింది. ఆ రాత్రే తొమ్మిదున్నర దాటంతర్వాత గునపం బైటకొచ్చి, దొడ్డిచుట్టూ గంతులేసి లోపలికి పారిపోయినట్లు జంతువులు కనిపెట్టాయి. కాని తెల్లారిమాత్రం దివాణం భవనం అతి నిశ్శబ్దంగా, ఎటువంటి అలజడీ లేకుండాఉంది తెల్లారి తొమ్మిదవుతుంది. తేలిపోతూన్న నిద్రబద్ధకంతో, తూలుతూ నడుస్తూ రౌడీ బైటకొచ్చి—

"నేస్తాలూ! నాయకుడు గునపం మరణశయ్యమీద ఉన్నాడు" అని విచారంగా జంతువులకి చెప్పింది.

ఒక్కమాటుగా జంతువులన్నీ బావురుమంటూ యేడ్చాయి. భవనంలోకి నడిచిపోయేదారంతా గడ్డితో కప్పబడివుంది. నిమ్మదిగా చప్పుడు చేయకుండా, బొటనవేళ్లమీద నడుచుకుంటూ గునపాన్ని చూడ్డాని కవి, లోపలికి వెళ్లాయి.

"మన నాయకుడు మరణిస్తే ఎలాగ?" అని అవి ఒకదాని నొకటి ప్రశ్నించుకున్నాయి. గునపం తినే ఆహారంలో రౌడీ విషం కల్పిందని పుకారు బైల్దేరింది. భవనం విడిచి తిరిగి వెళ్లిపోతూన్న జంతువులను ఆపి—


"నేస్తాలూ! నాయకుని అంతిమ ఉత్తరువు ఏమిటంటే—ఏ జంతువు త్రాగినా మరణశిక్ష విధించబడుతుం"దని చెప్పి రౌడీ వెళ్లిపోయింది.

గునపం సాయంత్రానికల్లా ఆరోగ్యంగా కనిపించింది. సారా తయారీ విషయమై చదివేందుకుగాను, ఏదేనా ఒక పుస్తకాన్ని, ప్రక్కవూళ్లో కొని తెమ్మనమని గునపం తిమ్మయ్యతో చెప్పినట్లు వినికిడి. జామితోట కవతలగా, గొడ్లు మేసేందుకు కేటాయించిన పచ్చికబీడు దున్నమని, గునపం ఆజ్ఞా యిచ్చింది: ఎందుకో అని జంతువులు విస్తుపోయాయి. ఆ పొలంలో గంజాయిమొక్కలు గునపం నాటించింది.


ఆ దినాలలోనే ఒక వింత జరిగింది. కాని ఏ జంతువుకే బోధపడిందికాదు. ఒకరోజు రాత్రి పన్నెండు ఘంటలవేళ దొడ్లో పెద్ద చప్పుడైంది. నిద్రపోతూన్న జంతువులు ఉలిక్కిపడి లేచి శబ్దంవచ్చిన ప్రదేశానికి పరుగెత్తాయి. సప్తవిధులూ వ్రాసిన గోడక్రిందుగా నిచ్చెన రెండు ముక్కలుగా విరిగి పడివుంది. ఆ నిచ్చెన ప్రక్కనే లేవలేక లేవలేక లేస్తూన్న రౌడీ వాటికి కనిపించింది కొంచం దూరంగా లాంతరూ, కుంచా, తెల్లరంగుకుండా పడివున్నాయి. రౌడీ లేవగానే, కుక్కలు దానిని నెమ్మదిగా నడిపించుకుని భవనం చేర్చాయి. జంతువులకేమీ అర్థమైందికాదు. వెంకన్నమాత్రం, అర్థమైనట్లు తల వూపింది కాని పైకి ఏమీ చెప్పలేదు.

కొద్ది దినాలతర్వాత, పిచ్చాడు సప్తవిధులూ తనలో తాను చదువుకుంటూంటే, మరొక క్రొత్త విధి, గోడమీద కనిపించింది. ఐదో విధి ఏమిటంటే—"ఏ జంతువూ మద్యపానము చేయకూడదు." ఆ విధికి బదులుగా "ఏ జంతువూ మితిమీరి మద్యపానము చేయకూడదు" అనే మార్పు కనిపించింది.


వార్తాచిత్రాలు




స్వామీ రామానందతీర్థ మాడపాటి రామచంద్రరావు,
ఇతర సంస్థాన కాంగ్రెసు ప్రముఖులు




ఢిల్లీలో కాందిశీకులకు నిర్మించిన లజపతిరాయి మార్కెట్ ప్రారంభోత్సవ సమయమున
ప్రధాని నెహ్రూ ఉపన్యసించుట.



క్రొత్తగవర్నరుకు మద్రాసు కార్పొరేషను సన్మానపత్ర మిచ్చినప్పుడు తీసినచిత్రం.
కమిషనరు సి. నరసింహము, గవర్నరు సతి, గవర్నరు, మేయరు, యు. కృష్ణారావు
గారు వరుసగ నున్నారు.



ఢిల్లీ ప్రభుత్వభవనంలో ఘూర్ఖా సైనికులకు చిత్రములను
బహూకరించుచున్న గవర్నర్ జనరల్ రాజాజీ.



భారతనౌకాదళాధిపత్యమును విరమించిన రియర్ అడ్మిరల్ హాల్‌గారు,
వారిస్థానము స్వీకరించిన వైస్ అడ్మిరల్ పారిగారు.



భారత నౌకాదళ రియర్ అడ్మిరల్ సేనాధిపతి జె. టి. ఎస్. హాల్ మార్పుగ సందర్భమునకేపను కూరపాటి లక్ష్మీకాంతరావుగారు, వారి సతీమణి శ్రీమతి సరస్వతీరావుగారు. 14 ఆగష్టు, 1948 నాడు క్రొత్త ఢిల్లీలో యిచ్చిన విందులోని దృశ్యము. ఎడమనుండి కుడివైపుకు రియర్ అడ్మిరల్ హాల్ సతీమణి, శ్రీమతి కూరపాటి సరస్వతీరావు గారు, వైస్ అడ్మిరల్ పారీ, రాయల్ ఇండియన్ నేవీ సేనాధిపతి, వారి సతీమణి, కూరపాటి లక్ష్మీకాంతరావుగారు.

Regd. No M. 4479

శ్రీమద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు



ఐదవ ముద్రణము

సంస్కృతమూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు


వెల రు 4-0-0 లు.

తపాలాఖర్చు రు. 0-9-0.

పోస్టుబాక్సు **212**, **ఆంధ్రగ్రంథమాల** మదరాసు 1.

గాంధీమహాత్ముని

ఆత్మకథ



రెండుసంపుటములు

[చతుర్థముద్రణము]

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి అనువాదము

ఖద్దరు బైండు

ప్రతిసంపుటము పోస్టేజితో సహా వెల రూ. 5-9-0


ఒకేసారి 2 సంపుటములు పోస్టేజితో రు 10-12-0

కళాప్రపూర్ణ

కీ॥ శే॥ కాశీనాధుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన

ఆంధ్రవాఙ్మయ చరిత్ర



సరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష.
వెయ్యేండ్ల వాఙ్మయ చరిత్రకువిశుద్ధదర్పణం. పాతచరిత్రల నన్నిటిని అవలోడనచేసి,
సమన్వయించి క్రోడీకరించిన సిసలయిన చరిత్ర.
శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండిఉండి, నన్నయ ధర్మమా
అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైటపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన
వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం

వెల రు 2-0-0లు, తపాలాఖర్చు ప్రత్యేకము.

ఆంధ్రగ్రంథమాల,

పోస్టు బాక్సు నం. 212, మదరాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press 7, Thambu Chetty St. G. T. Madras.